thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 351 కరీంనగర్ బుధవారం, 26 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పాక్‌లో విదేశీయుల కిడ్నాప్‌నకు ఉగ్ర యత్నాలు

న్యూఢిల్లీ : పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను వీక్షించేందుకు వచ్చే విదేశీ పర్యాటకులకు ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని ఆ దేశ ఇంటెలిజెన్స్ విభాగం హెచ్చరించింది. ఇస్లామిక్ స్టేట్ ఖొరాసాన్ ప్రావిన్స్ (ఐఎసకేపీ) సంస్థ విదేశీ అతిథులను కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసే ప్రమాదముందని వెల్లడించింది. ముఖ్యంగా చైనీయులు, అరబ్ జాతీయులను లక్ష్యంగా చేసుకోవచ్చని తెలిపింది. ఐఎసకేపీకి చెందిన వ్యక్తులు నగర శివార్లలో ఇళ్లను అద్దెకు తీసుకుని... సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో రిక్షా, బైకులు మాత్రమే వెళ్లే చోట విదేశీయుల కిడ్నాపలకు ప్లాన్ చేస్తున్నారని పేర్కొంది. ఇటు అఫ్గనిస్థాన్ నిఘా విభాగం (జీడీఐ) కూడా ఐఎసకేపీ దాడులు తెగబడే ప్రమాదముందని అధికారులను అప్రమత్తం చేసింది.

# చివరి దశకు కుంభమేళా!

## నేటితో ముగియనున్న 'మహా కుంభ్'
## ఇప్పటికే ఆరవై లక్షలు దాటిన భక్తులు
## నేడు మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు



మహా కుంభ మేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. లక్షల సంఖ్యలో తరలి వెళ్తోన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో పండగ వాతావరణం నెలకొంది. దేశం నలుమూలల నుంచీ వస్తోన్న భక్తులతో ఈ సిటీ క్రిక్కిరిసిపోతోంది. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి చేరుకుంటోన్న జనం గంగా-యమున-సరస్వతి త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలను ఆచరిస్తోన్నారు. ఇప్పటికే పుణ్యస్నానాలను ఆచరించిన వారి సంఖ్య 60 కోట్లను దాటింది కూడా. సోమవారం నాటికి 62 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలను ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఉదయం 8 గంటల వరకు 31 లక్షలమంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. భక్తుల తాకిడికి ప్రయాగ్‌రాజ్ కిటకిటలాడుతోంది. కిందటి నెల 13వ తేదీన మహా కుంభమేళా ఆరంభమైన విషయం తెలిసిందే. ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినంతో ముగియబోతోంది. ఇంకొక్కరోజే మిగిలివుంది మహా కుంభమేళా సమాప్తి కావడానికి. ఈ నేపథ్యంలో భక్తుల సంఖ్య రెట్టింపు అవుతోంది. త్రివేణి సంగమం జనసంద్రంగా మారుతోంది. నేడు, రేపు కనీసం రెండు కోట్లమందికి భక్తులు పుణ్యస్నానాలను ఆచరించే అవకాశం ఉన్నట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. మహా శివరాత్రి నాడు మహా కుంభ మేళాలో అమృత్ స్నానాన్ని ఆచరించడాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తోన్న నేపథ్యంలో అఘోరీలు, వివిధ అఖాడాలకు చెందిన సాధువులు త్రివేణి సంగమానికి రానున్నారు. మకర సంక్రాంతి తొలి అమృత్ స్నాన పర్వదినం. దీని తరువాత మౌని అమావాస్య, వసంత పంచమి, మాఘి పూర్ణిమ, మహా శివరాత్రి.. ఈ నాలుగు పుణ్య ఘడియల్లో తప్పనిసరిగా త్రివేణి సంగమ స్నానం చేయాలంటూ పురాణాల్లో ఉందని సాధవులు చెబుతున్నారు. భక్తల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ప్రయాగ్‌రాజ్, త్రివేణి సంగమం ఘాట్లన్నింటినీ నో వెహికల్ జోన్‌గా ప్రకటించింది ప్రభుత్వం. ఘాట్లకు వెళ్లే మార్గాలన్నింట్లో వాహనాల రాకపోకలను నిషేధించింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలు కూడా నగరం బయటే నిలిపివేయాల్సి ఉంటుంది. త్రివేణి సంగమం నోస్ పాయింట్‌తో పాటు ఇతర ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

**మరోసారి ఆంక్షలు**... మహా శివరాత్రి, చివరి రోజు కావటంతో కుంభమేళాకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా యూపీ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో మరోసారి కుంభమేళాలో ఆంక్షలు విధించారు. కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా ప్రకటిస్తున్నట్లు అధికారులు చెప్పారు. సాయంత్రం 6 గంటల నుంచి ఈ ఆంక్షలు ప్రయాగ్‌రాజ్ మొత్తం అమల్లో ఉంటాయన్నారు. స్థానికుల కోసం నిత్యావసరాలు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ప్రజలకు ఉచిత ఆహార, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు తమ సమీపంలోని ఘాట్‌లలోనే పుణ్యస్నానాలు ఆచరించాలని సూచించారు. ఇక ఇప్పటివరకు పవిత్ర త్రివేణి సంగమంలో 60 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

**మహా శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు**... మహాకుంభమేళాలో ఇప్పటివరకూ 63 కోట్ల మందికిపైగా జనం పుణ్యస్నానాలు ఆచరించారని గణాంకాలు చెబుతున్నాయి. మహాకుంభమేళాకు వస్తున్న భక్తుల సంఖ్య ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను నెలకొల్పుతోంది. శివరాత్రి రోజున త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించాలని చాలామంది భక్తులు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పలు ఏర్పాట్లు చేస్తోంది. మహాశివరాత్రి పుణ్య స్నానాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు డీఎం రవీంద్ర కుమార్ మందర్ తెలిపారు. ఈ రోజు(మంగళవారం) మహా కుంభమేళాలో 44వ రోజు. ఇప్పటివరకు 63 కోట్లకు పైగా భక్తులు త్రివేణీ సంగ మంలో స్నానాలు చేశారు. చివరి మహా కుంభ స్నానం ఫిబ్రవరి 26న జరగనుంది. సగటున ప్రతిరోజూ కోట్లాది మంది పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దానిని క్లియర్ చేసేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**ప్రత్యేక రోజుల్లో..** పుష్య పూర్ణిమ రూ. 1.70 కోట్ల మంది పవిత్ర స్నానం చేశారు. మకర సంక్రాంతి నాడు 3.50 కోట్ల మంది, మౌని అమావాస్య నాడు 7.64 కోట్ల మంది, వసంత పంచమి నాడు 2.57 కోట్ల మంది, మాఘ పౌర్ణమి వేళ రెండు కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించారు.

## నోటిఫికేషన్ ఓకే.. కారు మాటేంటి? రేసులో ఉంటుందా?

హైదరాబాద్ : తెలంగాణ మళ్లీ పొలిటికల్ హీట్ మొదలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించింది ఎన్నికల సంఘం. దీంతో తెలంగాణలో ఐదు సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. అన్నింటినీ అధికార పార్టీ దక్కించుకుంటుందా? కారుకి ఏమైనా ఛాన్స్ ఇస్తుందా? ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎత్తులకు కేసీఆర్ చిత్తవుతారా? పొలిటికల్ సర్కిల్స్‌లో దీనిపై చర్చ జోరుగా సాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఫోకస్ చేశాయి. దీనికి కావల్సిన సంఖ్యా బలం బీజేపీ వద్ద లేదు. దీంతో అధికార కాంగ్రెస్ -బీఆర్ఎస్ మధ్య పోటీ షురూ అయ్యింది. ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో అధికార పార్టీ నుంచి చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. తమకు తెలిసిన వారి ద్వారా లాబీయింగ్ చేసే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. తెలంగాణలో ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. వారిలో మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన మల్లేశం గతేడాది అధికార పార్టీలో చేరిపోయారు. ఇక రియాజుల్ హాసన్ మజ్లిస్ నేత. మిగిలిన వారంతా బీఆర్ఎస్‌కి చెందిన నేతలే ఉన్నారు. ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్ని ఒక్కసారి పరిశీలిస్తే.. అధిక సీట్లు అధికార కాంగ్రెస్





పార్టీ సొంతం చేసుకోనుంది. ఒక్క స్థానం ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. తమ స్థానాన్ని తమకే ఇవ్వాలని మజ్లిస్ పట్టుబడితే ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇక ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అధికార పార్టీ నుంచి పలువురు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. రెడ్డి సామాజికవర్గం నుంచి జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. కమ్మ సామాజికవర్గం నుంచి కుసుమ కుమార్, ముదిరాజ్ సామాజికవర్గం నుంచి సునీతారావు పేరు ఉన్నాయి. బీసీ సామాజికవర్గం నుంచి మధుయాష్కీ, చరణ్ కౌశిక్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, వజ్రేష్ యాదవ్ పేర్లు బయటకు వచ్చాయి. మైనారిటీ నుండి ఫహీం ఖురేషి, అజారుద్దీన్, షబ్బీర్ అలీ, ఫిరోజ్‌ఖాన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్సీ సామాజికవర్గం నుంచి సంపత్ కుమార్, అద్దంకి దయాకర్, ఎస్టీ సామాజికవర్గం నుంచి బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఉన్నారు. అంతా అనుకూలిస్తే కేవలం మూడు లేదా నాలుగు వర్గాల ఒకొక్కరి పేరు మాత్రమే ఫైనల్ కానుంది. ఇక బీఆర్ఎస్ విషయానికొద్దాం. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారిపోయారు. వారితో కలుపుకుని బీఆర్ఎస్ సంఖ్య 38 మందికి చేరుకోనుంది. పార్టీని వీడిన వారంతా అధికార పార్టీకి మద్దతు ఇవ్వడం ఖాయం. ఎందుకంటే మారిన పది మంది ఎమ్మెల్యేలపై ఇప్పటికే కారు పార్టీ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఈ క్రమంలో ఒక్క ఎమ్మెల్సీ స్థానానికే పరిమితం కానుంది. అలాకాకుండా రెండో స్థానానికి మరొక అభ్యర్థిని రంగంలోకి దించుకుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ విషయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండబోతోంది? ఒకవేళ ఒక్క సీటు ఎవరికి ఇవ్వనున్నారు? బీసీలకు ప్రయార్టీ ఇస్తారా? సత్యవతి రాథోడ్‌కు మళ్లీ ఛాన్స్ ఇస్తారా? కేసీఆర్ మదిలో ఏముందో ఎవరికి ఎరుక.



## టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

ఈ నెల 28న ఉదయం 11 గంటలకు టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరగనుంది. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ అధ్యక్షతన గాంధీ భవన్ లో సమావేశం జరగనుంది. ఏఐసీసీ ఇన్చార్ గా నూతనంగా నియామకం అయిన మీనాక్షి నటరాజన్ గారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , ఏఐసీసీ కార్యదర్శులు విష్ణు నాథ్, విశ్వనాథన్ ముఖ్య ఆతిథులుగా పాల్గొంటారు.

ఈ సమావేశంలో పీఏసీ, పీఈసి సభ్యులు మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల చైర్మన్ లు, కార్పొరేషన్ చైర్మన్ లు, నియోజక వర్గాలలో పోటీ చేసిన అభ్యర్థులు, అధికార ప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొంటారు.రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చ ఉంటుంది.




## ఒకేరోజు లక్షకొత్త కార్డులు జారీకి
# రేవంత్ సర్కార్ సన్నాహాలు!
## వెల్లడించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : మార్చి 1న కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ట్వీట్ చేశారు. ముందుగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాల్లో పంపిణీ చేయనున్నట్లు ఎక్స్‌లో తెలిపారు. ఒకే రోజు లక్ష కొత్త కార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 8 తర్వాత ఇతర ప్రాంతాల్లోనూ ఇస్తామని చెప్పారు. పదేళ్ల తర్వాత పేద బిడ్డల కల నెరవేరుతోందని రాసుకొచ్చారు.

**తెలంగాణలో ఒక్కరోజే లక్ష కొత్త రేషన్ కార్డులు**... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం- కొత్త రేషన్ కార్డులను జారీ చేసే దిశగా నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ శుభవార్త వినిపించింది. ఒకే రోజున లక్ష కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనుంది. దీనికి ముహూర్తం కూడా ఖరారు చేసింది. కొత్త రేషన్ కార్డులను జారీ చేయడానికి ఉద్దేశించిన విధి విధానాలు, మార్గదర్శకాలను రేవంత్ సర్కార్ ఇదివరకే విడుదల చేసిన విషయం తెలిసిందే. రేషన్ కార్డులపై చాలాకాలంగా అపరిష్కృతంగా ఉంటూ వస్తోన్న విజ్ఞప్తులను పరిష్కరించే దిశగా ముందడుగు వేసింది తెలంగాణ ప్రభుత్వం. సంక్రాంతి పండగను పురస్కరించుకుని దీన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి జిల్లా కలెక్టర్లు/గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీఓ/పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్‌కు ఈ జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామ సభ, వార్డు సభల్లో ప్రదర్శిస్తారు. అందులో పొందుపరిచిన వివరాలను చదివి వినిపిస్తారు. దీనిపై చర్చించిన తరువాత ఆమోదిస్తారు.

గ్రామ లేదా వార్డు సభల్లో ఆమోదం పొందిన లబ్దిదారుల అర్హత జాబితాను మండలం/మున్సిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్/జీహెచ్ఎంసీ కమిషనర్ లాగిన్‌కు పంపించాల్సి ఉంటుంది. ఈ జాబితా పట్ల జిల్లా కలెక్టర్/జీహెచ్ఎంసీ కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేస్తే పౌర సరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపిస్తారు. దీని ఆధారంగానే పౌర సరఫరాల శాఖ కమిషనర్ కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తికి ఒకే ఒక్క రేషన్ కార్డు ఉండేలా చర్యలు తీసుకుంటారు అధికారులు. రేషన్ కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపు చర్యలను సంబంధిత అధికారులు చేపడతారు. ఇందులో భాగంగా కిందటి నెల 26వ తేదీన ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు కూడా. 16,900 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చారు. మరో విడతలో భాగంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు అధికారులు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల రేషన్ కార్డులు వినియోగంలో ఉంటోన్నాయి. దీనికి అదనంగా కొత్తగా మరో ఆరు లక్షల వరకు కార్డులు అందజేయనుంది ప్రభుత్వం.

చురకలు





## దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించండి తర్వాత మేం చూసుకుంటం

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను రక్షించేదే బీజేపీ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. మంగళవారం (ఫిబ్రవరి 25) ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు మీకు చేతకాకపోతే సీబీఐకి అప్పజెప్పండి. ఆ తర్వాత మేం చూసుకుంటాం. దమ్ముంటే కేసును సీబీఐకి అప్పగించడని సవాల్ విసిరారు. మేము కేసీఆర్ బిడ్డను లిక్కర్ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపించి చూపించాం. మరీ కేసీఆర్ కుటుంబంపై ఎన్నో కేసులు ఉన్నా.. వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదు..? ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదు..? అని ప్రశ్నించారు. మీరు చర్యలు తీసుకోవాల్సింది పోయి నెపం మాపై పెడతారా అని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలు నిందితులు విదేశాలకు పారిపోయేలా చేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు కేసుల్లో కేసీఆర్?కి ఇప్పటి వరకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదు..? ఫార్ములా ఈ కేసులో ఆర్గనైజర్‌ని ఎందుకు అక్యూజుడ్?గా చేర్చలేదు..? జన్వాడ ఫాంహౌస్ ఎందుకు కూల్చడం లేదు.. ఇది హైడ్రాలో లేదా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వానికి ముడుపులు ముట్టాయి కాబట్టే ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇక, కుల గణనకు మేం వ్యతిరేకం కానేకాదని.. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలోనూ ఎప్పటి నుండో దూదేకుల కులాలకు రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని... మేం ఏనాడూ అభ్యంతర పెట్టలేదన్నారు. కానీ 12.5 శాతం ఉన్న ముస్లిం జనాభాలో 10 శాతం మందిని బీసీల్లో కలుపుతామంటే ఎందుకు ఒప్పుకుంటాం..? అని అన్నారు. నూటికి 88 మందికిపైగా ముస్లింలను బీసీల్లో కలిపి నిజమైన బీసీల పొట్టకొడతారా..? అని ఫైర్ అయ్యారు. ముస్లింలందరినీ బీసీల్లో చేర్చి బిల్లు పంపితే ఎందుకు ఆమోదించాలి..? అని ప్రశ్నించారు. మీరు చేసిన సర్వేలో 60 లక్షల మంది బీసీల జనాభా ఎట్లా తగ్గిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఛాంపియన్స్ ట్రోఫిలో భాగంగా జరిగిన ఇండియా పాకిస్తాన్ మ్యాచ్?లో భారత్ గెలిచింది.. మాది ఇండియా జట్టు. ఎంఐఎంతో అంటకాగుతున్న కాంగ్రెస్‌ది పాకిస్తాన్ టీం. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో తెలంగాణలో ఇండియా, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ జరగబోతోంది. ఇండియా గెలవాలనుకుంటే బీజేపీకి ఓటేయండి. పాకిస్తాన్ గెలవాలనుకుంటే కాంగ్రెస్?కు ఓటేయండి" అని బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే పట్టభద్రుల, టీచర్ల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.



## గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్: హెల్త్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు హైదరాబాద్ వేదికగా బయో ఆసియా సదస్సు-2025 జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందన్నారు. ఈ రంగానికి సంబంధించి నగరంలో గొప్ప నిపుణులున్నారన్నారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ రాబోతున్నాయని.. భారత్‌లోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కేంద్రంగా నగరం మారిందన్నారు. "హైదరాబాద్‌ను సరికొత్త ఆవిష్కరణల కేంద్రంగా మారుస్తాం. రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ ఎకానమీగా మార్చాలనేదే ప్రభుత్వ లక్ష్యం. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. లైఫ్ సైన్సెస్ రంగంలో క్వీన్స్ లాండ్ యూనివర్సిటీకి మంచి పేరుంది. విదేశీ వర్సిటీల నిపుణులు.. ఫార్మా రంగం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఫార్మా రంగం అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తోంది. ఏఐ, క్వాంటమ్, రోబోటిక్స్ సాయంతో వైద్య రంగం రూపురేఖలు మారుతున్నాయి. ఇక్కడి ఎకో సిస్టమ్ అంతర్జాతీయ కంపెనీలను ఆహ్వానిస్తోంది. మా ప్రభుత్వ విధానాలు చూసి అంతర్జాతీయ కంపెనీలు వస్తున్నాయి. దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించే రాష్ట్రంగా తెలంగాణ మారింది. ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో మిగతా రాష్ట్రాలకంటే ముందున్నాం. హైదరాబాద్‌కు వచ్చే కంపెనీల ద్వారా 5 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయి" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## బండి సంజయ్ వ్యాఖ్యలు.. సీతక్క మాస్ వార్నింగ్


హైదరాబాద్, ఫిబ్రవరి 25: బీజేపీ టీం ఇండియా, కాంగ్రెస్ పాకిస్తాన్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆగ్రహించారు. చెప్పుకోవడానికి అభివృద్ధి లేదని.. సబ్జెక్టు అంతకన్నా లేదన్నారు. అందుకే బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని విరుచుకుపడ్డారు. "సూటిగా బండి సంజయ్‌ను అడుగుతున్నా... పట్టభద్రులకు మీరేం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత ఉపాధి కల్పించారు? ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మారు. ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ...



దేవునికి వినియోగించే అగర్బత్తిల మీద కూడా జీఎస్టీ వేసింది. ఉన్నత విద్య మీద 18% జీఎస్టీ విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. అలాంటి బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదు. ఎన్నికలప్పుడే హిందూ ముస్లిం అని రెచ్చగొడతారు. బండి సంజయ్.. పాకిస్తాన్‌తో పోల్చి భారతదేశం గొప్పతనాన్ని తగ్గించొద్దు. పాకిస్తాన్‌తో పోల్చి దేశాన్ని కించపరచడం తప్ప మీరు దేశానికి చేసింది లేదు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికల్లోకి రండి" అంటూ సవాల్ విసిరారు.

## తెలంగాణ ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

హైదరాబాద్: ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ముఖ్య గమనిక. తెలంగాణలో నేటి సాయంత్రం నుంచి ప్రారంభం కావాల్సిన ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదా పడింది. బీటెక్, బీఫార్మసీతో పాటు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 1 నుంచి మొదలవుతుందని పరీక్ష కన్వీనర్ డీన్ కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 4.45 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా.. తాజా నిర్ణయం ప్రకారం మార్చి 1 (శనివారం) నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇదే అంశాన్ని ఎప్‌సెట్ వెబ్‌సైట్‌లోనూ అధికారులు అప్‌డేట్ చేశారు.



## కాంగ్రెస్ ఓడిపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా: మెదక్ ఎంపీ రఘునందన్ రావు



సిద్దిపేట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాస్ సవాల్ విసిరారు. పనిచేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఇవాళ(మంగళవారం) ఏబీఎన్‌తో రఘునందన్ రావు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు. ఈ కార్ రేస్ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్ చేశారు. పాత సీఎస్ సోమేష్ కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్ గేట్ కుంభకోణంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్ రావు ప్రశ్నించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏంటి?




హైదరాబాద్ : ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు కమలనాథులు.. గెలుపు అంత సులభం కాదు, ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదు అంటూ ఇటు అభ్యర్థులకు, అటూ కేడర్ కు దిశ నిర్దేశం చేస్తూ.. ఒక్కో ఓటరుకు, ఒక్కో ఇంచార్జ్‌ని నియమించి, పర్సన్ టూ పర్సన్ ఫార్ములాతో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఎన్నికలు జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయ ఢంకా మోగించాలని పక్క ప్రణాళికలు రచించుకొని ముందుకు అడుగులు వేస్తోంది కాషాయ పార్టీ.. ఇంతకూ అనుకున్న లక్ష్యాన్ని బీజేపీ చేరుకుటుందా?

**ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్...** రాష్ట్రంలో ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ప్రచార గడువు కూడా మరి కొద్ది గంటల్లో ముగియనుంది. అందుకే బీజేపి పక్క వ్యూహంతో మూడు ఎమ్మెల్సీ స్థానాలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. ఒకవైపు ప్రచారంలో అగ్రనేతల జోరు కొనసాగుతోంది. మరోవైపు పట్టభద్రులు, ఉపాధ్యాయ సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగిస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మూడు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న కాషాయ పార్టీ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా అభ్యర్థులకు గ్రౌండ్ లెవల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు సహకరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. అయితే అభ్యర్థులు మాత్రం గెలుస్తామనే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారంట.

**90 శాతం ఓటర్లను కలిసామంటున్న బీజేపీ...** రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం కమల దళం కుస్తీ పడుతోంది. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కేడర్ మొత్తం రంగంలోకి దిగింది. ఇప్పటికే దాదాపు 90 శాతం వరకు ఓటర్లను కలవడం పూర్తయినట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఎన్నికల సరళిపై రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్చార్జి సునీల్ బన్సల్ ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వంతో పాటు, కేడర్ కు దిశ నిర్దేశం చేసుకొస్తున్నారు.

**ఒక్కొక్క ఓటరుని 3 నుంచి 4 సార్లు కలుస్తున్న కాషాయ సేన...** గెలుపు అనుకున్నంత సులభం కాదని, టఫ్ ఫైట్ ఉంటుందని, కష్టపడితేనే మూడు స్థానాల్లో గెలుస్తామని బన్సల్ తాను చేయించుకున్న సర్వే రిపోర్టులను బట్టి తేల్చి చెపుతున్నారంట.

కావలిసింది ఓవర్ కాన్ఫిడెన్స్ కాదని, హార్డ్ వర్క్ ముఖ్యమని చెప్పుకొచ్చినట్లు సమాచారం. అందులో భాగంగానే ఒక్కొక్క ఓటరును మూడు నుంచి నాలుగు సార్లు నేరుగా ఫేస్ టూ ఫేస్ కలుస్తూ వారిని తమ వైపుకు తిప్పుకునేందుకు కాషాయ శ్రేణులు ప్రచారంలో బిజీ బిజీ గా ఉన్నారు. ఇక ప్రచారం గడువు ముగియనుండటంతో ప్రచారాన్ని మరింత జోష్ తో కొనసాగిస్తున్నారు.

**స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం..** ఈనెల 27న కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం కాషాయ పార్టీ చెమటోడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం తామేనని చెప్పుకునే బీజేపీ నేతలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు సవాల్ గా మారాయి. ఈ గెలుపే వచ్చే స్థానిక, జీహేచ్ఎంసి ఎన్నికలలో ప్రభావం చూపుతుందన్న అంచనాల్లో నాయకత్వం ఉంది. అయితే పార్టీ అభ్యర్థులు మాత్రం ఓవర్ కాన్ఫిడెన్స్‌తో అత్యుత్సాహం ప్రదర్శిస్తుండటంపై కాషాయ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి ఇదే అంశం బన్సల్ దృష్టికి వెళ్లడంతో అభ్యర్థులకు, ఇంచార్జిలకి, క్లాస్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**మల్క కొమురయ్య గెలుపు ఖాయమైందని ధీమా...** అదలా ఉంటే ఇప్పటికే మల్క కొమురయ్య గెలుపు ఖాయమైందని కాషాయ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. ఇక మిగిలిన రెండు స్థానాల్లో పోటీ గట్టిగానే ఉంటుందని, కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకతను గనుక ఉపయోగించుకొని కష్టపడితే కచ్చితంగా ఆ రెండు స్థానాల్లో కూడా గెలుస్తామన్న ధీమాలో పార్టీ శ్రేణులు ఉన్నాయి. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య పోటీ చేస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25, 921 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఒక్కో ఓటర్ కు ఒక్కో కార్యకర్తను కాషాయ పార్టీ నియమించి జోరుగా క్యాంపెయిన్ చేస్తోంది. ఆయా ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకుని విజయం సాధించాలని పార్టీ ప్లాన్ చేస్తోంది.

**పట్టభద్రుల సెగ్మెంట్లో 3,41,313 మంది ఓటర్లు...** ఇక కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి బరిలో ఉన్నారు. మొత్తం పట్టభద్రులు 3,41,313 మంది ఓటర్లు ఉన్నారు. ఈ స్థానంలో అంజిరెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. పోటీని దృష్టిలో పెట్టుకొని 25 మంది ఓటర్లకు ఒక ఇన్ చార్జిని నియమించి తమదైన శైలిలో పక్క ప్రణాళికలతో కమలనాథులు ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తున్నారు.

**మండలిలో సంఖ్యా బలం పెంచుకోవాలని చూస్తున్న బీజేపీ...** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి సరోత్తం రెడ్డి పోటీ చేస్తున్నారు. కాగా ఎంపీలు, ఎమ్మెల్యేలు సన్నాహక సమావేశాల్లో పాల్గొని బీజేపీ క్యాండెట్లను గెలిపించాలని కోరుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు కళ్ల ముందు ఉన్నాయని.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని ఓటర్లకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత పెరిగిందని, ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా దాన్ని నిరూపించాలని కాషాయ పార్టీ గట్టిగా ప్లాన్ చేస్తోంది. మండలి లో సంఖ్యాబలం పెంచుకుని రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయం అనిపించుకోవాలని భావిస్తున్న కమలదళానికి టీచర్లు, గ్రాడ్యుయేట్లు ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తారో చూడాలి.

## ఆ విషయం నిరూపించాలి.. రేవంత్‌కు కిషన్‌రెడ్డి మాస్ సవాల్



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా రిప్లై ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇవాళ (మంగళవారం) ఏబీఎన్‌తో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే తాను ఎప్పుడు ఎక్కడ తెలంగాణకు అడ్డుపడ్డానో రుజువు చేయాలని సవాల్ విసిరారు. పదవుల కోసం పార్టీలు మారి కాళ్లు పట్టుకొనే వాడిని తాను కాదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉంది.. ఆయన ఎలాంటి విచారణ చేస్తారో చేసి తమకు అప్పగించాలని కిషన్ రెడ్డి అన్నారు.



## ఖమ్మం జిల్లాలో తీర్థాల సంగమేశ్వరుని జాతరకు సర్వం సిద్ధం

ఖమ్మం : ఐదురోజుల పాటు నిర్వహించనున్న తీర్థాల సంగమేశ్వరుని జాతరకు సర్వం సిద్ధమైంది. ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్? రాంప్రసాద్ పలుమార్లు సమీక్ష చేశారు. అయిదు రోజుల్లో లక్షలాదిగా తరలి రానున్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 10 చోట్ల పార్కింగ్ స్థలాలను పోలీసులు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు.

**పార్కింగ్ ఏరియాలు :** ఖమ్మం పట్టణం వైపు నుంచి వచ్చే వాహనాలు దానవాయిగూడెం, రామన్నపేట, కామాంచికల్ మీదుగా వచ్చి మున్నేరు వాగు బ్రిడ్జ్ రోడ్డు కి ఇరువైపుల సూచించిన చోట ఆర్టీసీ బస్సులు మినహా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పార్కింగ్ చేసుకోవాలి. ట్రాక్టర్లు, లారీలు కామంచికల్, పాటివారిగూడెం నుంచి జాన్?బాద్ తండా వెళ్లే దారిలో వెళ్లి కామంచికల్ బ్రిడ్జి దగ్గర పార్కింగ్ చేయాలి. డోర్నకల్, పాపటిపల్లి మీదుగా వచ్చే వాహనాలు కామంచికల్ గ్రామానికి ముందు చెరువు వద్ద కుడి వైపు ఉన్న జామాయిల్ తోట దగ్గర పార్కింగ్ లో నిలపాలి. మద్దివారిగూడెం, మంగళగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలకు తీర్దాల గ్రామ ప్రవేశం ఎదుట పార్క్? చేయాలి. కురవి, ములకలపల్లి వైపు నుంచి తీర్థాల వచ్చే భక్తుల వాహనాలు ఎంవీ పాలెం, గుండాల తండా మీదుగా తీర్దాలకు చేరుకోవాలి. ఖమ్మం రూరల్ నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, పల్లెగూడెం, గోళ్ళపాడు మీదుగా ఆకేరు బ్రిడ్జి వరకు అనుమతిస్తారు. ఖమ్మం పట్టణం నుంచి భక్తులు దర్శనం అనంతరం గోళ్లపాడు వన్?వే రహదారి మీదుగా కామంచికల్ పంచాయతీ దగ్గర నుంచి ముత్యాలగూడెం మీదుగా కోయ చిలక వైపు నుంచి ఖమ్మం వెళ్లాలి. పల్లెగూడెం మీదుగా వచ్చే వాహనాలు ఎంవీ పాలెం మీదుగా గూడూరుపాడు , తనగంపాడు, గుండాల తండా మీదుగ తీర్దాల రావాలి. టెంపుల్ కు చుట్టుపక్కల ఒక కిలోమీటరు వరకు వాహనాలకు అనుమతి లేదు. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలాలలో నిలపాలి.

**నీలాద్రి కి శివరాత్రి శోభ..** పెనుబల్లి : కాకతీయ రాజులు ప్రతిష్ఠించిన నీలాద్రి ఆలయం శివరాత్రికి ముస్తాబు అయ్యింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం నీలాద్రి అడవుల్లో జరిగే జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది లక్ష యాభై వేల మంది భక్తులు జాతరకు వస్తారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. శివరాత్రి రోజున తెల్లవారుజామున సుప్రభాత సేవ తో మొదలు అయ్యి రాత్రి 9.30 కి నీలాద్రీశ్వరుని కల్యాణంతో జాతర ముగుస్తుంది. ఉదయం 11 నుంచి లక్ష మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తిరుపతి నుంచి వచ్చిన శివ భక్తుడు బోధనపు విజయకుమార్ ఆధ్వర్యంలో కోటి రుద్రక్షాలతో ఆలయ ప్రాంగణంలో శివ లింగం ఏర్పాటు చేస్తున్నారు. మృత్యుంజయ యాగం చేసి, కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్ రాజ్ నుంచి తెచ్చిన జలాలతో అభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. అభిషేకం అనంతరం రుద్రక్షాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. గత ఏడాది ట్రాఫిక్ జామ్ సమస్య లు ఉండటం వల్ల ఈ ఏడాది వీఎం బంజరు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ ఈఓ పాకాల వెంకటరమణ, చైర్మన్ చీకటి నరసింహారావు, రూరల్ సీఐ ముత్తు లింగయ్య, ఎస్?ఐ వెంకటేశ్? మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

# తొట్టతొలి భారతదేశ పాశ్చాత్య వైద్యురాలు ఆనందీబాయి జోషి

## - ఫిబ్రవరి 26...ఆనందీబాయి జోషి వర్ధంతి




ఆనందీబాయి గోపాల్‌రావ్ జోషి మొదటి భారతీయ మహిళా వైద్యులలో ఒకరు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మెడిసిన్ పట్టభద్రులు కావడంతో పాటు, స్నాతకోత్తర విద్య (పోస్ట్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళ ఆమె. భారత దేశం నుండి అమెరికన్ గడ్డపై అడుగు పెట్టిన మొదటి మహిళ కూడా ఆమే అని భావిస్తారు. ఆనందీ గోపాల్ జోషి లేదా ఆనందీబాయి జోషి (మార్చి 31, 1865 – ఫిబ్రవరి 26, 1887) పూణే (మహారాష్ట్ర) లోని సనాతన సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు యమున అని పేరు పెట్టారు. 9 సంవత్సరాల వయసులో దాదాపు ఇరవై సంవత్సరాలు పెద్దయిన గోపాల్ రావు జోషిని వివాహం చేసుకున్నారు. వివాహం తరువాత, ఆమె భర్త ఆమెకు ఆనందీబాయి అని పేరు పెట్టారు. గోపాల్ రావు, కళ్యాణ్ లో తపాలా గుమాస్తాగా పనిచేసేవారు. తరువాత, ఆయన అలీబాగ్, చివరకు కలకత్తా బదిలీ అయ్యారు. విద్య పట్ల ఆనందీబాయికి ఉన్న ఆసక్తి గమనించి, సంస్కృతం కంటే ఆంగ్ల భాష నేర్చుకోవడం ముఖ్యమని భావించారు. ఆంగ్లం నేర్చు కోవడానికి సహాయం చేశారు. 14 సంవత్సరాల వయస్సులో, ఆనందీబాయి ఒక బాలుడికి జన్మనిచ్చింది. అవసరమైన వైద్య సంరక్షణ అందుబాటులో లేక పోవడంతో బాలుడు పది రోజుల్లో చనిపోయాడు. ఈ సంఘటన ఆనందీబాయి జీవితంలో ఒక మలుపును తీసుకొచ్చింది. ఆమె వైద్యురాలు కావడానికి ప్రేరణనిచ్చింది. గోపాల్ రావు సామాజిక భావాలు కలిగిన వ్యక్తి. విద్య నేర్చుకోవడానికి ఆ రోజుల్లో ఆనాటి బ్రాహ్మణుల కుటుంబాలలో మహిళలకు పరిమితులు ఉండేవి. విదేశాలకు బ్రాహ్మణులు వెళ్లడం నిషేధమైన కాలమది. అయినా ఆమె భర్త తన భార్య వైద్య శాస్త్రాన్ని అభ్యసించడానికి ప్రోత్సహించాడు. ఆమెకు అమెరికాలో విశ్వ విద్యాలయం ప్రవేశం కొరకు ప్రయత్నాలు సాగించారు. 1880 లో, అయన రాయల్ విల్డర్ (ఒక ప్రసిద్ధ అమెరికన్ మిషనరీ) కు వ్రాసిన లేఖలో ఆనందీబాయికి యునైటెడ్ స్టేట్స్‌లో వైద్య అధ్యయనం చేయడానికి గల ఆసక్తిని పేర్కొంటూ, తన కోసం అమెరికాలో సరైన ఉద్యోగానికై అభ్యర్థించారు. ఇద్దరు ఆలుమగలు క్రైస్తవ మతం స్వీకరిస్తే సహాయం చేయగలనని విల్డర్ ప్రతిపాదించాడు. అయితే ఈ ప్రతిపాదన జోషి దంపతులకు ఆమోదయోగ్యం కాలేదు. అయితే విల్డర్ ఈ ఉత్తరప్రత్యుత్తరాలను తన సొంత పత్రికైన ప్రిన్స్టన్ మిషనరీ రివ్యూలో ప్రచురించాడు. రొస్సెల్, న్యూజెర్సీకి చెందిన థియోడెసియా కార్పెంటర్ అనే మహిళ తన దంత వైద్యుని కోసం ఎదురుచూస్తూ ఆయన కార్యాలయంలో యాధృచ్ఛికంగా సదరు పత్రికలో ఆనందీబాయి గురించి చదివింది. వైద్యవిద్య చదవాలన్న ఆనందీబాయి తపన, దాన్ని ప్రోత్సహిస్తున్న భర్త యొక్క వృత్తాంతం ఆమెను కదిలించింది. ఆనందీబాయికి ఉత్తరం వ్రాసి తాను ఆనందీబాయి అమెరికాలో ఉండటానికి వసతి సహాయం చేయగలనని ముందుకు వచ్చింది. కార్పెంటర్‌కు, ఆనందీబాయికి మధ్య అనేక విషయాలపై ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి. వారు పరస్పరం సాగించిన ఉత్తర ప్రత్యుత్తరాలలో బాల్యవివాహం కారణంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా ఒకటి కావటం విశేషం. " సెరంపోర్ కాలేజ్" హాలులో ఆనందీబాయి ఉపన్యసించిన సమయంలో తాను వైద్యవిద్యను అభ్యసించడానికి అమెరికా ఎందుకు వెళ్ళాలను కుంటుందో వెల్లడించారు. అనందీబాయి, ఆమె భర్త అనుభవించిన ఇబ్బందుల గురించి తన ఉపన్యాసంలో వివరించారు. భారత దేశంలో హిందూ మహిళా వైద్యురాళ్ల అవసరం గురించి, అలాగే ఆమె భారత దేశంలో మహిళా వైద్య కళాశాల ప్రారంభించడం తన లక్ష్యమని వివరించారు. అయితే తాను క్రైస్తవ మతాన్ని స్వీకరించనని మాత్రం నొక్కి వక్కాణించారు. ఆమె ఉపన్యాసం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. భారతదేశం నలుమూలల నుండి ఆర్థికసహాయం చేస్తామని సందేశాలు ఆమె అందుకున్నారు. ఆమె విద్యకు సహాయంగా అప్పటి భారత వైస్రాయ్ కూడా 200 రూపాయల ఆర్థికసాయం పంపారు. భర్తకు అమెరికాలో ఉద్యోగం లభించని కారణంగా ఆనందీబాయి మాత్రం ఒంటరిగా ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా వెళ్లారు. ఆనందీబాయి కలకత్తా నుండి న్యూయార్క్ వరకూ నౌకలో ప్రయాణం చేసారు. ఈ ప్రయాణంలో ఆమెకు తోడుగా ఇద్దరు ఆంగ్ల మహిళలు ఉన్నారు. విపరీతమైన వ్యతిరేకత నడుమ ఆమె 1883 జూన్ మాసంలో వైద్య విద్యాభ్యాసానికి అమెరికాలో అడుగు పెట్టారు. 1883 జూన్ లో న్యూయార్క్‌లో ఆమెను స్వాగతించ డానికి కార్పెంటర్ వచ్చింది. అమెరికాలో మిసెస్ కార్పెంటర్ అతిథిగా ఆమె ఇంటికి చేరుకున్నారు. న్యూయార్క్ లో 1983లో థియోడిసియా కార్పెంటర్ ఆనందీబాయి బస, పోషణ బాధ్యత వహించింది. ఆనందీ, కార్పెంటర్ అత్యంత ఆత్మీయులుగా మారారు. కార్పెంటర్ ఆనందీబాయిని కుమార్తెగా భావించి అభిమానించింది. ఆనందిని చూసి కార్పెంటర్ విస్మయం చెందగా, అమెరికా వైద్యం ఆనందినీని విస్మయ పరిచాయి. పెన్సిల్వేనియా మహిళా వైద్యకాలేజీలో వైద్యవిద్యకు ఆమె దరఖాస్తు చేసుకున్నారు. మొట్ట మొదటి మెడికల్ క్యాంప్ నిర్వహించిన పెంసెల్వేనియా మెడికల్ కాలేజ్ వారికి ఆమె తమ పాల్గొనేందుకై ఒక లేఖ వ్రాసారు. అదే ప్రపంచ మొట్టమొదటి మహిళా మెడికల్ క్యాంప్. (ఇది ప్రపంచంలోనే ఈ తరహా మొదటి కార్యక్రమం). రేచెల్ బాడ్లీ, కాలేజీ డీన్, ఆమెకు ఈ విద్యా కోర్సుకై అర్హతను ఇచ్చారు. ఫిలడెల్ఫియా విశ్వ విద్యాలయంలో ఆమెను వదిలిన సందర్భంలో కార్పెంటర్ పసిపిల్లల విలపించడం వారి మధ్య అనుబంధాన్ని తెలియ జేస్తుంది. కాలేజీ సెక్రెటరీ, సూపరింటెండెంట్ సదురం నుండి విద్యాభ్యాసానికి వచ్చిన ఆనందీ గోపాలును చూసి ప్రభావితమై ఆమెకు అక్కడ ఉన్న 3 సంవత్సరాలు 600 అమెరికన్ డాలర్లను ఉపకార వేతనం ఏర్పాటు చేసింది. 19వ యేట ఆమె తన వైద్య విద్యను ప్రారంభించారు. అయితే ఆమె అమెరికాలో ఎదుర్కొన్న ప్రధాన సమస్య శీతోష్ణస్థితి. అయినా ఆమెకు కాలేజి వారు ఏర్పాటు చేసిన గదిలో సరైన " ఫైర్ ప్లేస్ " లేనందున ఫైర్ ప్లేస్ నుండి అత్యధికంగా పొగరావడం వలన ఆమెకు చలి కాని లేక పొగ కాని భరించ వలసిన పరిస్థితి ఎదురైంది. రెండు సంవత్సరాలు అమెరికా వాసం తరువాత ఆమెకు అపస్మారకం, శీఘ్రజ్వరం అధికమైంది. అప్పుడు మొదలైన దగ్గు ఆమెను చివరి వరకు వదలి పెట్టలేదు. ఆమె తీవ్ర ఆరోగ్య సమస్యలతో మూడు సంవత్సరాల ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి ఫైనల్ పరీక్షలు రాశారు. 1886 మార్చి 11 న ఆమె వైద్య విద్యలో డాక్టరేట్ సాధించింది. ఆమె పరిశోధనాంశం "ఆర్య హిందువులలో స్త్రీ జననాంగ – శిశు సంబంధిత వైద్యం". స్నాతకురాలయిన సందర్భంలో విక్టోరియా మహారాణి ఆమెకు శుభాకాంక్షలతో ఒక సందేశాన్ని పంపారు. ఆమె పట్టభద్రోత్సవంలో ఆమె భర్త కూడా పాల్గొన్నాడు. ఆ ఉత్సవంలో ఆమెను మొట్టమొదటి భారతీయ వైద్యురాలుగా పేర్కొనడం ఆమెకు మరపురాని అనుభూతిని కలుగజేసిందని ఆమె తన కథనాలలో పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం రోజుకు రోజుకు దిగ జారడంతో ఆమె భర్త ఆమెను ఫిలడెల్ఫియా స్త్రీల ఆసుపత్రిలో చేర్చారు. ఆమెకు క్షయ వ్యాధిగా నిర్ధారించ బడింది. అయినా ఆ వ్యాధి ఇంకా ఊపిరి తిత్తులను చేరలేదు. వైద్యులు ఆమెను భారత దేశానికి తిరిగి వెళ్ళమని సలహా ఇచ్చారు. అందుకు ఆమె అంగీకరించింది. కొల్హాపూరు సంస్థానంలో వైద్యురాలిగా పని చేయడానికి వచ్చిన అవకాశాన్ని స్వీకరించింది. భారత దేశానికి తిరుగు ప్రయాణం చేసే సమయంలో ఆనందీబాయి ఆరోగ్యం మరింత దిగజారింది. నౌకా ప్రయాణం చేసే సమయంలో ఆమెకు చికిత్స చేయడానికి వైద్యులు నిరాకరించారు. వైద్యులు చికిత్స చేయడానికి నిరాకరించడానికి కారణం ఆమె భారతీయురాలు కావడమే. 1886 చివరి భాగంలో, ఆనంది బాయి భారత దేశానికి తిరిగి వచ్చారు. దేశం ఆమెకు ఘనంగా స్వాగతం పలికింది. ఆమె కొల్హాపూర్ సంస్థానానికి వైద్యురాలిగా నియమించ బడింది. అల్బర్ట్ ఎడ్వర్డ్ వైద్య శాలలోని మహిళా వార్డుకు అధికారిణిగా బాధ్యతలను అప్పగించ బడ్డాయి. కలకత్తా చేరిన తరువాత ఆనందీభాయి బలహీనత, నిరంతర తలనొప్పి, తరచూ జ్వరం, ఆయాసాలతో బాధ పడ్డారు. థియోడిసియా ఆమెకు అమెరికా నుండి ఔషధాలను పంపింది. తరువాత ఆమె ఆయుర్వేద చికిత్స కొరకు కజిన్ ఇంట్లో బసచేసింది. ఆయుర్వేద వైద్య నిపుణుడు ఆమె నౌకాయానం చేసి విదేశాలకు వెళ్ళి సంప్రదాయ సరిహద్దులు దాటినందుకు ఆమెకు చికిత్స చేయడానికి నిరాకరించాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన ఒక్క సంవత్సరం లోపుగానే ఫిబ్రవరి 26, 1887 తేదీన 22 సంవత్సరాల చిరుత ప్రాయంలో ఆనందీభాయి వ్యాధి బాధతో తుదిశ్వాస విడిచారు. ఆనందీబాయి మరణానికి దేశం అంతటా విషాదం ఆవరించింది. సాంప్రదాయ హిందూ అంత్యక్రియల కర్మల ప్రకారం దహన సంస్కారాలు జరిగాయి. ఆనందీబాయి చితాభస్మం థియోడిసియా కార్పెంటర్ కు పంప బడింది. కార్పెంటర్ వాటిని పూకిప్సీ, న్యూయార్క్ లోని తమ కుటుంబ శ్మశాన వాటికలో భద్ర పరిచారు. ఆమె సమాధి శిలా ఫలకాన్ని ఈ శ్మశాన వాటికలో ఇప్పటికీ చూడవచ్చు. అమెరికాలో ప్రసిద్ధ స్త్రీవాద రచయిత, సంస్కరణకర్త అయిన కారోలైన్ వెల్స్ హీలీ డాల్ 1888లోనే ఆనందీబాయి ఆత్మ కథను వ్రాసింది. దూరదర్శన్ ఆనందీబాయి జీవితమును ఆధారముగా చేసుకొని తీసిన ధారావాహిక "ఆనందీ గోపాల్"ను ప్రసారం చేసింది. ఈ ధారా వాహికకు కమలాకర్ సారంగ్ దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణ జనార్ధన జోషి తన మరాఠీ నవల "ఆనందీ గోపాల్"లో ఆనందీబాయి జీవితం లోని కొన్ని ఘటనలను పొందు పరిచారు. ఈ నవల ఆషా దామ్లే ద్వారా ఆంగ్లంలోకి సంక్షిప్త రూపంలో అనువాదం చేయ బడింది. అదే పేరుతో రాంజీ జోగ్లేకర్ ఒక నాటకాన్ని కూడా రూపొందించారు. బహుళ మీడియా సంస్థలు ఆమె జీవిత కథను సినిమాలు మరియు సీరియల్స్ లోకి స్వీకరించాయి. ఆనందీ గోపాల్ అనే మరాఠీ బయోపిక్ కూడా విడుదలైంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విప్లవ వీరుడు...వినాయక్ దామోదర్ సావర్కర్


## ఫిబ్రవరి 26...వినాయక్ దామోదర్ సావర్కర్ వర్ధంతి




వినాయక్ దామోదర్ సావర్కర్ (1883–1966) భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రాముఖ్యత గల విప్లవ వాది, రచయిత, హిందుత్వ సిద్ధాంతకర్త. ఆయన బ్రిటిష్ పాలనను వ్యతిరేకించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. సావర్కర్ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాకుండా, హిందూ జాతీయత భావనకు ప్రాతినిధ్యం వహించిన గొప్ప నాయకుడిగా కూడా గుర్తింపు పొందారు. సావర్కర్ 1883 మే 28న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో జన్మించారు. చిన్ననాటి నుంచే దేశభక్తితో ప్రేరితమై, బ్రిటిష్ అధికారాన్ని వ్యతిరేకిం చేందుకు సిద్ధపడ్డారు. విద్యాభ్యాసాన్ని పూణేలోని ఫెర్గ్యూసన్ కాలేజీలో పూర్తి చేసిన తరువాత, న్యాయవిద్య కోసం 1906లో లండన్‌కు వెళ్లారు. అక్కడ "ఇండియా హౌస్"లో భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని సమర్థంగా నడిపారు. 1909లో మదన్లాల్ ధింగ్రా లండన్‌లోని బ్రిటీష్ అధికారిని హత్య చేయడం సావర్కర్ ప్రభావంతోనే జరిగింది. అభినవ భారత్ సమాజ్ భారతదేశ స్వాతంత్ర్యానికి అంకితమైన విప్లవ సంస్థను స్థాపించారు. "1857: The First War of Independence" పుస్తకంలో 1857 తిరుగుబాటును మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా పేర్కొన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పనిచేసి నందుకు అరెస్టు చేసి, అండమాన్ నికోబార్ దీవుల సెల్యులార్ జైలుకు పంపించారు. విడుదలైన ప్పటికీ రాజకీయ కార్యకలాపాలకు బ్రిటిష్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సావర్కర్ 1923లో "హిందుత్వ" అనే గ్రంథాన్ని రచించి, హిందూ జాతీయత గురించి వివరించారు. హిందూ మతాన్ని కేవలం మతపర మైన అంశంగా కాకుండా, జాతీయ ఐక్యతకు, సంస్కృతికి కేంద్ర బిందువుగా పేర్కొన్నారు. హిందూ మహాసభను నేతృత్వం వహించి, హిందూ సంఘటనపై ప్రత్యేక దృష్టి సారించారు. 1937లో హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఎన్నిక య్యారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ పాలనపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. 1948లో మహాత్మా గాంధీ హత్య కేసులో నిందితుడిగా ఆరోపించ బడ్డారు, కానీ తుది విచారణలో నిర్దోషిగా ప్రకటించ బడ్డారు. ఆయన రచనల్లో...1857 భారత స్వాతంత్ర్య సంగ్రామం – 1857 తిరుగుబాటును స్వాతంత్ర్య పోరాటంగా విశ్లేషించిన పుస్తకం. హిందూత్వ – హిందూ జాతీయతపై ఆధారపడిన సిద్ధాంత గ్రంథం. కాలాపాని– అండమాన్ జైలు అనుభవాలపై రచన. సావర్కర్ 1966 ఫిబ్రవరి 26న కన్నుమూశారు. ఆయన జీవితం, హిందూత్వ సిద్ధాంతం, విప్లవ స్ఫూర్తి నేటికీ చర్చనీయాంశంగా ఉన్నాయి. వినాయక్ దామోదర్ సావర్కర్ భారత స్వాతంత్ర్య పోరాటానికి ఎనలేని సేవలు అందించిన నాయకుడు. ఆయన విప్లవ దృక్పథం, రచనలు, హిందూత్వ భావజాలం భారతదేశ రాజకీయ, సామాజిక రంగాలపై ప్రభావాన్ని చూపించాయి. దేశభక్తితో నిండిన ఆయన జీవితం కొత్త తరం ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపం ధర్మపురి శివాలయం..


## శివరాత్రికి ముస్తాబైన రామలింగేశ్వరాలయం...



భారత దేశ ప్రాచీన సంస్కృతీ సభ్యతలకు నిలయంగా సనాతన సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా, వేదవేదాంగ శాస్త్రాగమ, నృత్య గీత నాట్యాది సకల కళలయందు నిష్ణాతులైన ధార్మిక కార్యాదరణాసక్తులైన ప్రజానీకంతో, మరెచ్చటా కానరానన్ని ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న పలు దేవాలయాల సముదాయం కలిగి, రాష్ట్రంలో సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరి తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది నాటి అవిభక్త కరీంనగర్, నేటి నూతన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామలింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీ భూతంగా నిలిచియుంచీ క్షేత్రరాజం. గంభీర గౌతమీనది తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై పౌరాణిక ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈ క్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామలింగేశ్వరాలయం. భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో, నిత్యానందంలో మునిగి తేలుతూ, ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగరూపులో ఉంటూ, ఎవరిచేత పూజింపబ డకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తి పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్టించి, పూజించి శాప నిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈశాన్యాన, సైకత (జసుల) లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాండితుడై నట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. ఆరవ శతాబ్దంలో స్థాపించబడి, ఎనిమిదవ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాళుక్య రాజుల ప్రాభవంలో పునర్మించ బడిన రామేశ్వరాలయంలోని గణేశ విగ్రహములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.973 నుండి 1140 వరకు పాలించిన కల్యాం చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకితుడుగు ఆరవ విక్రముని (1076–1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్యరాజు పరమేశ్వర, రణ రంగభైరవ, మార్వల భైరవ, ఆయత గంధ వారణ, విక్రమాదిత్య బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతి గణపతి దేవుని శిలాశాసనం రామేశ్వరాలయంలో పూర్వపు చాళుక్య స్థంభం పైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగరంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొనబడినవి. చాళుక్య శైలిలో బొజ్జ ఎత్తుగా నుండి, సహజమైన ఏనుగు తలను కలిగి, మానవ రూపంలేని గణపతి విగ్రహం ఆలయ సముదాయంలో నుంది. శివాలయ శిఖర నిర్మాణంలో చాళుక్య శైలి ఉంది. శిఖరం చాపాకృతిని పోలి. కిందనుండి పైకి ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. శిఖర సౌందర్యానికి పైన ఆమలకములు వృత్తకారంలో చుట్టూరా కలిగి, ఆంతకుపైన కలశం, తూర్పున శుక నాసం ఉన్నాయి. శుక నాసం చిలుక ముక్కు లాగ ముందుకు పొడుచుకు వచ్చిన గూడు, శిఖర నిర్మాణం ఉత్కళ శైలిలో, లింగరాజ స్వామి ఆలయం (భువనేశ్వర్) దేవాలయ శఖరాకృతిని పోలి ఉంది. ప్రవేశ మంటపం తర్వాత దూరంగా గర్భాలయంలో మొదట ముఖ మంటపం ఉంది. మధ్యన గల రంగ శిల ప్రాచీనంగా నర్తకీమణుల వేదిక, నేడు అది వల్ల బండ.తర్వాత చీకటిగా.నుండే అంత రాళం, అపైన గర్భ గృహం. అందు శ్రీరామచంద్ర స్థాపిత సైకత (జముక) లింగం, ముఖ మంటపము, ప్రవేశ మంటపము, గర్భ గృహములు, ఆలయ ప్రాంగణంలో దాటితే శివుని దర్శనం. అలయ ప్రాంగణంలో మూడు ద్వారాలకు అభిముఖంగా నల్లరాతితో నిర్మించిన ఆభరణాలు అధికంగా గల, పీఠంపై ఉబ్బెత్తు హారాలు గలిగి, కాకతీయ ఆల యాలలోవలె శిలాకృతులు, జిలుగు నగిశీలు, మెడలో గంటలు, మువ్వల పట్టి, మెడ పట్టెడలు, గంగడోలు, వంపు తిరిగిన మెడ, వృహణాలతో నందులు ఉన్నాయి. పైకప్పుపై అపురూపాలైన ఏక ముఖ ద్వి దేహ నందులు నాలుగు మూలల ఉండేవి. సాలహార పునర్నిర్మాణ సమయంలో కూల్చి వేయడం జరిగింది. దేవాలయం కప్పుకన్నా ఎత్తుగా, నిటారుగా 15ఆడుగుల ఎత్తు ఉన్న ధ్వజ స్థంభం (విజయ స్థంభం) ఉంది. శివాలయ ఈశాన్య భాగాన గణపతికి ప్రత్యేక గుడి ఉంది. ఇది కూర్చొని ఉన్న భారీ విగ్రహం. చాళుక్యుల కాలం నాటి విగ్రహానికి కుడి చేతులో గద ఉంది, నాగభంధం కలదు .ఎడమ చేతిలో గండ్రగొడ్డలి వంటి ఆయుధం, ఎడమ కింది చేతిలో మోదకాలు (ఉండ్రాళ్ళు) ఉన్నాయి. చెవులు చేటంత విశాలంగా ఉన్నాయి. రెండు వీర గల్లులశిల్పాలున్నాయి. పదాతిదళపు వీరుడు శత్రువులను చీల్చి చెండాడు తున్న దృశ్యం, ప్రాంగణం బయట నాగిని విగ్రహముంది. పైన నాగుల ఐదు పడగలతో కింద స్త్రీమూర్తి, చివర తోక, లేకుండా ఉంది. ఎనిమిది చేతుల మహిషాసుర మర్ధిని విగ్రహం ఉంది. అలాగే అపురూపాలైన బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ లేదా వరాహ పురాణంలో చెప్పబడిన యోగీశ్వరి ఆదిగా సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఓకే పీఠంపై చతురస్రాకార శిల్పమిది. ఇరు పార్శ్వా లలో గణపతి వీర భద్రుని విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన దైవత లింగం కాక, ముఖ మంటపంలో వాయవ్యాన కాశీ విశ్వనాథుడు పేరుతో పూజలందుకునే 4 అడుగుల ఎత్తుగల లింగం ఉంది. దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి, శివ పూజ చేసేందుకు, హనుమంతుని లింగం తెమ్మని కాశీకి పంపగా, ప్రతి ప్రతిష్ఠించే సమయానికి ఆంజనేయుడు రాని స్థితిలో, సైకత లింగ ప్రతిష్ట గావించారని, ఆలస్యంగా ఏతెంచిన హనుమ సేవలు వ్యర్థం కాకుండా, హనుమల్లింగాన్ని ప్రతిష్ఠచేసి, ఆ లింగాన్ని పూజించాకే, గర్భాలయంలోకి వెళ్ళేలా నియమం శ్రీరాముడు ఏర్పరచారని స్థల పురాణం స్పష్ట పరుస్తున్నది. ఆలయంలో 13వ శతాబ్ధం కాలంనాటి చండిక విగ్రహం కలదు. ఈ విగ్రహంలో అమ్మవారు చక్రస్తని, త్రిశూల, ఖడ్గహస్త, మకుట ధారిణి, చతుర్భుజ, శూల ధారిణిగా ఉంది. కాశీ విశ్వనాథుని పక్కన ప్రాచీన పార్వతీదేవి శిల్పం, మహిషాసుర మర్ధిని, షణ్ముఖుడు (కుమార స్వామి), ఉమా మహేశ్వరులు విడివిడిగా నల్ల శిలపై మలచబడి ఉన్నాయి. ఆలయంలో విక్రమాదిత్యుని, గణపతి దేవుని, ప్రధాన ద్వార కడప ముందర, బంకుళ్ళలో, దక్షిణ ప్రవేశ ద్వార స్థంభం, నైరుతి దిశలో ప్రహారీగోడ బాహ్యాది ఆరు శాస నాలున్నాయి. చుట్టూ రథం తిరిగేంత ప్రాంగణం, 10 అడుగుల ప్రహారీ కలిగి ఉన్నదీ ఆలయం. చారిత్రిక నేపథ్యం ప్రకారం, క్రీ.శ.1309లో ఢిల్లీనేలిన అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్, ఇందూరు (నిజామాబాద్ ) మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, నృసింహాలయాలు ధ్వంసం చేయబడినవి. క్రీ.శ.1332–1367 మధ్యకాలంలో తెలంగాణా లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయామాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరి వ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదు లకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా(1674–1687) మంత్రియగు మాదొభా నూజీ సూర్యప్రకాశ రావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చనకు సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల, ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజా నైవేద్యాది విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకో బడింది. ఫలితంగా లక్ష్మీనరసింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. వివిధ ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూతతో నిధులను ప్రోగుచేసుకుని ముఖ్యమంత్రి సర్వశ్రేయో నిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలష, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని , శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర, శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్టిం చడం జరిగింది. శివరాత్రి, శివ కళ్యాణం, రథోత్సవం, గణపతి నవగ్రహ పూజలు, శంకర జయంతి, శరన్నవరాత్రుల ఉత్సవాలను, నరసింహ స్వామివారల బ్రహ్మోత్సవ వేడుకలలో అంత ర్భాగంగా ఉత్సవాలను ఈ ఆలయంలో ఏడా సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు విశ్వనాథం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఏర్పాట్లు చేశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రాచీన చరిత్రకు సాక్ష్యం దుబ్బ రాజేశ్వరాలయం

## మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా స్వయంభూ దైవమైన శ్రీరాజ రాజేశ్వర స్వామికి పేరుంది. జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతమైన పెండెట్ల గ్రామం వద్ద గుట్టపైన శ్రీరాజరాజేశ్వరుడు వెలసియున్నాడు. తెలియక చేసిన పాపాలు స్వామిని స్మరించిన మాత్రానే పటాపంచల వుతాయని సంసార ఇబ్బందులు, సకల సంకటాలు మృత్యు భయాలన్నీ రాజేశ్వర దర్శన మాత్రం చేత తొలగి పోగలవని నమ్మిన తమతో ఏర్పరచుకుని అష్టైశ్వర్యాలు సమకూరుస్తూ, ఎల్ల వేళలా వెన్నంటి కాపాడే కారుణ్యమూర్తి రాజేశ్వరుడని భక్తుల విశ్వాసం. పెంబెట్ల రాజేశ్వరాలయానికి ఘన చరిత్ర ఉంది. ప్రస్తుతం ఉన్న దేవాలయం నూతన కట్టడం కాగా, దీని స్థానంలో ప్రాచీన సనాతన కట్టడం ఉండేదని లభ్యమైన శిలాశాసనాల ద్వారాతెలుస్తున్నది. జగిత్యాల వాస్తవ్యులు, ప్రముఖ చారిత్రక పరిశోధకులు విశ్రాంత ప్రొఫెసర్ జైసెట్టి రమణయ్య పరిశోధన ఫలితంగా ఈ దేవాలయం వెలుగు చూసింది. తెలుగులో చెక్కబడిన పురావస్తు శాఖచే 1974లో ముద్రితమైన శాసనాన్ని బట్టి అంతకు ముందే ఇక్కడి ఆలయం ప్రాచుర్యం పొందినట్లు భావించ బడుతున్నది. అటవీ క్షేత్రంలో అలనాడు దుబ్బపై నిర్మితమైన రాజేశ్వరాలయం. 18వ శతాబ్దం నుండే అత్యంత వైభవోపేతంగా విరాజిల్లిన కాకతీయుల కాలపు పుణ్యక్షేత్రంగా గుర్తింపు నొందినది. ఆలయ ప్రాంగణంలోనే కాకతీయ ప్రభువుల కళాభిజ్ఞతకు ప్రబల నిదర్శనాలుగా చెక్కబడిన, రెండు సుందరమైన ద్వార పాలకుల విగ్రహాలు, మిగుల మనోజ్ఞలుగా నిలిచి యున్నాయి. రెండు మూర్తులు కూడా నాలుగేసి చేతులు కలిగియుండి, ఉపరి హస్తంలో కుడివైపు చక్రం, ఎడమవైపు శంఖం మకుటాలు, కుండలాలు, గ్రైవేయకాలు, హారాలు, కేయూరాలు, మోచేతి, ముంజేతి కడియాలు కటిబంధం వనమాల, కాలి కడియాలు, నూపురాలు మొదలైన ఆభరణాలతో ఈ అపురూప శిల్ప కళాకృతులు చెక్క బడ్డాయి. విగ్రహాల అడుగు భాగాన వింజా మరలు వీచే అందమైన సుందరాంగుల ప్రతిమలున్నాయి. ద్వార పాలకుల విగ్రహాల పక్కనే శిథిలమైన ఆనాటి ఆలయ ద్వారకల్పం, గజ, సింహ ప్రతిమలతో ఆలరారు తున్నది. లభ్యమైన విగ్రహాలను బట్టి ఇక్కడ ఒక వైష్ణవాలయం ఉండేదని తెలు స్తున్నది. రాజేశ్వర దేవస్థానంలో రామాలయం, అంజనేయస్వామి, నవగ్రహ మండపం, వల్లు బండ కలిగి, సర్వ శ్రేయో నిధి నిధులతో గండాదీప, రామాలయ గోపుర నిర్మాణాలు పూర్తి చేశారు. వివిధ ధర్మకర్తల మదలుల ద్వారా విశేష అభివృద్ధి పథంలో పయనిస్తూ, భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లు తున్నది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆలయంలో శివరాత్రి ఉత్సవ వేడుకలు సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు వైభవంగా జగ నున్నాయి. 26న బుధ వారం మహాశివరాత్రి జాగరణ, అర్ధరాత్రి 12–00 గంటలకు లింగోద్భవ కాలమున రుద్రాభిషేక నిషే పూజ, 27న గురు వారం పారణ పగలు 2–30 గంట లకు స్వామి వారికి అన్నపూజ, 28న శుక్ర వారం ఉదయం 19.30 గంటలకు శ్రీ స్వామి వారి రథోత్సవం, అలాగే మార్చి 3 సోమ వారం రోజున ఉదయం 10–30 గంటలకు శ్రీ స్వామి వారికి ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం, తీర్థప్రసాద వితరణ తో వేడుకలు ముగుస్తాయి. వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఈఓ వద్లూరి అనూష, అర్చకులు, సిబ్బంది వలసిన ఏర్పాట్లు చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

## సంపాదకీయం

### అధికారం చేతిలో ఉంటే తప్పులు చేస్తారా?

అధికారం చేతిలోకి వచ్చేందుకు పడే తిప్పలు.. ప్రదర్శించే ఆరాటం అంతా ఇంతా కాదన్నట్లుగా రాజకీయ నేతల్లో కనిపిస్తూ ఉంటుంది. తమ చేతికి పవర్ వచ్చేందుకు వారు పడే శ్రమ అంతా ఇంతా కాదు. అయితే.. అంత కష్టపడిన తర్వాత సొంతం చేసుకున్న అధికారాన్ని.. సరైన పద్ధతిలో ప్రదర్శించే తీరులో మాత్రం తప్పుల మీద తప్పులు చేస్తారు. పవర్ చేతిలో లేనప్పుడు పవర్ ఉన్న ప్రత్యర్థి చేసే తప్పుల్ని అదే పనిగా చెప్పే వారు.. తమ చేతికి అదే పవర్ వచ్చిన తర్వాత అలాంటి తప్పులే చేయటం దేనికి నిదర్శనం? తాజాగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే తీసుకుంటే.. విపక్ష నేతగా సుదీర్ఘకాలం అనుభవం ఉన్న ఆయన.. కేసీఆర్ మొదలు కొని అధినేత ఎవరైనా సరే.. వారు చేసే తప్పుల్ని చిట్టా మాదిరి చెప్పినప్పుడు.. విషయాల్ని ఎంత లోతుగా పరిశీలిస్తారన్న భావన కలుగుతుంది. ఈ తరహా సెన్సిబులిటీ ఉన్న వారి చేతికి పవర్ వస్తే.. తప్పులే చేయరన్న భావన కలుగుతుంది. కానీ.. వాస్తవంలో అందుకు భిన్నమైన పరిస్థితి ఇప్పుడు ఉందని చెప్పాలి. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ ప్రమాదంలో 8 మంది చిక్కుకుపోవటం.. వారిని బయటకు తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేయటం తెలిసిందే. అయితే.. కాలం గడుస్తున్న కొద్దీ.. టన్నెల్ లో చిక్కుకుపోయిన వారి ప్రాణాలకు ముప్పు అంతకంతకూ పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మంత్రులు సైతం.. వారి విషయంలో తక్కువ అవకాశం ఉన్నట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే.. ఈ ఉదంతానికి సంబంధించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విచిత్రమైన విమర్శకు గురి అవుతున్నారు. టన్నెల్ ప్రమాదం వద్దకు వచ్చి.. అక్కడి పరిస్థితి గురించి ఆరా తీసి.. అధికారులకు తగిన సూచనలు ఇవ్వాల్సింది పోయి.. పట్టభద్రుల ఎన్నికల ప్రచారానికి వెళ్లటం ఏమిటి? అంటూ విరుచుకుపడుతున్నారు. ముఖ్యమంత్రికి 8 మంది ప్రాణాలు అవసరం లేదా? ఎన్నికల్లో ఓట్లు మాత్రమే కావాలా? అని మండిపడుతున్నారు. అయితే.. ఈ విమర్శలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు వేరుగా ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ముఖ్యమంత్రి వస్తే సెక్యూరిటీ సమస్య వస్తుందని.. రెస్క్యూ ఆపరేసన్ కు ఆలస్యం అవుతుందని.. ఈ కారణంతోనే ముఖ్యమంత్రి రాలేదని చెబుతున్నారు. ప్రమాదం జరిగింతనే నలుగురు మంత్రులు.. పెద్ద ఎత్తున అధికారులు ఇక్కడే ఉన్నామని.. ముఖ్యమంత్రి రాలేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న విమర్శల్లో బలం లేదని వారు చెబుతున్నారు. కేటీఆర్ లాంటోళ్లు సంస్కారం నేర్చుకోవాలంటూ కోమటిరెడ్డి మండిపడ్డారు. అయితే.. ప్రమాదస్థలానికి ముఖ్యమంత్రి రేవంత్ కొద్ది నిమిషాల పాటు అయినా సరే వెళ్లి ఉండాల్సిందన్న అభిప్రాయం పలువురి నోట వినిపిస్తోంది. ముఖ్యమంత్రి వెళితే.. సహాయక చర్యలకు ఆటంకం కలిగే మాటలో వాస్తవం ఉన్నప్పటికి.. కొన్ని అంశాల విషయంలో టైమ్లీగా నిర్ణయాలు తీసుకోవాలే తప్పించి.. ఒకేలాంటి మైండ్ సెట్ తో ఉండటం సరికాదంటున్నారు. అధికారంలో లేనప్పుడు.. ఏదైనా కష్టం వస్తే అప్పటి సీఎం కేసీఆర్ వెళ్లకుండా ఫాంహౌస్ లో నిద్ర పోతున్నట్లుగా ఇదే రేవంత్ వ్యాఖ్యలు చేసేవారు. ఇప్పుడు తాను ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు గతంలో తాను చెప్పిందే చేయాలన్న విషయాన్ని రేవంత్ ఎందుకు మర్చిపోతున్నట్లు? ఒకవేళ నిజంగానే వెళ్లలేని పరిస్థితే ఉంటే.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లకపోతే ఏమవుతుంది? దానికి బదులు సచివాలయంలో కూర్చొని.. రెస్క్యూ ఎంతవరకు వచ్చింది? మరిక ఏం చేయాల్సి ఉంటుంది? లాంటి అంశాల మీద రివ్యూ చేసినా బాగుండేది. అందుకు భిన్నంగా ఎన్నికల ప్రచారానికి వెళ్లటం మాత్రం సీఎం రేవంత్ ఇమేజ్ ను డ్యామేజ్ చేసేలా మారిందన్న మాట వినిపిస్తోంది. విపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనేం మాటలు చెప్పారో.. అధికారం చేతిలో ఉన్న వేళలో అలా చేయకుండా ప్రత్యర్థులకు అవకాశాన్ని ఇవ్వటాన్ని తప్పు పడుతున్నారు. ఈ విషయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ కు మాత్రమే సాధ్యమైందన్న మాట వినిపించక మానదు. పవర్ చేతిలో ఉన్నప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తిస్తే మంచిది.

# తెలుగునేలలపై శైవమత వ్యాప్తి



చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ. 2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ. 1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253%-%277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవతలను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృధ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావలంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440–495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునునికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామలింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగేశ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850–895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100–70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారంలోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళు...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్దిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు - ఫిబ్రవరి 26... అయ్యదేవర వర్ధంతి



భారత స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలను సైతం ఎదురొడ్డి పోరాటం సాగించిన మహా నాయకులలో తొలితరం తెలుగు నాయకులు కాశీనాథుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం మొదలైనవారు కాగా మలితరం మహా నాయకులలో పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, బులుసు సాంబమూర్తి తదితరులు పేర్కొన తగిన వారు. అయ్యదేవర కాళేశ్వరరావు (జనవరి 22, 1881 – ఫిబ్రవరి 26, 1962) స్వాతంత్ర సమర యోధులు, ఆంధ్ర ప్రదేశ్ శాసన సభకు మొదటి శాసన సభాధిపతి. కాళేశ్వరరావు పశ్చిమ కృష్ణా జిల్లా నందిగామ వాసి. 1881 జనవరి 22వ తేదీన జన్మించారు. కాళేశ్వరరావు ప్రాథమిక విద్య స్వగ్రామం నందిగామలోనే జరిగింది. ఉన్నత విద్య ఆలస్యంగా 1894–1901లో బందరులో జరిగింది. బందరులో రఘుపతి వెంకటరత్నంనాయుడుగారి శిష్యులైనారు. వేమూరి రామకృష్ణారావు వద్ద ఇంగ్లీషు అభ్యసించారు. అక్కడ డా.పట్టాభి, ముట్నూరి కృష్ణారావులతో స్నేహం ఏర్పడింది. ఇంగ్లీషులో లెక్కలలో ప్రావీణ్యం సంపాదించారు. మదరాసు వెళ్లి ఇంజనీరు కావాలనుకున్న కాళేశ్వరరావు కోరిక నెరవేరలేదు. బందరులోనే చరిత్రలో పట్టభద్రులై, కాళేశ్వర రావు ప్రతిభను గుర్తించి ఆయనను అదే స్కూలులో చరిత్ర ఉపాధ్యాయులుగా నియమించారు. 1901–1903 ఉపాధ్యాయుడిగా ఉండి మంచి పేరు తెచ్చుకున్నారు. 1904–1905 సంవత్సరాలలో కాళేశ్వరరావు మదరాసులో లా చదివి న్యాయవాది అయినారు. జమిందారీల చట్టం విషయంలోగల విశేష పరిజ్ఞానం మూలంగా పలువురు జమిందారులకు లాయరుగా పని చేశారు. మదరాసులో కొమర్రాజు లక్ష్మణరావు, కందుకూరి వీరేశలింగంలతో పరిచయం ఏర్పడింది. ఆ కారణంగా సంఘ సంస్కరణోద్యమ బీజం పడింది. రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రభావం వల్ల సంఘ సంస్కరణపై మక్కువతో బ్రహ్మ సమాజ కార్యక్రమాలలో కృషి చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలోను, హోంరూలు ఉద్యమంలోను పని చేశారు. మహాత్మా గాంధీ నాయకత్వంలోని అన్ని ఉద్యమాలలోనూ ఉత్సాహంగా పాల్గొని కారాగార శిక్షను అనుభవించారు. రాజకీయాలతో పాటు గ్రంథాల ప్రచురణలో శ్రద్ధ వహించారు. విజయవాడ లోని రామమోహన గ్రంథాలయ స్థాపనకు సహాయం చేశారు. కొమర్రాజు లక్ష్మణరావు నెలకొల్పిన విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిలో కార్యదర్శిగా పని చేశారు. కారాగారంలో ఉండగా 'ఫ్రెంచి విప్లవ చరిత్ర', 'అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర', 'తురుష్క ప్రజాస్వామికం', చీనా జాతీయోద్యమ చరిత్ర', 'ఈజిప్టు చరిత్ర' అనే పుస్తకాలను రచించారు. 1926, 1937, 1946, 1955 సంవత్సరాలలో జరిగిన శాసనసభ ఎన్నికలలో విజయవాడకు ప్రాతినిధ్యం వహించారు. ప్రజా ప్రతినిధిగా విజయవాడ పురపాలక సంఘానికి అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ఎంతోమందికి విద్యాదానము చేసారు. ఆయన విజయవాడ పురపాలక సంఘ అధ్యక్షులుగా, మద్రాసు శాసనసభకు చీఫ్ విప్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. 1939లో మద్రాసు శాసనసభకు కాంగ్రెస్ పార్టీ తరపున విజయవాడ– బందరులకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీ చేసి ఘన విజయం సాధించారు. రాజగోపాలాచారి ప్రధానమంత్రిగా మద్రాసు ప్రభుత్వం ఏర్పడగా, దానిలో కాళేశ్వరరావు రాజగోపాలాచారికి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మద్యపాన నిషేధ చట్టం, సేల్సుటాక్సు, హరిజన దేవాలయ ప్రవేశ చట్టాల రూప కల్పనలో కాళేశ్వరరావు తన మేధాసంపత్తిని, భాషానైపుణ్యాన్ని ఉపయోగించి మన్ననలు పొందారు. 1946లో విజయవాడ నుంచి శాసనసభకు ఎన్నికైన కాళేశ్వరరావు ప్రకాశం పంతులు పక్షం వహించారు. టంగుటూరి ప్రకాశం మంత్రివర్గంలో కాళేశ్వరరావుకు మంత్రి పదవి రాలేదు కానీ ఆయన శిష్యుడు వేముల కూర్మయ్యకు మంత్రి పదవి కాళేశ్వరరావు ప్రభావం వల్ల లభించింది. ఆ ప్రభుత్వం ఏడాది లోపే పడిపోయినా కాళేశ్వరరావు ప్రకాశం పక్షాననే ఉన్నారు. 1947లో కాళేశ్వరరావు శాసన సభలో బహుభార్యత్వ నిషేధపు బిల్లును ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం 1955లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎన్నికై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభకు అయ్యదేవర కాళేశ్వరరావు తొలి సభాపతిగా ఎన్నికయ్యారు. 1956 నుండి 1962 వరకు రాష్ట్ర శాసనసభ సభాపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. శాసన సభాపతిగా శాసనసభలో భాష తెలుగులోనే ఉండాలని 1959 డిసెంబరు 14న రూలింగ్ ఇచ్చారు. 1961 ఆగస్టు 11న సభాపతి అనుమతి లేనిదే సభలో ఎవరైనా ఎలాంటి ప్రకటనలు, ప్రసంగాలు చేయరాదని రూలింగ్ ఇచ్చారు. 1962లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యారు, కానీ ఫలితాలు వెలువడడానికి ముందురోజే తుదిశ్వాస వదిలాతు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆచరణాత్మక మానవతావాది హేమలతా లవణం - ఫిబ్రవరి 26... హేమలతా లవణం జయంతి



జోగినీ దురాచార నిర్మూలన, నేరస్థుల సంస్కరణల కోసం అవిరళ కృషి జరిపిన మహిళా సంఘ సంస్కర్త, ప్రముఖ రచయిత్రి డాక్టర్ హేమలతా లవణం. స్వాతంత్ర్యానంతర భారత దేశంలో సంఘ సంస్కరణ ఉద్యమానికి అవిరళకృషి చేసిన ప్రముఖ సామాజిక సేవకురాలు. సంఘం విస్మృతుల్కెన దళితులను, గిరిజనులను సంస్కరణోద్యమ అజెండాలో చేర్చి సమకాలీన భారత చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా మిగిలారు. సుప్రసిద్ధ కవి గుఱ్ఱం జాషువా కుమార్తెగా, సంఘసేవకుడు గోపరాజు రామచంద్రరావు (గోరా) కోడలిగా, లవణానికి జీవన సహచరిగా, అన్నింటినీ మించి సాంఘిక సంస్కర్తగా చిరపరిచితులు ఆమె. ఆస్తికురాలిగా జీవితం ప్రారంభించి, వాస్తవికత, సంఘుదృష్టి, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకున్న ఆమె నాస్తికురాలిగా మారారు. ప్రశ్నించే చైతన్యం, పరీక్షించే మనస్తత్వం, సమాజంలో అణగారిన ప్రజల అభ్యున్నతికి పాటుపడాలన్న తపన, దారిద్ర్యాన్ని, అసమానతలను తొలగించి తోటి మానవులకు తోడ్పడాలన్న ఆలోచన ఆమెను క్రొత్తపుంతలు తొక్కడానికి పురికొల్పాయి. తనలో నిహితమైన శక్తి సామర్థ్యాలను, సంఘ సంస్కరణాభిలాషను, సమాజ కళ్యాణ కార్యక్రమాలను పెంపొందించేందుకు ఆమె ముందడుగు వేశారు. స్టువర్టుపురం దొంగతనాలు వృత్తిగా జీవించిన కుటుంబాలను మంచి మార్గంలో పెట్టిన మనత హేమలతదే. హేమలతా లవణం (ఫిబ్రవరి 26, 1932 – మార్చి 20, 2008) గుంటూరు జిల్లా వినుకొండలో జాషువా మరియమ్మలకు 1932 సంవత్సరం ఫిబ్రవరి 26 న ఆఖరి సంతానంగా జన్మించారు. ఆమె ప్రాథమిక, మాధ్యమిక విద్య గుంటూరులో సాగింది. మద్రాసు క్వీన్స్ కళాశాలలో బి.ఏ బంగారు పతక గ్రహీత. నాస్తికత్వం, ప్రజాస్వామ్య విలువలు, గాంధేయ వాదం తదితర విలువలకు కట్టుబడిన గోరా కుమారుడు లవణంతో ఆమె వివాహం జరిగింది. వర్ణభేదాలను అతిక్రమించి జరిగిన ఆమె వివాహం అప్పట్లో సంచలనం కలిగించింది. వినోబా భావే భూదాన యాత్రలో ఆయనతో పాటు చంబల్ లోయలో పర్యటించి బందిపోటు దొంగల్లో మానసిక పరివర్తన తెచ్చేందుకు కృషిచ్టేశారు. 1961లో వాసవ్య విద్యాలయాన్ని స్థాపించి సమత, మమతల కోసం పాటు పడ్డారు. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో ఆర్థిక సమతా మండలి అని సేవా సంస్థను స్థాపించి వెనుక బడిన వారిలో, నిమ్న కులాల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. 1981లో కావలిలో 'నవవికాస్' అనే సంస్థను స్థాపించి దాని ద్వారా అణగారిన వర్గాలను ఆదుకొన్నారు. జోగినులను, వారి పిల్లలను ఆదుకోవడానికి 'సంస్కార్' చెల్లి నిలయం అనే సంస్థలు ఏర్పరచారు. అంధ విశ్వాసాలు 'బాణామతి' మహిళల జీవితాలను ధ్వంసం చేస్తోన్న వైనాన్ని గుర్తించి వాటిని ఆరోగ్య సమస్యగా గుర్తింప చేయడానికి కృషి చేశారు. రెండు వేలకు పైగా జోగినులను సంస్కరించడమే కాక ప్రభుత్వం చేత వారికి పొలాలు ఇప్పించి, జోగినులకు వివాహాలు జరిపించారు. సంస్కార్ సంస్థను స్థాపించి, నిజామాబాదు జిల్లాలో జోగినీ వ్యవస్థ నిర్మూలణకు ఆమె చేసిన కృషి ఫలితంగా "ఎన్టీ రామారావు ప్రభుత్వం జోగినీ వ్యవస్థ నిర్మూలణ చట్టాన్ని'' తెచ్చింది. వర్ణాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. బాలికల కోసం నిజామాబాద్ జిల్లా, గాంధారి గ్రామంలో ప్రత్యేక పాఠశాల నిర్మించారు. చైల్డ్ ఎట్ రిస్క్ (సి.ఎ.ఆర్) పేరుతో దొంగలు, తాగు బోతులు, వ్యభిచార వృత్తిలో కూరుకు పోయిన వారి పిల్లల కోసం సంస్కరణ కేంద్రం స్థాపించారు. "గోరా కోడలు కావడం తన జీవితంలో జరిగిన గొప్ప విషయం" అనేవారు హేమలత. అప్పటి వరకు ఇంటి బాధ్యతలు చదువుకి మాత్రమే పరిమితమైన ఆమె బయటి ప్రపంచాన్ని చూసింది లవణంతో కలిసి చేసిన యాత్రల్లోనే. అయితే, అతి తక్కువ కాలంలోనే సంఘసేవికగా మారి పొగలగడం వెనుక ఆమెలో ఉన్న దయా గుణం, స్పందించే హృదయం కారణాలు అంటారు. జాషువా కావ్యాలు అందరికీ అందుబాటులో ఉండాలన్న దృఢసంకల్పంతో వాటన్నిటినీ ముద్రించారు. స్వయంగా పలు ప్రక్రియల్లో రచనలు చేశారు. అహింసా మూర్తులు – అమర గాథలు, నేరస్థుల సంస్కరణం, జీవన ప్రభాతం, జాషువా కలం చెప్పిన కథ, మా నాన్నగారు, జీవన సాగరం, అనుభవ తరంగాలు, నేరస్తుల సంస్కరణ, తాయెత్తు – గమ్మత్తు, మృత్యోర్మా అమృతంగమయ వంటి పలు రచనలు చేసిన ఆమె 'జీవన ప్రభాతం' నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆత్మగౌరవ పురస్కారం, కర్ణాటక ప్రభుత్వం నుంచి దేశస్నేహి పురస్కారం, అమెరికా నుంచి ఎథీయిస్ట్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2003 సంవత్సరానికి రెడ్ అండ్ వైట్ బ్రేవరి అవార్డు, సావిత్రి పూలే అవార్డు వంటివి ఎన్నో పొందారు. ఆంధ్ర, నాగార్జున విశ్వ విద్యాలయాల సిండికేట్ మెంబరుగా పనిచేశారు. స్టూవర్టుపురం దొంగల పునరావాసం – సంస్కరణ దురాచారంపై హేమలతా లవణం విశేషంగా కృషి చేశారు. 1977 దివిసీమ ఉప్పెనలో బాధితులకు పునరావాస సేవలందించారు. 1979లో ప్రకాశం, నెల్లూరు, 1996 తూర్పుగోదావరి జిల్లా తుపాను విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె సంఘ సేవికగా చేసిన కృషికి, రచనలకు తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్, తానా ఎచ్చీవ్‌మెంట్, వరల్డ్ ఎచ్చీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారు. మాజీ ముఖ్య మంత్రులు ఎన్టీఆర్, చంద్రబాబు నుంచి తెలుగు ఆత్మగౌరవ అవార్డులు తీసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి నుంచి ఉగాది పురస్కారాన్ని, అంబేద్కర్ శతజయంతి సందర్భంగా భీమరత్న అవార్డును పొందిన ఏకైక మహిళ హేమలత. గుఱ్ఱం జాషువా ఫౌండేషన్ స్థాపించి దేశంలో తొమ్మిది మంది కవులకు పురస్కారాలు అంద చేశారు. అండాశయపు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో మార్చి 20, 2008 న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు హేమలతా లవణం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# గడ్డి చూపింది.. గట్టి ఉపాధి

కడెం : వారు కడెం ప్రాంత యువకులు.. ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వివిధ ప్రాంతాలు తిరిగారు. ముంబయి, దుబాయి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కొద్దికాలం దొరికిన పని చేశారు. కానీ అది ఎటూ సరిపోవడం లేదు. మెరుగైన ఉపాధి కోసం అన్వేషిస్తుండగా అనుకోని రీతిలో వీరికో అవకాశం అందివచ్చింది. దాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకుని లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. అదే గోధుమ గడ్డి జ్యూస్ విక్రయం. అందులోని పోషక విలువలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండడంతో ఈ జ్యూస్‌కు ఆదరణ పెరిగింది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జగిత్యాల జిల్లాల్లో ఇక్కడి యువకులు విక్రయ కేంద్రాలను నడుపుతున్నారు.

**నిర్మల్‌లో ఇద్దరు..**

ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి నిరాశతో తిరిగి వచ్చిన కడెం మండలం చిట్యాలకు చెందిన బోరె వెంకటేష్, ధర్మాజి తిరుపతి హైదరాబాద్‌లో రాపల్లి సత్యం జ్యూస్ సెంటర్ గురించి తెలుసుకుని ఆయనను సంప్రదించారు. ఆయన సూచనలతో నిర్మల్‌లో గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఒకరు డిగ్రీ కళాశాల వద్ద, మరొకరు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు ఇంటి స్లాబ్‌పైనే గోధుమ గడ్డి పెంచుతూ అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. వివిధ రకాల జ్యూస్‌లనూ విక్రయిస్తున్నారు. వాటికి ఆదరణ లభించడంతో తమకు గిట్టుబాటుగా ఉందని వీరు పేర్కొంటున్నారు.

**16 ఏళ్లుగా హైదరాబాద్‌లో..**

కడెం మండలం లక్ష్మీపూర్‌కు చెందిన రాపల్లి సత్యం ఇక్కడ వ్యవసాయం



అచ్చిరాక ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. కొన్నాళ్లకు ఓ విదేశీ మిత్రుడు ఇచ్చిన సలహా మేరకు హైదరాబాద్ కేబీఆర్ పార్కు వద్ద 16 ఏళ్ల క్రితం గోధుమ గడ్డి జ్యూస్ విక్రయించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఆదరణ లభించడంతో మరో మూడుచోట్ల బ్రాంచీలు ఏర్పాటుచేసి ఉపాధి మెరుగుపర్చుకున్నారు. ఇప్పుడు గోధుమ గడ్డితో పాటు 16 రకాల ఆకుకూరలు, కూరగాయలతో రసాలు విక్రయిస్తూ మరో పదిమందికి ఉపాధి చూపిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ ఆయా ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నారు.

**ఆదిలాబాద్‌లో బంక రవి..**

కడెంకు చెందిన బంక రవి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేశారు. ఆదాయం సరిపోక కడెం తిరిగొచ్చారు. హైదరాబాద్‌లో జ్యూస్ కేంద్రం నడుపుతున్న రాపల్లి సత్యం సూచనతో తానూ అదే మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నారు. కొద్దిరోజులు శిక్షణ తీసుకుని నెల క్రితం ఆదిలాబాద్ పార్కు దగ్గర గోధుమ గడ్డితోపాటు ఇతర కొన్ని రకాల రసాలను ఉదయపు నడకకు వచ్చేవారికి, ఇతరులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**భైంసాలో..**

కడెం మండలం పెద్దూరుకు చెందిన బైరి మహేష్ భైంసాలో కొంతకాలంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అదనపు ఆదాయ వనరుగా గోధుమ గడ్డి జ్యూస్ కేంద్రాన్ని ఎనిమిది నెలల క్రితం ఏర్పాటు చేసుకుని ఉదయం ఉపాధి పొందుతున్నారు. అవసరమైన వారికి గడ్డి, తయారు చేసిన జ్యూస్ ఇళ్లకు తీసుకెళ్లి ఇస్తున్నారు.

# రీచ్ అక్కడ.. దోపిడీ ఇక్కడ

జైపూర్ : ఇసుక మాఫియా, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయినా జైపూర్ మండలం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. నేరుగా ప్రధాన రహదారులపై నుంచే వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక రీచ్ కోటపల్లి మండలం కొల్లూరులో ఉండగా.. జైపూర్ మండలం ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారుల నుంచి ఇసుక అక్రమ దోపిడీ జరుగుతోందనే విమర్శలున్నాయి. తాజాగా వేలాల, కిష్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకోవడం గమనార్హం.

**నంబర్ ప్లేట్ లేకుండానే రవాణా..**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి పట్టుబడితే ఇటీవల కాలంలో జరిమానాలు సైతం భారీగా విధిస్తున్నారు. గతంలో రూ.5 వేలు ఉ



న్న జరిమానా ప్రస్తుతం రూ.25 వేలకు పెంచారు. దీంతో అంతమొత్తం జరిమానా కట్టడానికి కొందరు వెనుకాడటం లేదు. మరికొందరు తమకున్న రాజకీయ పలుకుబడితో జరిమానాలను తగ్గించుకోవడం గమనార్హం. ఇటీవల పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లతో రెండింటికి నంబర్ ప్లేట్లు లేకుండానే రవాణా సాగిస్తున్నారు. గతంలో కూడా ఇలా నంబర్ ప్లేట్ లేకుండా రవాణా చేసిన వారికి భారీ మొత్తంలోనే జరిమానాలు విధించారు. **ఈ ప్రాంతాల నుంచే..**

జైపూర్ మండలంలోని రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, బెజ్జాల, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం శివారుల మీదుగా గోదావరి ప్రవాహం ఉంది. గోదావరిలో నీటి లభ్యత లేని కారణంగా ఇందారం, రామారావుపేట, వేలాల, కిష్టాపూర్ శివారులతో పాటు రసూల్‌పల్లి వాగు నుంచి ఇసుక రవాణా డిమాండ్‌ను బట్టి బాగానే సాగుతోంది. రాత్రివేళలో అదను చూసి ఇసుకాసురులు తమ పనికానిచ్చేస్తున్నారు.

# ఆపద వేళ.. అంబులెన్స్‌ల దందా!



హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన ఓ మహిళకు ఇటీవల తుంటి ఎముక విరిగింది. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచనతో హనుమకొండ వెళ్లేందుకు ప్రైవేటు అంబులెన్స్‌ను ఆశ్రయించారు. సదరు నిర్వాహకుడు రూ.4 వేలు డిమాండ్ చేశాడు. అత్యవసరం కావడంతో చేసేదేమి లేక అడిగినంత చెల్లించారు. జమ్మికుంటకు చెందిన ఒకరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సుతో వరంగల్ ఎంజీఎంకు ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకెళ్తే రూ.5 వేలు వసూలు చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా భారీగా దండుకుంటున్నారు. వాస్తవానికి దూరాన్ని బట్టి కిలోమీటరు లెక్కన డబ్బులు తీసుకోవాలి. అయితే ఇదెక్కడా అమలు కావడం లేదు. ఇంకొందరైతే కమీషన్ల కక్కుర్తితో బాధితులను నమ్మించి కరీంనగర్, వరంగల్, హనుమకొండ, తదితర ప్రాంతాల్లో వారికిష్టమైన ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు వేలకు పైగానే ప్రైవేటు అంబులెన్స్‌లు ఉన్నాయి.

**ప్రభుత్వాసుపత్రుల ఎదుటే నిలిపి..**

ఒక్క హుజూరాబాద్, జమ్మికుంటలోనే 30 అంబులెన్స్‌లు ఉన్నాయంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రథమ చికిత్సలే తప్ప సరైన వైద్యంలేక ఇతర ఆసుపత్రులకు వెళుతున్న రోగుల సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో ప్రభుత్వాస్పత్రుల ఎదుటే అంబులెన్స్‌లను పార్కింగ్ చేసి అత్యవసర చికిత్సలు అవసరమైన రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. 35-40 కిలోమీటర్ల దూరం వరకు సాధారణ రోగిని తీసుకెళితే రూ.2,500, ఆక్సిజన్ పెడితే రూ.3,200 చెల్లిస్తే చాలని వైద్యుడొకరుతో చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు కమీషన్‌గా సగటున రూ.లక్ష బిల్లుకు 30-35 శాతం ముట్టజెబుతున్నట్లు సమాచారం.

**సరైన పత్రాలు లేకుండా..**

ప్రభుత్వ నిబంధనల మేరకు అంబులెన్స్ వాహనాల్లో ప్రథమ చికిత్స కిట్టు.. ఫిట్‌నెస్, ట్యాక్సీ, పొల్యూషన్, బీమా పత్రాలతోపాటు డ్రైవర్‌కు బ్యాడ్జీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. వాహనంలో ఆక్సిజన్ సిలిండర్, మాస్కు ఉండాలి. అయితే కొన్నింటిలో ఇవేవి లేకుండానే నడిపిస్తున్నట్లు తెలిసింది. అత్యవసర సేవలు కావడంతో అధికారులు వీటిని తనిఖీ చేయడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారనే ఆరోపలున్నాయి. అధికారులు తనిఖీలు చేసి ఈ దోపీడిని అరికట్టాలని కోరుతున్నారు.

# అమృత్ భారత్‌తో ఆధునిక వసతులు



రామగుండం : స్టేషన్లలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు రైల్వే శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అమృత్‌భారత్ పనులు వేగంగా సాగుతున్నాయి. 2023 ఆగస్టులో రామగుండం, 2024 ఫిబ్రవరిలో పెద్దపల్లి స్టేషన్లలో అభివృద్ధి పనులను ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. రూ.26.5 కోట్లతో ఒక్కో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రామగుండంలో పనులు ఇప్పటికే వేగంగా సాగుతుండగా పెద్దపల్లిలో నెల రోజులుగా జోరందుకున్నాయి. జిల్లాకేంద్రంలోని స్టేషన్ నమూనాలో మార్పులు, చేర్పులతో పనులు ఆలస్యమయ్యాయి.

**సరకుల రవాణా కేంద్రం అభివృద్ధి**

పెద్దపల్లి స్టేషన్ ఆధునికీకరణతో పాటు సమీపంలోని సరకుల రవాణా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారు. రవాణా ప్లాట్‌ఫాంపై కవరింగ్ షెడ్ల నిర్మాణంతో పాటు బోగీలు వెలుపలికి కనిపించకుండా గోడ నిర్మించనున్నారు. ఇక్కడ సరకుల దిగుమతి, ఎగుమతి మొత్తం కూనారం రోడ్డు మీదుగా సాగేలా అటువైపు రవాణా ప్లాట్‌ఫాం విస్తరణ పనులు చేపడుతున్నారు. మరోవైపు కూనారం రైల్వే గేటు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ పలుమార్లు వంతెన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులు, గుత్తేదారులతో సమీక్షించడంతో పనుల్లో వేగం పెరిగింది. వేసవి చివరి నాటికి ఆర్వోబీ పనులు కొలిక్కి వచ్చే అవకాశముంది.

**మెరుగవనున్న సేవలు**

జిల్లాలో ప్రధానమైన రామగుండం, పెద్దపల్లి స్టేషన్లు మెరుగైన ఆదాయంతో ఇప్పటికే ఎన్ఎస్‌జీ-4 స్థాయికి చేరుకోగా అమృత్‌భారత్ పథకంతో మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రస్తుతం ఉన్న నడక వంతెనకు అదనంగా మరో ఎస్కలేటర్ నిర్మించనున్నారు. ప్లాట్‌ఫాం విస్తరణతో పాటు పూర్తిగా కవరింగ్ షెడ్లు నిర్మిస్తారు.

ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాల్‌తో పాటు ఏసీ హాల్ కూడా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతమున్న టికెట్ వెండింగ్ యంత్రాలకు అదనంగా మరో యంత్రం ఏర్పాటు చేసి, బుకింగ్ కేంద్రాన్ని ఆధునికీకరిస్తారు. రెండు ప్లాట్‌ఫాంలకు ఇరువైపులా మరుగుదొడ్లు నిర్మిస్తారు. స్టేషన్ బయట ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరు పార్కింగ్ స్థలాలు కేటాయించి, షెడ్లు నిర్మిస్తారు. స్టేషన్ భవనాన్ని పూర్తిగా తొలగించి ఆధునిక నమూనాతో కొత్తది నిర్మించనున్నారు. పెద్దపల్లిలో భవనం కూల్చివేత సాగుతుండగా, రామగుండంలో నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి.

# ఆ మార్గం.. నిత్య నరకం

భీంపూర్ : తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలను అనుసంధానించే మార్గం అది. దాదాపు 20 వేల పైచిలుకు ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డు. ఆర్టీసీకి అధిక ఆదాయాన్నిచ్చే మార్గం. అధికారుల పట్టింపులేనితనం.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఫలితంగా ఆ మార్గం మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నరకయాతన తప్పడం లేదు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలను అనుసంధానిస్తూ జందాపూర్ నుంచి కరంజి - మాండ్వి, గుబిడి వరకు దాదాపు 50 కి.మీ. అంతర్రాష్ట్ర రోడ్డు దుస్థితి ఇది. గత ప్రభుత్వ హయాంలో జందాపూర్ నుంచి ఈదుల్లాసావర్గాం వరకు 7 కి.మీ. మేర రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి నిపాని వరకు, దనోర - కరంజి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.18 కోట్లు, కరంజి - గుబిడి వరకు మరో రూ.6 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గుబిడి రోడ్డు ఉత్తర్వులు ఊసు లేకపోయినా.. మిగిలిన రూ.18 కోట్లకు టెండర్లు పూర్తి చేసి 13 కి.మీ. మేర పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఈదుల్లాసావర్గాం నుంచి నిపాని వరకు రోడ్డును విస్తరించి మట్టి, మొరం పోశారు. దారిపొడవునా పలు వంతెనలు నిర్మించారు. ఇక బీటీ వేయడమే తరువాయి అనుకుంటుండగా.. చేసిన పనులకు బిల్లులు రాక రెండు నెలలుగా గుత్తేదారు పనులు నిలిపి వేశాడు.

**దుమ్ము ధూళిమయం**

విస్తరించిన రోడ్డు గుండా దుమ్ము, ధూళితో ఎదురెదురుగా వస్తున్న



వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. మరోవైపు దనోర నుంచి కరంజి - గుబిడి వరకు రోడ్డు కంకర తేలి, గుంతలుగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జిల్లా కేంద్రం నుంచి కరంజి-టి వరకు గంటన్నరలో చేరుకోవాల్సిన బస్సు మరో గంట ఆలస్యంగా వస్తోందంటే రోడ్డు దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అత్యవసర సమయంలో గర్భిణులు, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సులు రావడం లేదు. బదిలీల్లోనూ ఉపాధ్యాయులు మండల పాఠశాలల ఖాళీలను ఎంచుకునేందుకు విముఖత చూపడం వెనుక రోడ్డు దుస్థితే కారణం. అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కదలిక తెచ్చేందుకు మండల పట్టభద్రులు ఈ నెల 27న జరిగే మండలి ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. బిల్లులు రాక.. నర్సయ్య, ఈఈ, ఆర్అండ్‌బీ బిల్లులు రాక గుత్తేదారు పనులు నిలిపేశారు. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించాం.

# సమయం ఉంది మిత్రమా..!

పాల్వంచ : పదోతరగతి విద్యార్థినులు రమ, రమ్య, రమణి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. ముగ్గురు మంచి స్నేహితులు. వెళ్లే దారిలో.. నాకు కాస్త లెక్కలు చెప్పవా అని రమ్యను రమ అడిగింది. నాకు లెక్కలు ఏమోకానీ సైన్స్‌తో పెద్ద చిక్కొచ్చి పడింది అని రమ్య బదులిచ్చింది. సైన్స్ విషయాన్ని నాకు వదిలిపెట్టి.. ఇంగ్లిష్ సబ్జెక్టులో నేను ఎలా మెరుగుపడాలో చెప్పండి అని రమణి మాట కలిపింది. కొన్ని సబ్జెక్టులపై భయాలు నిరాధారం అనే విషయాన్ని గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టులపై భయానికి మూలకారణాలు గుర్తించి, వాటిని అధిగమించేందుకు యత్నిస్తే పట్టు సాధించటం సులువవుతుందని స్పష్టం చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో గత మూడేళ్ల పదోతరగతి ఫలితాలను విశ్లేషిస్తే ఎక్కువ మంది విద్యార్థులు గణితం, సైన్స్, ఆంగ్లం సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులవుతున్నారు. ఈసారి పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 21న ప్రారంభమవుతాయి. 26 రోజులే మిగిలాయి. ఈ సమయాన్ని విద్యార్థులు ఎలా సద్వినియోగం చేసుకోవాలనే కోణంలో కథనం.

**మెలకువలతో లెక్కలు సులువే**

ప్రతి సబ్జెక్టులో కీలకమైన అభ్యసన మెలకువలను గుర్తించాలి. ఉ



దాహరణకు మ్యాథ్స్‌కు సంబంధించి భౌతిక అంశాలను వస్తువులకు అన్వయిస్తూ అభ్యసించడం ద్వారా సులువుగా నేర్చుకోవచ్చు. గణిత అంశాల్లో సమ వయస్కుల చర్చల్లో పాల్గొనటం, లెక్కలకు సంబంధించిన ఆటలతో తార్కిక ఆలోచన స్వభావం పెరుగుతుంది. వేగం, కచ్చితత్వం అలవడతాయి.

**ఆంగ్లంపై భయం పోవాలంటే..**

మిత్రులతో తరచూ ఆంగ్లంలో సంభాషించటం ద్వారా ఇంగ్లిష్ పదజాలం అభివృద్ధి చెందుతుంది. ఆంగ్ల ప్రశ్నపత్రంలో వచ్చే వివిధ రకాల డిస్కోర్స్‌లపైన ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలి. ఈ అంశాలను ఇతరులతో చర్చించటం ద్వారా ఆంగ్లం అంటే భయం పోతుంది.

**అన్వయించుకుంటే అసామాన్య ఫలితాలు**

ప్రయోగశాల పనులు, వైజ్ఞానిక ప్రదర్శనలు, బొమ్మలు గీయటం- భాగాలు గుర్తించటం, ముగ్గులు వేసే నైపుణ్యాన్ని సైన్స్ రంగోలి ద్వారా ప్రతిబింబింపజేయటం వంటి వాటితో సామాన్యశాస్త్రంపై పట్టు సాధించవచ్చు. నిజజీవిత అంశాలపై సమ వయస్కులు, మిత్రులతో హేతుబద్ధంగా చర్చించటం ద్వారా సృజనశీలత మెరుగుపడుతుంది. సన్నద్ధతే.. విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి పాఠ్యాంశానికి నిర్దిష్టమైన ప్రణాళిక, ప్రశ్నపత్రం నమూనా ఉంటుంది. ఆయా సబ్జెక్టుల్లో ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు? ఏఏ అంశాలపై సమగ్రంగా పట్టు సాధిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయో గుర్తించాలి. కఠినమైన అంశాలను చదివేటప్పుడు తొలుత వెంటవెంటనే సాధన చేయాలి. తదనంతరం కాస్త సమయాన్ని పెంచుతూ నిర్ణీత వ్యవధిలో సాధన చేయటం ద్వారా మెదడు పనితీరు మెరుగుపడి ఆ విషయాలపై పట్టు పెరుగుతుంది. పెసర ప్రభాకర్‌రెడ్డి, సైన్స్ పాఠ్యపుస్తక రచయిత, గైడెన్స్, కౌన్సెలింగ్ నిపుణుడు

పదోతరగతి విద్యార్థులు ఖమ్మం 16,416 భద్రాద్రి 12,970

# పునరావాసం.. అవస్థలమయం!

ఆసిఫాబాద్ : జలాశయ మిగులు జలాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే కారణంతో ఏడేళ్ల కిందట పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీనిచ్చారు. ఈ గ్రామాలకు కొద్ది దూరంలో స్థలాలను కొనుగోలు చేసి, సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులను పూర్తి చేశారు. కానీ విద్యుత్తు, తాగునీటి సౌకర్యాలను కల్పించకపోవడం, ఇంటి స్థలాల కేటాయింపు లేకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగూ తరలించే గ్రామమే కదా అని అధికారులు అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. దశాబ్దాల తరబడి అవస్థలతో సహవాసం చేస్తున్నామని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుమురం భీం జలాశయం నిర్మాణంలో భాగంగా.. 14 గ్రామాలు ముంపునకు గురికాగా, ఇతర చోట్ల పునరావాసం కల్పించారు. కెరమెరి మండలంలోని దేవుడిపల్లి, రాంపూర్, దాబ్‌గూడ, రాంజీగూడకు ఏడేళ్ల కిందట పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇందులో రాంజీగూడకు ధనోరా సమీపంలో ప్రధాన రహదారి పక్కన 10 ఎకరాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు పూర్తి చేశారు. దేవుడిపల్లి గ్రామాన్ని తరలించడానికి సమీపంలో కొండ వద్ద స్థలాన్ని చదును చేసి సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. మొత్తం రూ.4.50 కోట్లు ఖర్చు చేసినా.. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక తరలింపు ప్రక్రియ మూలకు చేరింది. మరోవైపు చేసిన అభివృద్ధి పనులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

**కూలుతున్న కాలువ మట్టితో ఆందోళన**

రాంపూర్ గ్రామానికి చేరువలో ప్రతి వానాకాలంలో వరద నీరు వస్తుంది. ఈ గ్రామాన్ని పునరావాస గ్రామంగా గుర్తించలేదు. రూ.20 కోట్ల వ్యయంతో కుమురం భీం జలాశయం నుంచి ఏడు కిలోమీటర్ల పొడవైన కుడి కాలువను ఆరేళ్ల కిందట పూర్తి చేశారు. కాలువ ప్రారంభంలోనే కూలిపోవడంతో చుక్కనీరు ఆయకట్టుకు అందడం లేదు. దీని ఒడ్డునే మానిక్‌గూడ (ఇదీ పునరావాస గ్రామమే) ఉంది. కాలువ మట్టి క్రమంగా కూలిపోతూ ఏకంగా గ్రామంలోని సీసీ రోడ్డు వరకు వచ్చింది. ఈ నేపథ్యంలో కొందరు ఇళ్లు మరో చోట ఏర్పాటుచేసుకుంటున్నారు. సీసీ కింది నుంచి మట్టి కూలిపోగా, రోడ్డు అవతల నివాస గృహాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే మట్టి కూలకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాన్ని మరోచోటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ గ్రామం వద్ద కూలిపోతున్న కుమురం భీం కుడికాలువ మట్టి ఇది. ఓవైపు సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా, మరోవైపు ఇలా ప్రమాదకరంగా మారింది. ఈ స్థలానికి కొద్ది దూరంలో సైతం భారీగా గట్టు కూలిపోవడంతో పశువులు పడి మరణిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

**పాత ఇంట్లో ఉండలేం.. మరమ్మతులు చేసుకోలేం**

గ్రామాన్ని తరలిస్తామని ఏడేళ్ల నుంచి చెబుతున్నారు. కొత్త ఇల్లు కట్టుకోలేకపోతున్నాం. శిథిలమవుతున్న పాత ఇంట్లో ఉండలేకపోతున్నాం. అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలి. వామన్, దేవుడిపల్లి, కెరమెరి

# ఇచ్చేసెయ్.. వేసేసెయ్

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలో అస్తవ్యస్తంగా కాలనీలు పుట్టుకొస్తున్నాయి. నిన్నటి వరకు వ్యవసాయం చేసిన భూములు.. భారీ కట్టడాలు, జనావాసాలతో పెద్దపెద్ద కాలనీలుగా మారుతున్నాయి. ఇలాంటి ప్రాంతాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రాథమిక దశలోనే అడ్డుకోవాల్సి ఉండగా.. కొందరు అధికారులు కాసుల కక్కుర్తితో నిర్మాణాలకు గంపగుత్తగా అనుమతులు జారీ చేస్తున్నారు. ఇప్పటికీ లేఅవుట్ క్రమబద్ధీకరణ జరగని వాటిలో అనుమతులిచ్చేసిన అధికారులు నిబంధనలను అనుకూలంగా మలచుకుంటున్నారు.

**నిన్నటి వరకు పంటపొలాలు, ఖాళీ స్థలాలు**

జనావాసాల నడుమ ఎకరం నుంచి 5 ఎకరాల వరకు ఖాళీ స్థలాలున్నాయి. వాటిలో వ్యవసాయం, గడ్డి పెంచుతున్నారు. కొన్ని వివాదాల



కారణంగా నిరుపయోగంగా ఉన్నాయి. వీటిలో లేఅవుట్లు వేస్తూ.. తర్వాత రెడీమేడ్ ఇళ్లు, ఇతర కట్టడాలు చేస్తున్నారు. ఇవి సౌకర్యాలు లేక మురికివాడలుగా మారుతున్నాయి. మచ్చబొల్లారంలో, కౌకూర్, కానాజీగూడ, ఓల్డ్అల్వాల్‌లో అనధికార కాలనీలు పుట్టుకొస్తున్నాయి.

**అధికారుల అండదండలు**

కొంతమంది పంచాయతీ సంతకాలతో ఖాళీ స్థలాల్లో లేఅవుట్లు సృష్టిస్తున్నారు. వ్యవసాయ జోన్ పరిధిలోనూ పాత ధ్రువీకరణ పత్రాలు సిద్ధమవుతున్నాయి. అధికారుల అండదండలతో ఖాళీ స్థలాలన్నీ కాలనీలుగా మారుతున్నాయి. కానాజీగూడ నాలాను ఆనుకొని, యాదమ్మనగర్‌లోని కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో, తుర్కపల్లి పరిసరాల్లోనూ ఇదే పరిస్థితి. లేఅవుట్ వేసే సమయంలో అనుమతులిస్తామని ప్రకటించిన యంత్రాంగం తరువాత ఇచ్చేశారు. కాలనీల్లో సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఏదైనా ఆన్‌లైన్!

గోదావరిఖని : చేతిలో ఫోన్ ఉంటే చాలు ఏ వస్తువైనా ఇంటి వద్దకే తెప్పించుకునే వెసులుబాటు ఉండటంతో ఆన్‌లైన్ మార్కెట్‌కు ఆదరణ పెరుగుతోంది.. నిత్యావసర సరుకుల నుంచి ఇంటికి కావాల్సిన విలువైన వస్తువులు దొరకడంతో చాలామంది చిన్న వస్తువు కొనాలన్నా ఆన్‌లైన్ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారు.. మార్కెట్ ధర కంటే తక్కువకు లభిస్తుండటంతోనే డిమాండ్ ఎక్కువయింది.. డబ్బులు ఆదా అవుతుండటంతో పాటు సమయం కలిసి వస్తుండటం వల్ల వేగవంతమైన జీవనంలో జనానికి ఉపయోగకరంగా మారిపోయింది. దీంతోపాటు ఆన్‌లైన్ మార్కెట్‌లో లభించే వస్తువులకు నిత్యం ఏదో ఒక ఆఫర్ వర్తింప చేస్తున్నారు. పండుగల సమయంతో పాటు వివిధ ప్రత్యేక రోజుల్లో మరింత ఎక్కువగా తగ్గింపులు వర్తింప చేస్తున్నారు. దీనికి తోడు క్రెడిట్ కార్డుల ద్వారా క్యాష్‌బ్యాక్‌లు కల్పిస్తున్నారు. నేరుగా మార్కెట్‌లో లభించే వస్తువు ధర కంటే ఆన్‌లైన్‌లో 10 నుంచి 20 శాతం వరకు తక్కువకు లభిస్తుండటంతో వినియోగదారులు ఆన్‌లైన్ కొనుగోళ్లపై ఆసక్తి పెంచుకుంటున్నారు.

**5 వేల మందికి ఉపాధి**

ఉమ్మడి జిల్లాలో రోజుకు 30 వేలకు పైగా వస్తువులు ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా ఇళ్లకు చేరుతున్నాయి. ఆఫర్‌ల సమయంలో అయితే ఈ సంఖ్య రెండింతలవుతుంది. ప్రధాన పండుగల సందర్భాల్లో ఎలక్ట్రానిక్‌తోపాటు నిత్యావసరాలు, గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్లు ఇస్తుంటారు. ఈ సమయాల్లో 60 వేలకు పైగా ఆర్డర్లు వస్తుంటాయని ఆయా సంస్థల పర్యవేక్షకులు చెప్పారు. ఉప్పు, పప్పుల నుంచి బెడ్‌లు, పరుపులు, ఫర్నీచర్, టీవీల వరకు ఆన్‌లైన్‌లోనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా 8 కంపెనీల సేవలు అందుతుండగా, 5 వేల మంది డెలివరీ బాయ్‌లు ఉపాధి పొందుతున్నారు. రోజుకు ఒక్కో డెలివరీ బాయ్ వందల సంఖ్యలో వస్తువులను వినియోగదారులకు చేరవేస్తున్నారు. ఆన్‌లైన్ మార్కెట్ ప్రధాన పట్టణాలతోపాటు పల్లెలకు విస్తరించింది. ఉమ్మడి జిల్లాలో 1,214 గ్రామ పంచాయతీలుండగా వాటికి అనుబంధంగా మరికొన్ని గ్రామాలు



న్నాయి. పట్టణాలకు వెళ్లి దుకాణాల్లో కొనుగోలు చేసే కంటే నేరుగా ఇంటి వద్దకు తీసుకువచ్చే ఈ మార్కెట్‌పైనే పల్లెవాసులూ ఆధారపడటం పెరుగుతోంది.

**ఇవీ లాభాలు**

వస్తువులు అందిన తర్వాతనే డబ్బులు చెల్లించవచ్చు

వస్తువు నాణ్యత లోపిస్తే నిర్ణీత సమయంలో తిరిగి పంపించవచ్చు

ఆఫర్‌ల సమయంలో మార్కెట్ ధరకంటే 10 నుంచి 20 శాతం తక్కువకు లభిస్తుంటాయి

అన్ని రకాలుగా వస్తువును ఆన్‌లైన్‌లో పరిశీలించిన తర్వతనే ఆర్డర్ పెట్టుకునే అవకాశం

క్రెడిట్ కార్డులుంటే కొనుగోలు చేసే వస్తువులపై భారీ తగ్గింపులు లభించే అవకాశం

వీటికి గిరాకీ ఎక్కువ

దుస్తులు, అలంకరణ వస్తువులు

చరవాణులు, టీవీలు

గృహోపకరణాలు, వంట పాత్రలు

# కదిలించాలి.. కరిగించాలి



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌కు నిర్మాణ వ్యర్థాలు ముప్పుగా పరిణమిస్తున్నాయి. రోజువారీ ఉత్పత్తయ్యే వాటిలో సగానికిపైగా ఖాళీ స్థలాలను ముంచేస్తుండగా.. మరో సగ భాగం నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు వెళ్తున్నాయి. ఖాళీ స్థలాలు, చెరువులు, నాలాలు, రోడ్ల పక్కన పోగవుతోన్న వ్యర్థాలతో నగర వాతావరణం దారుణంగా దెబ్బతింటోంది. మరోవైపు.. నిర్మాణ వ్యర్థాల యాజమాన్య కేంద్రాలతోనూ లక్ష్యం నెరవేరట్లేదు. సేకరణ, శుద్ధి, పునర్వినియోగం అంతంతమాత్రంగానే ఉంటోంది. నగరం నుంచి ఆయా కేంద్రాలకు తరలుతోన్న నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా మిగిలిపోతున్నాయి.

**రీసైక్లింగ్ పెరగాలి..:** ఆక్రమణలు, కాలుష్య సమస్యలను నివారించేందుకు జీహెచ్‌ఎంసీ నాలుగు సీ అండ్ డీ యాజమాన్య కేంద్రాలను నగరం నలుమూలల అందుబాటులోకి తీసుకొచ్చింది. అన్నీ రోజుకు 500టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయగలవు. జీడిమెట్ల, నాగోల్ పరిధిలోని ఫతుల్లాగూడ కేంద్రాలు రాంకీ సంస్థ ఆధ్వర్యంలోనివి. వాటి పరిధిలో ఇప్పటికే 8.2లక్షల టన్నుల నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ జరిగింది. శంషాబాద్, తూంకుంటలో ఏర్పాటైన కేంద్రాల్లో వ్యర్థాల సేకరణ మాత్రమే జరుగుతోంది. రీసైక్లింగ్ త్వరలో మొదలుకానుంది.

**ప్రభుత్వానికి జీహెచ్‌ఎంసీ లేఖ..**

నిర్మాణ వ్యర్థాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, రీసైక్లింగ్ ద్వారా వచ్చే వస్తువులను ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టుల్లో 10–20శాతం ఉపయోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం ఇటీవల సర్కారుకు లేఖ రాసింది.

**ప్రజలు నేరుగా ఇవ్వొచ్చు..**

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, ఎల్బీనగర్, కొంత చార్మినార్ జోన్ పరిధిలోని వ్యర్థాలను సేకరించాలంటే.. ప్రజలు నేరుగా టోల్ ఫ్రీ నెంబరు 1800 120 1159కు లేదా 91009 27073 నంబరుకు ఫోన్ చేయొచ్చు. చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, సికింద్రాబాద్ జోన్ల నుంచి అయితే 1800 203 0033 లేదా 7330000203 నంబర్లకు ఫోన్ చేయాలని జీహెచ్‌ఎంసీ సూచిస్తోంది. టన్నుకు రూ. 405 నుంచి రూ. 450 మధ్య రుసుము వసూలు చేస్తారు.

# ‘అప్పుల ఊబిలో’ నార్మల్ మదర్ డెయిరీ




హయత్‌నగర్ :పాడి రైతుల శ్రేయస్సు కోసమే పురుడుపోసుకుంది నల్గొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం (నార్మల్ మదర్ డెయిరీ). ఒక దశలో లాభాలతో స్థిరాస్తులు కొనుగోలు చేసే స్థాయికి ఎదిగింది. కొన్నేళ్లుగా క్షేత్రస్థాయి సిబ్బంది, పాలకవర్గ సభ్యులు అవినీతి, యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు, రాజకీయ జోక్యం, మార్కెట్‌లో పెరిగిన పోటీ తదితర కారణాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయింది.

**ఒప్పందం రద్దయ్యాక..:** 2003లో స్వయం ప్రతిపత్తి సంస్థగా మారిన తర్వాత పాల మార్కెటింగ్‌కు దిల్లీకి చెందిన మదర్ డెయిరీతో 2005 ఒప్పందం చేసుకోవడం జరిగింది. అప్పట్నుంచి లాభాల భాటలో కొనసాగుతూ వచ్చింది. 2015లో అమూల్ పాలు ప్యాకింగ్ చేసేందుకు నార్మాల్ ఒప్పందం చేసుకుంది. మార్కెట్లో తమతో పోటీ ఉన్న అమూల్ పాల ప్యాకింగ్‌కు ఒప్పందం చేసుకోవడం దిల్లీ మదర్ డెయిరీకి రుచించలేదు.పర్యవసానంగా మార్కెటింగ్ ఒప్పందం రద్దు చేసుకుంది. దాంతో నార్మల్ మదర్ డెయిరీ బ్రాండ్ తో తిరిగి మార్కెట్లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పోటీని తట్టుకోలేకపోయింది. ఆదాయంతో పోలిస్తే పెరిగిన ఖర్చులు గుదిబండలా మారాయి. కరోనా మహమ్మారితో నష్టాలు అంతకంతకూ పెరిగాయి. పదేళ్లలో బ్యాంకు రుణాలు రూ. 35.15 కోట్లకు చేరడం.. ఏడాదికి రూ. 4 కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. పాడి రైతుల మూడునెలల పాల బిల్లులు రూ. 20 కోట్లు ఉన్నాయి. రాజకీయ జోక్యం, ఒత్తిళ్లు.. ఆపై సిఫార్సులతో అవసరానికి మించి ఉద్యోగుల సంఖ్య పెరిగిపోయింది. దీంతో ప్రతి నెల సుమారు రూ. 40 లక్షల మేర అదనపు భారం పడుతోంది. ఓ పాలక మండలి ఛైర్మన్ వ్యక్తిగత మెప్పు కోసం 240 మంది తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేయడంతో మరింత ఆర్థిక భారం పడినట్లయింది.

**స్థిరాస్తుల అమ్మకానికి తీర్మానం** ఈ నేపథ్యంలో ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 7న హయత్‌నగర్‌లోని డెయిరీ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరైన 311 మంది సొసైటీ అధ్యక్షుల్లో 299 మంది సంతకాలతో స్థిరాస్తుల విక్రయించేందుకు తీర్మానించారు. నల్గొండ జిల్లా చిట్యాలలోని 29 ఎకరాలు, మిర్యాలగూడలోని 1.5 ఎకరాలను విక్రయించనున్నారు. ఇకనైనా పారదర్శకంగా వ్యవహరించి రైతులు, ప్రయోజనాలను కాపాడాల్సిన ఉంది.

# జాతర సమయం.. నిఘా నేత్రం



వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 25 నుంచి 27 వరకు అత్యంత వైభవంగా జరిగే మహాశివరాత్రి జాతరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనానికి వస్తుంటారు. ఈ సారి దాదాపు 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనాతో రూ. 2 కోట్లు వెచ్చించి అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ పరిసరాల్లో, పట్టణంలో ఎక్కడైనా అనుకోని ఘటన జరిగితే అప్రమత్తమయ్యేలా పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ప్రధాన కూడళ్లు, భక్తుల రద్దీ ప్రాంతాల్లో డేగ కళ్లతో పోలీసులు బందోబస్తు పర్యవేక్షించనున్నారు. ఆలయ ప్రాంతంలో, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా సీసీ కెమెరాలను బిగించారు.

**ప్రత్యేక కంట్రోల్ రూం**

మహాశివరాత్రి జాతర సందర్భంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఆలయ ఓపెన్ స్లాబ్‌వద్ద ప్రత్యేకంగా పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి భద్రతా చర్యలను పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం ఆలయం పరిసరాల్లో 165 పాత సీసీ కెమెరాలుండగా మరో 264 సీసీ కెమెరాలను అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో పాతవి 300 వరకు సీసీ కెమెరాలుండగా మరో 200ల వరకు నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. వీటిని ప్రత్యేక కంట్రోల్ రూంతో పాటు పోలీస్ స్టేషన్, జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. అత్యవసరమైతేనే పట్టణంలోకి కార్లు, ఆటోలను అనుమతించనున్నారు. భక్తులు వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఆలయ పరిసరాలు, పట్టణ పరిసరాల్లో పది పార్కింగ్ స్థలాలను గుర్తించారు.

**రెండువేల మందితో బందోబస్తు**

మహాశివరాత్రి జాతర సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో ఏఎస్పీ, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిపి దాదాపు రెండు వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే ఎస్పీ అఖిల్‌మహాజన్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లు, ప్రధాన ఆలయం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పోలీసు, ఆలయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు గస్తీ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, షీ టీం, ట్రాఫిక్, పెట్రోలింగ్ పార్టీలు విధుల్లో పాల్గొననున్నాయి.

**భద్రత కట్టుదిట్టం**

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ ముమ్మరం చేయనున్నాం. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు, లేక 100కు డయల్ చేయాలి.– వీర ప్రసాద్, పట్టణ సీఐ వేములవాడ

# తక్కువ ఖర్చుతో.. మన్నికగా ఉండేలా..!

ఖమ్మం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే.. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. పునాది రాయి నుంచే తక్కువ ఖర్చుతో.. అత్యంత మన్నికతో పనులు ఉండాలని యోచిస్తోంది. ఇందుకోసం లబ్ధిదారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు, మేస్త్రీలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించనుంది.

**గత అనుభవాల దృష్ట్యా..**

గతంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు అధికార యంత్రాంగానికి అనేక పాఠాలు నేర్పాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోకపోవటంతో చాలాచోట్ల పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సర్కారు భావిస్తోంది. తొలి విడతలో ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో 21 గ్రామాలు, భద్రాద్రి జిల్లాలోని 23 మండలాల్లో



23 గ్రామాల్లో సొంతింటి జాగా కలిగిన లబ్ధిదారులకు గృహాలు నిర్మించే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఒకేరోజు అన్నిచోట్లా శంకుస్థాపన చేయాలని ఉభయ జిల్లాల అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో 1,037, భద్రాద్రి జిల్లాలో 3,491 మంది లబ్ధిదారులను గుర్తించింది.

**లబ్ధిదారులు, మేస్త్రీలకు శిక్షణ**

అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ.. పదికాలాల పాటు మన్నికగా ఉండాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేస్తారు. రూ. 5లక్షలతోనే పనులు పూర్తిచేయాలని సర్కారు యోచిస్తోంది. ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇసుక, సిమెంటు, ఇనుము, ఇతరత్రా వినియోగంలో ఎక్కడా వృథా ఖర్చులకు తావులేకుండా చూస్తారు. లబ్ధిదారులు, కార్యదర్శులు, మేస్త్రీలకు మూడ్రోజుల పాటు శిక్షణ ఇప్పించనున్నారు. ఇందుకోసం ముందుగా మండలానికి ఇద్దరు చొప్పున మేస్త్రీలకు ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తారు. ఆ తర్వాత మరో ముగ్గురికి శిక్షణ ఇవ్వనున్నారు. వీరందరినీ నమూనా ఇళ్ల వద్దకు తీసుకెళ్లి మళ్లీ అక్కడ తర్ఫీదు ఇస్తారు. పునాది స్థాయిలో రూ. లక్ష కూడా ఖర్చు చేయలేని వారిని అధికారులు గుర్తించారు. దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలైన లబ్ధిదారులకు మహిళా సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించనున్నారు. పునాది స్థాయి వరకు రూ. లక్ష రుణం ఇప్పించి.. ప్రభుత్వం నుంచి లబ్ధిదారు ఖాతాల్లో జమకాగానే.. అప్పు చెల్లించేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

నిరుపేదల సొంతింటి కల తీర్చేలా జిల్లాలో త్వరలోనే ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులు మొదలుపెడతాం. తక్కువ ఖర్చుతో మన్నికగా ఉండేలా ఇళ్లను నిర్మిస్తాం. ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంటు సరిపడా మాత్రమే వినియోగించేలా లబ్ధిదారులు, స్థానిక అధికారులు, మేస్త్రీలకు శిక్షణ ఇప్పిస్తాం.జితేశ్ వి.పాటిల్, కలెక్టర్

# ప్రాథమిక వైద్యం.. అందని దైన్యం

ఆదిలాబాద్ : ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)ల్లో వైద్యులు లేక సేవలు అందడం లేదు. పేదలకు అందించే సర్కారు వైద్యం కోసం గత ప్రభుత్వం పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. మౌలిక సదుపాయాలు కల్పించింది. ఉమ్మడి జిల్లాలోని 78 ఆరోగ్య కేంద్రాల్లో పని చేసేందుకు ప్రభుత్వం 180 మెడికల్ ఆఫీసర్(వైద్యులు) పోస్టులను మంజూరు చేసింది. ఇప్పటికీ 119 మంది వైద్యులే అందుబాటులో ఉంటే 61 పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ కావడం లేదు.

**పైలట్ ప్రాజెక్టులకు మనమే..**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే పథకాలకు ఉమ్మడి జిల్లా ప్రయోగశాలగా నిలుస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు, ఐటీడీఏ, ఆర్టీసీ బస్సు డిపో, ప్రత్యేక డీఎస్సీ కింద ఉపాధ్యాయుల నియామకం, పీహెచ్‌సీలను బలోపేతం చేయటం, మలేరియా, రక్తహీనతను నివారించటంలాంటి ఎన్నో విప్లవాత్మకమైన ప్రభుత్వ నిర్ణయాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. కానీ పైలట్ ప్రాజెక్టు గడువు ముగిశాక జిల్లాలో ఏ పథకం పూర్తిస్థాయిలో అమలు కావటం లేదు.

**ముగ్గురికి ఒక్కరే..**

నిర్మల్ జిల్లా కుభీరులోని పీహెచ్‌సీ. షిఫ్టుకు ఒక వైద్యుడి వంతున ముగ్గురు 24 గంటలు పని చేయాల్సి ఉంది. ఒకే వైద్యుడు ఉండటంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే సేవలందిస్తోంది. మండలంలోని 42 గ్రామ పంచాయతీలు, మరో 37 అనుబంధ గ్రామాలకు ఇదే పెద్ద దిక్కు. ఇక్కడ వైద్యం అందక బాధితులు భైంసాకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్టాఫ్ నర్సే దిక్కు..ఆదిలాబాద్ హమాలీవాడలోని యూపీహెచ్‌సీలో ఒక్క వైద్యుడు కూడా లేరు. స్టాఫ్ నర్సు లీలనే రోగులకు వైద్యం అందిస్తున్నారు. తాటిగూడ, క్రాంతినగర్, జైజవాన్‌నగర్, తిలక్‌నగర్, గడియార్ నగర్‌కు నుంచి రోజుకు సగటున 150 మంది వరకు రోగులు వస్తుంటారు. అంతా పేదలే. ఇక్కడ సిబ్బందికి అంకితభావంతో పని చేస్తారనే పేరుంది. వైద్యుడు లేక అత్యవసర రోగులకు సేవలందించటం ఇబ్బందిగా మారుతోంది.

డాక్టర్ లేకుంటే ఎలా? సవితవైద్యుడు లేకుండా దవాఖానా ఉంటే ఏం లాభం. సర్కారు ఆసుపత్రులకు వచ్చే వారు పేద, మధ్య తరగతి వారే. మాలాంటివారి గోడు, బాధ ప్రభుత్వమే గుర్తించాలి. ప్రభుత్వ వైద్యాన్ని మెరుగుపర్చాలి.

చరకలు



## మరో రెండేళ్లు ఇంతే.. తాగునీరు కొంతే

హైదరాబాద్: శరవేగంగా విస్తరిస్తున్న మహానగరంలో మరో రెండేళ్ల వరకూ ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీటితోనే సర్దుకోవాల్సిన పరిస్థితి. గోదావరి రెండోదశలో నగరానికి నీరు అందేవరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న 550 ఎంజీడీలే వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను గరిష్ఠ సామర్థ్యం మేరకు ఉపయోగించుకుంటుండగా.. ఇంతకుమించి తీసుకునే పరిస్థితి ఇప్పటికిప్పుడు లేదని అధికారులు పేర్కొంటున్నారు.



**ప్రస్తుత పరిస్థితి..** జలమండలి పరిధి ప్రస్తుతం 1,450 చదరపు కిలోమీటర్లు. జీహెచ్‌ఎంసీతోపాటు 18 మున్సిపాలిటీలు మరో 17 పంచాయతీలు, కోటి 20 లక్షలపైగా జనాభాకు జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. ప్రస్తుతం రోజుకు 550 ఎంజీడీలు సరఫరా చేస్తోంది. తొమ్మిదేళ్లుగా నగరం విస్తరించినా.. జనాభా పెరిగినా అదనంగా రాకపోవడంతో సమస్య పెరిగింది. దీనికితోడు కొత్త ప్రాంతాలు జలమండలి పరిధిలోకి వస్తుండటంతో మరింత ఒత్తిడి పెరుగుతోంది.

**అనేక రకాలుగా వృథా..**

జలమండలి సరఫరా చేస్తున్న నీటికి కిలో లీటరు(వెయ్యి లీటర్లకు) రూ.48 అవుతోంది. నగరంలో నీటి వృథా అనేక రకాలుగా జరుగుతోంది. ఈ నీటిని వందశాతం తాగేందుకే ఉపయోగించాల్సి ఉన్నా.. ఇతర అవసరాలకూ వినియోగిస్తున్నారు. ప్రధానంగా గార్డెన్‌లు, ఇంటి పరిసరాలను, వాహనాలను శుభ్రం చేయడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

## ఆన్‌లైన్ ఆట.. నేరాల బాట

హైదరాబాద్ : బుద్ధిగా చదివే విద్యార్థి గంజాయి స్మగ్లర్‌గా మారాడు. కార్పొరేట్ కంపెనీలో ఉన్నతస్థాయి ఉద్యోగి దొంగయ్యాడు. ప్రాంగణ ఎంపికలో ఐటీ కంపెనీలో కొలువు సాధించిన యువకుడు నేరాల బాట పట్టాడు. ఒక బ్యాంకు ఉద్యోగి ఖాతాదారుల సొమ్ము రూ.50 లక్షలు సొంత ఖాతాకు మళ్లించుకున్నాడు. ఎంతోమంది ఆన్‌లైన్ ఆటకు బానిసలై డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. అప్పులపాలవుతున్నారు. 3 కమిషనరేట్ల పరిధిలో ఏటా రూ.10 కోట్ల మేర బాధితులు నష్టపోతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి.

**ఆన్‌లైన్ గేమింగ్ మోసాలిలా..**

ఆన్‌లైన్ గేమింగ్‌లో రెండు పద్ధతులు. 'స్కిల్ గేమ్', 'ఛాన్స్ గేమ్'. స్కిల్‌గేమ్‌కు దేశంలో అనుమతి ఉన్నప్పటికీ తెలంగాణలో నిషేధం. ఛాన్స్‌గేమ్ దేశం మొత్తం నిషేధం. స్కిల్ గేమ్‌లో మూడు ముక్కలాట, రమ్మీ ఉంటే ఛాన్స్ గేమ్‌లో ప్రిడిక్షన్ ఉంటాయి. ఆడేందుకు రూ.లక్ష డిపాజిట్ చేయాలి. తొలుత రూ.200, రూ.300, రూ.2-3 వేల వరకూ గెలిపిస్తూ లాభాల ఆశ చూపుతారు. ఆశతో రూ.5-10వేల వరకూ వెళ్లారంటే కేటుగాళ్ల చేతికి చిక్కినట్టే.

గుర్తింపు పొందినవారితో ప్రచారం

ఆన్‌లైన్ గేమింగ్/బెట్టింగ్‌ల్లో ఆనందం.. ఆదాయం సొంతం చేసుకోవచ్చంటూ నిర్వాహకులు సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లలు, యువతను ఆకట్టుకుంటున్నారు. యూట్యూబ్, రీల్స్ ద్వారా గుర్తింపు పొందిన యువతకు కమీషన్ ఇచ్చి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయిస్తున్నారు. ఇదంతా నిజమని భావించిన శివారు ప్రాంతానికి చెందిన యువకుడు రూ.10 లక్షలు నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**అత్యాశకు పోతే కష్టార్జితం గల్లంతే**

చైనా కంపెనీలు గేమింగ్/బెట్టింగ్ యాప్‌లతో సొమ్మంతా కాజేస్తున్నాయి. క్రిప్టోగా మార్చి దుబాయ్, సింగపూర్, చైనా దేశాలకు హవాలారూపంలో చేరవేస్తున్నారు. బ్యాంకులు, యూపీఐ లావాదేవీలున్న ఫోన్ల పాస్‌వర్డ్, పిన్ నంబర్ గోప్యంగా ఉంచుకోవాలి. తేలిక మార్గంలో డబ్బు సంపాదించ వచ్చనే అత్యాశ వద్దు.

## ఉపకేంద్రాల నిర్మాణం మరింత ఆలస్యం

హైదరాబాద్: నగరంలో విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి గుత్తేదార్లు ముందుకురావడం లేదు. నిబంధనల్లో మార్పులతో జోన్ పరిధిలో సింగిల్ టెండర్లకు పెద్ద సంస్థల నుంచి స్పందన కరువైంది. చిన్న సంస్థలేమో అర్హత లేక దూరంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం రెండుసార్లే టెండర్ల గడువు పొడించే అధికారం ఉంది. ఈ గడువు శుక్రవారంతో ముగిసినా ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. దీంతో తదుపరి ఏం చేయాలనే దానిపై టీజీఎస్పీడీసీఎల్ మాస్టర్‌ప్లాన్ విభాగం కార్పొరేట్ కార్యాలయానికి లేఖ రాసింది. టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో వేగంగా పూర్తిచేయాలనుకున్న 88 ఉపకేంద్రాల నిర్మాణం మరింత ఆలస్యం కానుంది.

నగరంలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌లో నిర్మించే ఉపకేంద్రాలన్నింటికీ కలిపి ఒకటే టెండర్ వేయాలనే నిబంధనను సంబంధిత శాఖ మంత్రి ఆదేశాలతో డిస్కం తీసుకొచ్చింది. రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 88 విద్యుత్తు ఉపకేంద్రాలకు జోన్ల వారీగా గత నెలలో టెండర్లు పిలిచింది. స్పందన లేకపోవడంతో మొదటిసారి వారంగడువు పొడించారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండోసారి గడువు పెంచారు. 24వ తేదీతో అదీ ముగిసింది. మూడోసారి పొడిగించే అవకాశం లేదని మాస్టర్‌ప్లాన్ అధికారులు తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయాలు ఉంటాయన్నారు. వీటికి వారం గడువు పొడిగింపు: జోన్ల వారీగా సింగిల్ టెండర్లకు స్పందన లేకపోవడంతో ఇదివరకే 88 ఉపకేంద్రాల నుంచి ఐదు ఉపకేంద్రాలను మినహాయించి పాత విధానంలో సబ్‌స్టేషన్ వారీగా టెండర్లను అధికారులు పిలిచారు. గడువు శుక్రవారం ముగిసినా బిడ్లు దాఖలు కాకపోవడంతో మరో వారం పొడిగించాలని నిర్ణయించారు.

## శుద్ధి కాలేదు.. మురుగు వదల్లేదు



హైదరాబాద్ : వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు నుంచి ప్రజలకు ఉపశమనం లభించట్లేదు. పాతికేళ్లుగా నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను తమ గ్రామంలో పడేస్తున్నారని, కోటిన్నర మంది నివసించే హైదరాబాద్‌ను ఒకేఒక్క డంపింగ్‌యార్డుతో నడిపిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు ఎగురుతూ, దుర్వాసనతో ఆ ప్రాంతం అధ్వానంగా మారుతోంది. అక్కడి ప్రజల సమస్యలు, భూగర్భ జలాలు, చెరువుల కాలుష్యం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి.

**అమలుకాని నిబంధనలు**

డంపింగ్‌యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించుకుని, లోపల ఉత్పత్తయ్యే మురుగునీటిని లోపలే శుద్ధి చేయాలన్న నిబంధనను నిర్వాహకులు అమలు చేయట్లేదు. చెత్తకుప్పల్లో ఉత్పత్తయ్యే విష వాయువులను సాయంత్రం 5.30గంటల నుంచి గాల్లోకి వదులుతున్నట్టు కార్మికనగర్, గబ్బిలాలపేట ప్రజలు వాపోతున్నారు. కార్మికనగర్ నుంచి హరిదాసుపురం వెళ్లే మార్గంలోని చెరువు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అందులోంచి ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్వాసన వస్తోంది. కొన్ని రోజులుగా డంపింగ్‌యార్డు ప్రధాన ద్వారం ఎదురుగా ఉండే కుంటలోకి మురుగును మళ్లిస్తున్నారని, ఆ నీరు స్వచ్ఛమైన నీటితో ఉండే ఏదులకుంటను నాశనం చేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ సీనియర్ ఇంజినీరును వివరణ కోరగా.. 'మల్కారం చెరువులోని గాఢ జలాన్ని (లీచేట్) శుద్ధి చేసే పనులు మెరుగ్గా జరుగుతున్నాయి. నిదానంగా భూగర్భ జలాలు మెరుగుపడతాయి. ఆ ప్రాంతంలో దుర్వాసన తగ్గింది."అని వివరణ ఇచ్చారు.

**ప్రకటనకు భిన్నంగా..**

నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను 15 ఏళ్లుగా జవహర్‌నగర్‌లో పడేస్తున్నారు. 2010 నుంచి వ్యర్థాలను మెరుగ్గా నిర్వహించే పనులు మొదలయ్యాయి. జీహెచ్‌ఎంసీ, గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యంతో ఐదేళ్ల క్రితం వరకు చెత్తకుప్పలు బయటికి కనిపించేవి. వర్షాలు, ఇతర సమయాల్లో చెత్త నుంచి ద్రవించే మురుగునీరంతా పక్కనున్న మల్కారం చెరువులోకి చేరుతోంది. ఏళ్లుగా అదే పరిస్థితి ఉండటంతో చెరువులోని మురుగు కఠినమైన ఆమ్లంలాంటి ద్రవంలా మారింది. అమ్మోనియా, ఇతరత్రా లోహాలతో నిండిన హానికర నీటిని శుద్ధి చేయాలని 2021లో జీహెచ్‌ఎంసీ రూ.251కోట్లతో శుద్ధి పనులు చేపట్టింది. 90శాతం తేటగా కనిపించే శుద్ధ జలంగా మార్చి, దిగువకు వదిలేశామని తాజాగా రాంకీ సంస్థ ప్రకటించింది. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

డంపింగ్ యార్డు విస్తీర్ణం: 351 ఎకరాలు

2021 నాటికి మల్కారం చెరువులోకి చేరిన కఠిన జలాలు: 9 లక్షల కిలో లీటర్లు

రోజు వచ్చే చెత్త: 8 వేల టన్నులు

గాఢ మురుగు జలాలు శుద్ధి చేసే ప్రాజెక్టు విలువ: రూ.250 కోట్లు

ఇప్పటివరకు పూర్తయిన శుద్ధి: 90 శాతం

**చెరువుల్లోకి చేరి..**

దిగువకు పంపిస్తున్న నీటిని పరిశీలించగా ముదురు పసుపు రంగులో కనిపించింది. ఆ నీరంతా వెళ్లి గొలుసుకట్టు చెరువులైన చీర్యాల పెద్దచెరువు, సూర్యనారాయణ చెరువు, ఏదులాబాద్ చెరువు, ఓ కుంటలో చేరుతోంది. కొన్నేళ్లుగా చెరువుల్లో నిల్వ ఉండటంతో.. పంట పొలాలు నిరుపయోగంగా మారాయి. దుర్వాసనతో చీర్యాల చెరువు కట్టకు స్థానికులు గండికొట్టారు. దిగువనున్న రెండు చెరువులు, కుంటదీ ఇదే పరిస్థితి. హరిదాసుపల్లి, తిమ్మాయిపల్లిలోని కొంత భాగం, చీర్యాల, అహ్మద్‌గూడ, గోదుమకుంట, కుందన్‌పల్లి, రాంపల్లి, ఏదులాబాద్, దమ్మాయిగూడ, జవహర్ నుంచి అల్వాల్ వరకు పలు గ్రామాలను దుర్వాసన, కలుషిత జలాల సమస్య వేధిస్తోంది.

**ఊరు ఖాళీ అవుతోంది..: లక్ష్మారెడ్డి, హరిదాసుపురం**

డంపింగ్‌యార్డు, మల్కారం చెరువుకు సమీపంలోనే మా ఊరు ఉంది. ఒకప్పుడు వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు పండించేవాళ్లం. చెరువులో మురుగునీటిని నిల్వ చేయడంతో భూగర్భ జలాలు ఎర్రగా మారాయి. నాణ్యమైన పంటలు రావట్లేదు. గాలి, వాతావరణం దుర్భరంగా మారాయి. రైతులంతా ఊరు విడిచి వెళ్లారు. పక్కనున్న గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నారు.

## పురపాలికల పగ్గాలు ప్రత్యేకాధికారులకు!



హుజూరాబాద్ : పురపాలికల పగ్గాలు ఇక ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. మున్సిపల్ పాలకవర్గాల పదవీ కాలం రెండ్రోజుల్లో ముగియనుండగా ఆ దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 14 పురపాలికలకు 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. అదే నెల 27న పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ నెల 26న పురపాలక సభ్యుల పదవీకాలం ముగుస్తుండగా ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఇప్పటికే గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల సభ్యుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగిన తర్వాతే మున్సిపాలిటీలకు నిర్వహిస్తారు. దీనికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశముండటంతో అప్పటి వరకు పురల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి కానుంది. రాష్ట్రంలో 2019 జులై 2న పురపాలిక పాలకవర్గాల పదవీ కాలం ముగిసినా.. అప్పటి ప్రభుత్వం కొత్త మున్సిపల్ చట్టం తీసుకురావడం, ఓటర్ల గణన, వార్డుల విభజన, రిజర్వేషన్ల అమలు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించింది. అప్పుడు కూడా ప్రత్యేకాధికారులను నియమించి ఆరు నెలల పాటు పాలన కొనసాగించింది.

**అయిదేళ్ల పాలన ఇలా..** ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో మెజార్టీ స్థానాలు భారాస కైవసం చేసుకున్నప్పటికీ ఆ అయిదేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ప్రగతి జరగలేదు. 2020లో కరోనా కారణంగా ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి నిలిచిపో యింది. అనంతరం పురపాలికల్లో సమీకృత భవనాలు, డంపింగ్ యార్డులు, మురికికాలువలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినా పూర్తిస్థాయిలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలాయి. పట్టణ ప్రగతి కింద ప్రతినెల నిధులు రావడంతో త్వరితగతిన బిల్లులు విడుదలవుతాయని భావించి కౌన్సిలర్లు గుత్తేదారులుగా అవతారమెత్తి పనులు చేశారు. మరికొందరు బినామీలతో, పుర ఛైర్మన్‌లు కూడా బినామీల పేరిట పనులు చేశారు. 2024 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. పట్టణ ప్రగతి నిధులు జాడ లేదు. ఏడాది నుంచి పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. విలీన గ్రామాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఫలితంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి పనులు దక్కించుకున్న గుత్తేదారులు చేతులెత్తేశారు. టెండర్లు పిలిచినా ముందుకు రావడం లేదు. ప్రజాప్రతినిధులు బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో అయోమయంలో పడ్డారు.

## గ్రాఫిక్ డిజైనర్.. నకిలీ నోట్ల క్రియేటర్



చర్లపల్లి : తక్కువ సమయంలో పెద్దఎత్తున డబ్బు సంపాదించాలనే ఆశతో నకిలీ నోట్ల తయారీని వృత్తిగా మలచుకున్న యువకుడిని రాచకొండ ఎస్‌వోటీ, పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.5లక్షల విలువైన 1000 రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్‌మెట్ రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలసి సీపీ జి.సుధీర్‌బాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం అమరచింతకు చెందిన నవీన్‌కుమార్(26) సివిల్ బ్రాంచ్‌లో డిప్లొమా చేశాడు. సరైన ఉద్యోగం దొరక్క మల్టీమీడియా, గ్రాఫిక్ డిజైన్, వెబ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్ నేర్చుకున్నాడు. కరోనా సమయంలో కొలువు లేక ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. కొన్నిరోజులు ఉబర్, ర్యాపిడోలో బైక్‌ట్యాక్సీ నడిపాడు. సంపాదన చాలకపోవటంతో 2023 ఆగస్టులో నకిలీనోట్ల తయారీపై దృష్టి పెట్టాడు. డిజైనింగ్ సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉండటాన్ని అనువుగా మలచుకున్నాడు. నకిలీ నోట్ల తయారీకి అవసరమైన సామగ్రి కోసం అంతర్జాలంలో వెతికే క్రమంలో కోల్‌కతాకు చెందిన వ్యాపారితో పరిచయం ఏర్పడింది. కొంతకాలం కోల్‌కతా రప్పించుకొని శిక్షణనిచ్చాడు. నోట్ల తయారీ ముఠాలతో సంబంధాలున్న గుజరాత్‌కు చెందిన వ్యక్తిని నవీన్‌కుమార్‌కు పరిచయం చేశాడు. ముగ్గురు ముఠాగా ఏర్పడి భారీగా రూ.500 నోట్లను ముద్రించాలనే పథకం వేశారు. రూ.లక్ష నకిలీ నోట్లు తయారు చేస్తే రూ.10వేలు కమీషన్ ఇస్తానని ఇతడికి ఆశచూపారు. ముడి సామగ్రి, మెషినరీ కోసం అవసరమైన డబ్బును కర్నూలులోని అతని స్నేహితుడి నుంచి అప్పుగా తీసుకున్నాడు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం దివిటిపల్లి కేసీఆర్‌నగర్‌లోని ఓ ఇంటిలో నకిలీ నోట్ల తయారీ మొదలు పెట్టాడు. తక్కువ సమయంలోనే రూ.5 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు తయారు చేశాడు. తుక్కుగూడలో వాటిని ఏజెంట్లకు ఇచ్చేందుకు వెళ్లాడు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఈ ముఠాపై నిఘా ఉంచిన పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముఠాలోని మిగిలిన సభ్యులకోసం గాలిస్తున్నారు.

## పంటలు లేకున్నా.. పెట్టుబడి సాయం

జగిత్యాల : ఈ చిత్రాల్లో కనిపిస్తున్న భూములు కోరుట్ల నియోజకవర్గంలో ఇళ్లస్థలాలుగా మార్చినవి, జగిత్యాల నియోజకవర్గంలో ఇటుకబట్టీలకు వినియోగిస్తున్నవి. ఇలా జగిత్యాల జిల్లాలో ధరణి(భూభారతి) పోర్టల్‌లో నమోదై ఉండి రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడిసాయం పొంది వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నవి, సాగుయోగ్యంగాని భూములు వేలాది ఎకరాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా మార్చి ఈ నెల 26 నుంచి ఎకరాకు ఒక పంటకు రూ.6 వేలు ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం చేపట్టిన క్షేత్ర సర్వేలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో ఇదివరకు 4.75 లక్షల ఎకరాలకు రైతుబంధు సాయాన్ని వర్తింపచేశారు. 2018 మేలో పథకాన్ని ప్రారంభించినప్పుడు ఎకరాకు రూ.4 వేలు తర్వాత ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు పంటలకు కలిపి రూ.10 వేలు ఇస్తూవచ్చారు. ప్రస్తుతం వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు జిల్లాలోని 299 రెవెన్యూ గ్రామాల పరిధిలో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఇటీవల సర్వే చేపట్టారు. ఈ సర్వేలో ఇప్పటివరకు 6,207 ఎకరాల భూమి వ్యవసాయేతర అవసరాలకు మళ్లినట్లు లేదా సాగుయోగ్యం కానిది తేల్చారు. ఇందులో మిల్లులు, ఫంక్షన్‌హాళ్లు, రియల్‌ఎస్టేట్ వెంచర్లు, ఇటుకబట్టీలు, ఫారాలు, రహదారులు, గోదాములు తదితరాలున్నట్లు గుర్తించారు. ఓ రైతు తన సాగుభూమిని విభజించి పలువురికి విక్రయించగా రహదారులకు వదిలిన భూమి సదరు రైతు పేరిటనే ఉంటుంది కాబట్టి ఈ భూములను గుర్తించాల్సి ఉంది. ప్రధాన రహదారులు, కాలువలకు వెళ్లిన భూములు, సర్వేనంబర్లవారీగా రాళ్లూరప్పలున్న భూములను గుర్తించాల్సిఉంది. ప్రభుత్వం నుంచి అటవీ యాజమాన్య హక్కులు పొందిన భూములకు పెట్టుబడిసాయం ఇస్తుండగా ఇదే అదనుగా జిల్లాలో ఆక్రమణకు గురైన వేలాది ఎకరాల్లోని అటవీ భూములకు సైతం పెట్టుబడి సాయం వెళుతోందనే విమర్శలున్నాయి. ఆక్రమిత భూముల వివాదాలపై రెవెన్యూ, అటవీశాఖ హద్దులను తేల్చి అర్హులైన రైతులకే రైతుభరోసా వర్తింపచేయాల్సి ఉంది. ఇటీవల జగిత్యాల మండలంలో ప్రభుత్వభూమిని ప్రైవేటువ్యక్తుల పేరిట పట్టా చేయగా జిల్లాలోని పలుచోట్ల ఇలాగే ప్రభుత్వభూమి చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ భూమితో పాటుగా సదరు వ్యక్తులు పొందిన పెట్టుబడి సాయాన్ని వెనక్కి తీసుకోవాల్సిఉంది.

పల్లెల్లో వ్యవసాయేతర అవసరాలకు మళ్లిన భూములను సులువుగానే గుర్తించే వీలున్నా పట్టణాలు, మండలకేంద్రాల శివారుల్లో భూములను గుర్తించటం సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో క్షేత్రసర్వేను పొడిగించి సాగుయోగ్యంగాని, సాగేతర అవసరాలకు వాడుతున్న భూములను రైతుభరోసానుంచి తొలగించాలి. జిల్లా అధికారులు ఇప్పటివరకు 6,207 ఎకరాలను గుర్తించినా ఇంతకన్నా చాలా ఎక్కువగానే వ్యవసాయేతర అవసరాలకు మళ్లిన భూమి ఉంది. అతితక్కువ రోజుల్లోనే సర్వే చేయటంతో రైతువారీగా లేదా సర్వేనంబరు వారీగా పరిశీలన కుదరక సమగ్ర గుర్తింపు సాధ్యపడలేదు. కొంతభూమిని నాలాకు మార్చి మిగిలిన భూమిలో పంటలు పండించకున్నా రైతుబంధు సాయంపొందినవి కూడా ఉన్నాయి.

**ప్రభుత్వానికి సమగ్ర నివేదిక** సీహెచ్.రాంచందర్, డీఏవో

ప్రస్తుతం సర్వేలో గుర్తించిన భూముల వివరాలను ఆన్‌లైన్‌చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాము. అన్ని భూముల ఆన్‌లైన్ పూర్తయితే ఏ కేటగిరీ కింద ఎంత భూమి రైతు భరోసా నుంచి తొలగుతుందనేది తెలుతుంది. గ్రామసభలో అభ్యంతరాలు, తదుపరి సమగ్ర క్షేత్రపరిశీలనతో పూర్తి సాగుభూముల వివరాలు ప్రభుత్వానికి చేరతాయి.

## నిబంధనలు.. గోడమీది రాతలేనా?

చేర్యాల: దేవుడి దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు కొబ్బరికాయ కొట్టడం సర్వసాధారణం. ఇలవేల్పునకు మొక్కు చెల్లించుకునే ప్రధాన కార్యమిది. దీన్ని సైతం అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద భక్తుల నిలువు దోపిడీ మరింత పెరిగింది.

**అడ్డూ అదుపూ లేకుండా...:** సాధారణంగా బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే అధిక ధరలకు అమ్మేవారు. కొబ్బరికాయల విక్రయంలో ఇప్పుడు నిత్యం దోపిడీ సాగుతోంది. ఆలయ నిబంధనలను తుంగలో తొక్కి గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నియంత్రించాల్సిన ఆలయ వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. గుత్తేదారులు ఒక్కో టెంకాయను గతంలో ఎన్నడూలేని విధంగా అధిక ధరకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏడాది పొడవునా కేవలం రూ.30కి మించి విక్రయించరాదు. ఈ మేరకు బహిరంగ వేలం



రోజునే ఒప్పందంపై సంతకం చేశాకే, ఆలయం ఎదుట కొబ్బరికాయల అమ్మకానికి అనుమతి పత్రం అందిస్తారు.

**గుత్తేదారుల ఇష్టారాజ్యం**

నిబంధనలు మాత్రం పాటించడం లేదు. స్థానికంగా రూ.40కు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పట్నంవారం రోజైతే ఏకంగా రూ.100కు రెండు చొప్పున విక్రయించారు. ఒకటే అవసరమున్నా.. ప్రతి భక్తుడికీ రెండు కొబ్బరికాయలు అంటగట్టారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదు. వేలం ద్వారా రూ.లక్షలు చెల్లించి హక్కులు దక్కించుకున్నామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని భక్తులు వాపోతున్నారు. ఇలా ఏటా సుమారు 5 లక్షలకుపైగా కొబ్బరికాయలు అమ్ముడవుతాయి. వాస్తవానికి రెండేళ్ల కిందట ఒక్కో టెంకాయ కేవలం రూ.20కి మాత్రమే విక్రయించాలన్నది ఆలయ నిబంధన. గుత్తేదారు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని, నిబంధన సడలించి రూ.30కి అనుమతిచ్చారు. అధిక ధరను నియంత్రించాలన్న ఆలయ వర్గాల నిర్ణయాన్ని గుత్తేదారులు మరోలా అర్థం చేసుకున్నారు. నిర్భయంగా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. టెంకాయ ధరను ప్రచారం చేస్తూ బోర్డులు పెట్టడంతోపాటు మైక్‌లోనూ చెప్పాల్సిన అవసరముంది.

**నియంత్రణ చర్యలు తీసుకుంటాం...: కురుమ రామాంజనేయులు, ఈవో**

నిబంధన ప్రకారం ఒక్కో టెంకాయ కేవలం రూ.30కే విక్రయించాలి. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు. వాస్తవ ధరను ప్రచారం చేసి నియంత్రిస్తా. అవసరమైతే లైసెన్స్ రద్దు చేస్తాం.

# సొంతానికి సేవా రుసుములు

నెల్లూరు : సచివాలయాల్లో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సేవల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న నగదును 24 గంటల్లో ఖాతాకు జమ చేయాల్సి ఉండగా.. కొందరు సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మారలేదు. ఉద్యోగుల జీతం నుంచి రికవరీ చేసేందుకు నగరపాలకసంస్థ అధికారులు చర్యలు చేపట్టారు.

నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా.. 166 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో సుమారు 1200 మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో 2020 జనవరి 26వ తేదీ నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 543 సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించినా.. 15 లోపు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, సంక్షేమానికి సంబంధించినవే అధికం. ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా సేవలు పొందేందుకు చెల్లిస్తున్న నిర్దేశిత



రుసుంను సచివాలయ ఉద్యోగులు దారి మళ్లించారు. ప్రజల నుంచి నగదు రూపంలో వసూలు చేస్తున్నా.. కొందరు ఆ సొమ్ము సకాలంలో జీఎస్‌డబ్ల్యూఎస్ ఖాతాకు జమ చేయడం లేదు. అధికారుల పరిశీలనలో వెలుగు చూడగా.. కమిషనర్ సూర్యతేజ సమీక్షలు, టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదేశించినా.. ఉద్యోగులు పెడచెవిన పెట్టారు.

**డబ్బు జమ చేయకుండా..**

ప్రజలు చెల్లించిన నిర్దేశిత రుసుము జమచేయని సచివాలయ ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేయాలని అధికారులు నిర్ణయించారు. నగరంలోని 44 సచివాలయాల పరిధిలో రూ.5,74,686 రుసుం వసూలు వసూలు చేశారు. చలానాలు జనరేట్ చేసినా.. డబ్బు జమ చేయలేదు. వాస్తవంగా 24 గంటల్లో చెల్లించాల్సి ఉంది. అడిగే వారు లేరని వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారు. అత్యధికంగా అరుణాచలంవీధిలో సచివాలయం రూ.1,91,765, ఆనం వెంకటరెడ్డినగర్ రూ.1,13,040 చెల్లించాల్సి ఉంది. అధికారులు మొండి బకాయిలుగా పరిగణించారు.

**రూ.5,74,686 జమ కావాల్సి ఉంది : వైవో నందన్, అదనపు కమిషనర్**

వార్డు సచివాలయాల్లో ప్రజలు చెల్లించిన రుసుం వెంటనే ఖాతాకు జమ చేయాలి. వ్యక్తిగత అవసరాలకు వాడుకునేందుకు వీలులేదు. సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్‌లో అనేకసార్లు ఆదేశించాం. 21వ తేదీ నాటికి 44 సచివాలయాల ద్వారా రూ.5,74,686 జమ కావాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగుల జీతం నుంచి రికవరీ చేసేలా ఉత్తర్వులు జారీ చేశాం.

# లెక్కలేనితనం.. ధిక్కరణలే సాక్ష్యం

నెల్లూరు: ప్రతి వారం ఏదో ఒక కేసు విషయంలో న్యాయస్థానానికి హాజరుకావాల్సి వస్తోంది. సకాలంలో అఫిడవిట్ దాఖలు చేయడంలో మీకొచ్చిన ఇబ్బంది ఏమిటీ? పిటిషనర్ సమస్య తీర్చదగినదైతే.. చేసేయండి. లేదంటే నిబంధనల ప్రకారం ఎందుకు చేయలేమో కోర్టుకు చెప్పండి. దీనిపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. మీకు వంద పనులు ఉండొచ్చు. సకాలంలో కోర్టుకు కౌంటర్ దాఖలు చేయాల్సిందే. ఈ పని చేయడానికి నెలలకు నెలల సమయం ఎందుకు తీసుకుంటారో అర్థం కాదు. ఈ పరిస్థితి ఇకపై జిల్లాలో ఉండకూడదు.' జిల్లాలో భూ సంబంధిత సమస్యలు సృష్టించడంలో.. వాటిని సాగదీయడంలో.. కొందరు అధికారులు సిద్ధహస్తులు. ఏళ్లుగా సాగులో ఉన్న భూముల యజమానుల పేర్లు.. రికార్డుల్లో ఒక్కసారిగా మారిపోతాయి. ప్రభుత్వ భూములు వారసత్వంగా వచ్చినట్లు దస్త్రాల్లో నమోదవుతాయి. అంతేనా.. అసైన్డ్ భూముల పంపిణీ, పరిరక్షణ, ఆక్రమణల నిరోధం, ఇనాం, చుక్కల భూములు, ఇతర వ్యవహారాలకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. కొందరు అధికారులు అనుకున్నదే చేస్తారు. కాసులు పడందే దస్త్రాలు ముట్టరు. దీంతో మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల చుట్టూ తిరిగి అలసి.. విసిగి.. గత్యంతరం లేని పరిస్థితుల్లో కోర్టులను ఆశ్రయిస్తున్నవారే జిల్లాలో అధికం. పోనీ.. కోర్టు నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతైనా పనిచేస్తారా? అంటే అదీ లేదు. ఒక వేళ నిబంధనల ప్రకారం చేయదగ్గది కాకపోతే.. ఆ విషయం



న్యాయస్థానానికి చెప్పడంలోనూ తాత్సారమే. ఫలితంగా సదరు వ్యక్తులు కోర్టు ధిక్కరణకు వెళుతుండగా.. ఉన్నతాధికారులు కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీనిపై జేసీ కార్తీక్ మాట్లాడుతూ.. కోర్టు కేసులపై ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్నాం. అఫిడవిట్‌లు దాఖలు చేయాలని సూచిస్తున్నాం. దీంతో పాటు ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేశాం. కోర్టు ధిక్కరణకు వెళ్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు.

**ఒక్క నెల్లూరు డివిజన్‌లోనే..** జిల్లాలో భూ సంబంధిత వివాదాలు పరిష్కారం కాక దాదాపు 833 మంది కోర్టును ఆశ్రయించగా– వీటిలో నెల్లూరు డివిజన్‌లో 286, ఆత్మకూరులో 133, కావలి డివిజన్‌లో 163, కందుకూరులో 192 కేసులు ఉన్నాయి. నెల్లూరులో అత్యధికంగా 74 కేసులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. 58 కేసుల్లో కోర్టు ధిక్కరణ నోటీసులు అందగా.. వీటిలోనూ ఇంకా పదింటికి కౌంటర్ వేయాల్సి ఉంది. వీటినైనా పూర్తి చేయాలని కలెక్టర్, జేసీలు చెబుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పలు శాఖల్లో చాలా మందికి కనీసం కౌంటర్ వేయడం కూడా రాదు. గతంలో శిక్షణ ఇప్పించినా.. ఉపయోగం లేకుండా పోయిందని సంబంధిత అధికారులే చెబుతుండటం గమనార్హం.

# గుట్టుగా 'సామాజిక తనిఖీలు'



పాలకోడేరు : జిల్లాలో పాలకోడేరు, పాలకొల్లు మండలాల్లో వారం రోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీల తీరు విస్మయం కలిగిస్తోంది. అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని బూచిగా చూపి కనీసం షెడ్యూలు ప్రచురించకుండా, మైకు ప్రచారం, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులకు సమాచారం లేకుండా గుట్టుగా తనిఖీలు నిర్వహిస్తుండటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**మొక్కుబడి తంతుగా..** పాలకోడేరు మండలంలో 14 గ్రామాలు ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.6 కోట్ల విలువైన పనులు చేశారు. వీటిలో సుమారు రూ.4 కోట్లు వేతనాలుగా, రూ.2 కోట్లు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లో వైకాపాకు చెందిన సర్పంచులు ఉండటం, వారి వర్గీయులనే క్షేత్ర సహాయకులుగా నియమించుకొని నిధులు కొల్లగొట్టారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మోగల్లు గ్రామంలో క్షేత్ర సహాయకుడిపై వచ్చిన ఆరోపణలపై డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. విస్సాకోడేరు, పెన్నాడ, వేంద్ర, గొరగనమూడి, పాలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో తనిఖీలు పక్కాగా జరిగితే అక్రమాలు బయటపడతాయనే భావనతో గ్రామస్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మొక్కుబడి తంతుగా తనిఖీలు ముగించేస్తున్నట్లు కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు.

**ముందే సర్దుబాట్లు..** మండలంలో ఈ నెల 17న తనిఖీలు మొదలు కాగా శనివారంతో ముగిశాయి. కానీ తనిఖీల విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. అంతకు ముందే మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ పనులకు సంబంధించిన ఎం.బుక్‌లు, దస్త్రాలను క్షేత్ర సహాయకులతో హడావుడిగా నమోదు చేయించారు. తనిఖీల సమయంలోనూ ఇలాంటి సర్దుబాట్లే జరిగినట్లు కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. 'ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో గ్రామసభలు నిర్వహించడం లేదు. ప్రజావేదిక సభ ఈ నెల 24న కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో జరుగుతుంది. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించిన అనంతరం అభ్యంతరాలను నమోదు చేస్తాం' అని సామాజిక తనిఖీ విభాగం ఎస్ఆర్‌పీ ఎం.గోవింద తెలిపారు.

# వెంటిలేటర్ల ప్రాణాలు తీశారు!



భీమవరం : ప్రాణాపాయ స్థితిలో ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన వెంటిలేటర్లు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొవిడ్ సమయంలో రూ.కోట్లు వెచ్చించి వెంటిలేటర్లు కొనుగోలు చేశారు. గత వైకాపా పాలకులు అధునాతన పరికరాలను అందుబాటులోకి తేవాలన్న కనీస ఆలోచన చేయలేదు. ఫలితంగా ప్రభుత్వాసుపత్రుల్లో యంత్ర సామగ్రి నిరుపయోగంగా మూలకు చేరాయి. కూటమి ప్రభుత్వ హయాంలో వినియోగంలోకి తీసుకొస్తే ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరవయ్యే అవకాశముందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ప్రాంతీయాసుపత్రికి ఏడేసి.. జిల్లాలోని ఒక్కో ప్రాంతీయాసుపత్రికి రూ.35 లక్షలు విలువైన 7 వెంటిలేటర్లు కేటాయించారు. వీటి అమరికకు గదులు, పడకలు సిద్ధం చేశారు. అయితే చిన్నపాటి సాంకేతిక ఇబ్బందులున్న సాకుతో వాటిని పక్కన పెట్టేశారు. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రుల్లో వీటిని ఉపయోగించాలంటే సాంకేతికంగా శిక్షణ పొందిన నిపుణులు ఉండాలి. జనరల్ మెడిసిన్, ఇతరత్రా వ్యాధులకు చికిత్సలు అందించే వైద్యులు, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కొవిడ్ రెండో దశ ఉద్ధృతి సమయంలో పాలకొల్లుకు చెందిన ఓ వ్యక్తికి వెంటిలేటర్ వైద్యం అవసరమైంది. భీమవరం లేకపోవడంతో ఏలూరు తీసుకెళ్లారు. అక్కడా పడల్లేకపోవడంతో.. అక్కణ్నుంచి గుంటూరుకు తరలించేలోపు మృతి చెందారు. భీమవరానికి చెందిన ఓ మహిళకు ఇటీవల అత్యవసరంగా వెంటిలేటర్ అవసరమైంది. భీమవరం ప్రాంతీయాసుపత్రికి తరలిస్తే.. ఏలూరు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అత్యవసర వాహనంలో తరలిస్తుండగా.. మార్గం మధ్యలో ఆమె ప్రాణాలు విడిచారు.

వినియోగంలోకి తీసుకొస్తాం ప్రభుత్వ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో అనుభవజ్ఞులైన సిబ్బంది, మత్తు వైద్యులు లేకపోవడంతో వెంటిలేటర్లు వాడలేకపోతున్నాం. పని చేయని వెంటిలేటర్ల విషయాన్ని ఏజెన్సీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా వెంటిలేటర్లను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. పి.సూర్యనారాయణ, ప్రాంతీయాసుపత్రుల పర్యవేక్షణాధికారి, భీమవరం

# ఆనవాళ్లు లేని మార్కెట్టు యార్డులు



పెనుగొండ : అన్నదాతకు ఎంతో దగ్గరైన వ్యవసాయ మార్కెట్ యార్డులను అయిదేళ్ల వైకాపా పాలనలో దూరం చేసింది. పుంత రోడ్ల అభివృద్ధి, రైతుబంధు పథకాలు, ఉచిత పశువైద్య శిబిరాలు, ధరలు లేనప్పుడు ధాన్యం నిల్వ పెట్టుకునే సదుపాయాలు గతంలో తెదేపా ప్రభుత్వం కల్పించింది. కానీ గత అయిదేళ్లు ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా అన్నట్టుగా వీటి పరిస్థితి ఉంది.

రైతులకు నిరాశ.. మార్కెట్ శాఖ నిధులతో గతంలో ప్రతి నియోజకవర్గంలో పుంత రోడ్లు నిర్మించారు. ఆచంటతో పాటు అన్ని నియోజకవర్గాల్లో 30 నుంచి 50 పుంత రోడ్లు అభివృద్ధి చేశారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన పంటను ఒడ్డుకు చేర్చుకోవడానికి సరైన దారులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీగా గోదాములు జిల్లాలో 60 వేలకు పైగా సామర్థ్యం ఉన్న 64 గోదాములు అందుబాటులో ఉన్నా.. అవి రైతులకు ఉపయోగపడకుండా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆచంట వంటి పలు చోట్ల కొన్ని గోదాముల పైకప్పులు దెబ్బతిన్నాయి. గోడలు బీటలు తీశాయి. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.39 కోట్లకు పైగా ఏఎంసీలు ఆదాయం పొందాయి. అయినా వాటి అభివృద్ధికి పైసా కూడా ఖర్చు చేయలేదని రైతులు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏఎంసీలకు పూర్వవైభవం తీసుకుని రావాలని కోరుతున్నారు.

పైసా ఖర్చు చేయక.. వైకాపా ప్రభుత్వంలో ఏఎంసీల ద్వారా రైతుల ప్రయోజనాలకు పైసా ఖర్చు చేయకపోవడంతో పాలకవర్గాలకు ప్రాధాన్యత లేకుండా పోయింది. అన్ని యార్డుల్లో సిబ్బంది కొరత ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. తెదేపా అధికారంలో ఉండగా భీమవరం రూ.1.50 లక్షలు, ఆచంట వంటి చోట్ల రూ.55 లక్షలు, ఏఎంసీ నిధులతో పాటు నియోజకవర్గానికి రూ.20 నుంచి రూ.50 లక్షలు ఉపాధి నిధులు కేటాయించింది. వైకాపా పాలక వర్గాలు వచ్చిన తరువాత పనులు నిలిచిపోయాయి. ఏఎంసీలపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

# కార్మిక బీమా.. కొండంత ధీమా..!

శ్రీకాకుళం : కార్మిక రాజ్య బీమా.. వ్యవస్థీకృత రంగంలో పని చేసేవారికి అండగా నిలిచే పథకం ఇది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయోజనాలు అందిస్తున్నాయి. అవగాహన లేక చాలా మంది వాటిని పొందలేకపోతున్నారు. రేపు కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐసీ) దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పరిస్థితిపై ప్రత్యేక కథనం..

రణస్థలం మండలంలోని పైడి భీమవరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ, శ్రీకాకుళం నగరంలో శాఖా కార్యాలయం ఉన్నాయి. జిల్లాలో సుమారు 30 వేల మంది కార్మికులు ఉండగా.. పైడిభీమవరం డిస్పెన్సరీ పరిధిలో 23 వేల మంది వరకు నమోదయ్యారు. ఇక్కడ పూర్తిస్థాయి భవనం సమకూరినప్పటికీ డిస్పెన్సరీలో రెగ్యులరు వైద్యుడు లేరు. పది పడకలతో కూడిన డయాగ్నోస్టిక్ సెంటరు, ఐదుగురు వైద్యులను నియమిస్తామని ఆసుపత్రి ఏర్పాటు సమయంలో జీవోలో పేర్కొన్నా జరగలేదు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా గరివిడి డిస్పెన్సరీ వైద్యుడు రెండు రోజులకోసారి ఇక్కడికి వస్తున్నారు. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నప్పటికీ రోగ నిర్ధారణ పరీక్షలు చేసే పరికరాల్లేవు. జిల్లాలో లోకల్ ఆఫీసు సౌకర్యం లేకపోవడంతో సెలవు పెట్టిన రోజులకు వేతనం పొందాలంటే విజయనగరం వెళ్లాల్సి వస్తోంది. కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ నిర్వహణలో ప్రమాదాలకు గురైనప్పుడు, ఇతర పరిస్థితుల్లో వైద్య సౌకర్యం కల్పిస్తారు.

ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకూ వైద్య సేవలు, రోగనిర్ధారణ పరీక్షలు ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా అందిస్తారు.

పని చేయలేని పరిస్థితుల్లోనూ వైద్యుని ధ్రువీకరణపై ఆర్థిక సాయం పొందొచ్చు. కార్మికుడు విధి నిర్వహణలో ఉన్నప్పుడు, ఉద్యోగానికి వెళ్తున్నప్పుడు ప్రమాదం జరిగి మృతి చెందితే వారిపై ఆధారపడిన వారికి నెలవారీ పింఛను రూపంలో ఇస్తారు.



స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన బీమాదారులు వారి జీవిత భాగస్వామికి ఏడాదికి రూ.120 ముందుగా చెల్లిస్తే ఆయన మరణించినా ఆమె వైద్య సేవలు పొందే వీలుంటుంది. ప్రసవం, కొన్ని శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి నిర్దేశిత రోజులకు వేతనం చెల్లిస్తారు. ఏదైనా సంస్థ, పరిశ్రమలో కనీసం పది మంది కార్మికులు ఉండి.. వారిలో రూ.21 వేలు కంటే తక్కువ జీతం ఉన్నవారంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారి పేరున ఆయా సంస్థలు ఇచ్చే వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతం, కార్మికుడి వాటాగా 0.75 శాతం ఈఎస్ఐకి జమ చేయాలి. దీని ద్వారా కార్మికులు అనారోగ్యం పాలైనా, ఇతర ఏ సమస్య వచ్చినా ఈఎస్ఐసీ ద్వారా లబ్ధి పొందవచ్చు.

**ఆయా సంస్థలపై చర్యలు తప్పవు..**

అర్హులైన కార్మికులను ఆయా సంస్థలు ఈఎస్ఐ పరిధిలోకి చేర్చాలి. లేకుంటే చర్యలు తప్పవు. అర్హులందరి వివరాలు శ్రమ సువిధ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవగాహన లేనివారు శ్రీకాకుళం నగరంలో బలగలోని ఈఎస్ఐ శాఖ కార్యాలయాన్ని సంప్రదించొచ్చు. – ప్రజ్ఞ, ఈఎస్ఐ కార్యాలయం బ్రాంచి మేనేజరు,

# అడుగంటిన గొట్టా..!

శ్రీకాకుళం : వంశధార ఆయకట్టు పరిధిలో రబీ సాగు చేస్తున్న రైతన్నలకు నీటికష్టాలు తప్పలేదు. క్యాచ్‌మెంట్ ఏరియా ఒడిశాలో గతేడాది అక్టోబరు నుంచి వర్షపాతం నమోదు కాకపోవడం తో గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఫలితంగా కుడి, ఎడమప్రధాన కాలువలకు సాగు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది.

**ఎడమ కాలువకు అరకొర..**


బ్యారేజీ వద్ద కనీస నీటిమట్టం 36 మీటర్లుంటేనే కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బెడ్ లెవెల్ 35 మీటర్ల నీటి మట్టం మాత్రమే నీరుంది. ఈ నిల్వతో ఎడమ ప్రధాన కాలువకు కేవలం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగలుగుతున్నారు. నీటి ప్రవాహం జలుమూరు మండలం వరకు మాత్రమే చేరుతోంది.

**డెడ్ స్టోరేజీ..**

వంశధార జలాశయంలో డెడ్ స్టోరేజీ (2 టిఎంసీలు) నిల్వ ఉంది. కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టేందుకు అవసరమైనంత నీరు లేకపోయినప్పటికి ఇటీవల ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు రవీంద్ర, రైతుల వినతి మేరకు జలాశయ గర్భంలో పొక్లెయినర్‌తో కాలువ తవ్వి లింకు కాలువ ద్వారా కుడి కాలువలకు నీరు విడిచిపెట్టారు. నీటి మట్టం తగ్గడంతో ఈ సరఫరా నిలిచిపోయింది.

**వర్షాభావంతో ఇక్కట్లు**

సాధారణంగా 300 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటేనే కాలువలకు నీరు విడిచిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ వద్ద 130



క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లోను సరైన వర్షాలు లేకపోవడంతో వరద కాలువ ద్వారా జలాశయంలోకి నీటిని నింపలేకపోయారు. దీంతో ఇప్పుడు సమస్య నెలకొంది.

**జలాశయపనులు పూర్తయితేనే పరిష్కారం**

జిల్లాలో సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం వంశధార జలాశయంతోనే సాధ్యం. 17 ఏళ్ల వ్యవధిలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన బిల్లులు మంజూరైతే గుత్తేదారు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వచ్చే ఖరీఫ్ నాటికి జలాశయంలో 19 టీఎంసీల నీటి నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతుంది. తద్వారా జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఇన్‌ఫ్లో తగ్గడంతో సమస్య.. నది క్యాచ్‌మెంట్ ప్రాంతం ఒడిశాలో వర్షాల్లేకనే సమస్య నెలకొంది. రబీలో అనధికారికంగా నీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ సరిపడేంత లేకనే ఈ పరిస్థితి. ఉన్న నీటిని రైతులు పొదుపుగా ఉపయోగించు కోవాలి. ఎత్తిపోతల పథక పనులు 36 శాతం జరిగాయి. వీటితో జలాశయం పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు నీరందిస్తాం. – తిరుపతిరావు, వంశధార ఎస్ఈ, శ్రీకాకుళం

చురకలు

బుధవారం 26 ఫిబ్రవరి 2025

# దస్త్రం తొక్కిపెట్టి.. టీడీఆర్‌లు కట్టబెట్టి

విశాఖపట్నం: ఓ కీలక దస్త్రాన్ని అధికారుల కమిటీ తొక్కిపెట్టింది. గత ప్రభుత్వంలో వైకాపా నేతల ఒత్తిళ్లతో నివేదికల్లో ఎక్కడా ఆ దస్త్రం గురించి ప్రస్తావించలేదు. సుమారు రూ.200 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు అనుకున్నవారికి కట్టబెట్టేశారు. స్థల యజమానికి ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వడం, మళ్లీ అదే స్థలంలో ఆక్రమణదారులకు నాలుగు రెట్లు టీడీఆర్‌లు ఇవ్వడం ప్రస్తుతం కలకలం రేపుతోంది.గోశాల నుంచి అడవివరం వరకు సింహాచలం బీఆర్టీఎస్ రహదారి విస్తరణ గతంలో చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సింహాచలం దేవస్థానం భూములు కొంత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 2012లో దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా సర్వే నెంబరు 26లో 7 ఎకరాల భూమిని ముడసర్లోవలో కేటాయించింది. దాని విలువ ఇప్పుడు రూ.500కోట్ల వరకు ఉంటుంది. స్థలానికి స్థలం ప్రత్యామ్నాయంగా ఇచ్చినా మళ్లీ అక్కడున్న ఆక్రమణదారులకు కొన్ని నెలల క్రితం టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. 2.72 ఎకరాల భూమికి సంబంధించి 210పైగా బాండ్లు మంజూరు చేశారు. వాటి విలువ సుమారు రూ.200కోట్లు పైమాటే. గజం రూ.35వేల చొప్పున దానికి



నాలుగు రెట్లుగా గజానికి రూ.1.40లక్షల బాండ్లు ఇచ్చారు. టీడీఆర్‌లు అందుకున్న వారిలో కొందరు వైకాపా నాయకులున్నారు.

**అనుకూలంగా రాసిచ్చేశారు..**

టీడీఆర్‌ల మంజూరుపై తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్, జీవీఎంసీ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, సీసీపీ అధికారులతో పరిశీలన కమిటీ వేశారు. గతంలో దేవస్థానానికి జీవీఎంసీ స్థలం ఇచ్చిందని ఎక్కడా పొందుపర్చకుండా, పరిశీలన కమిటీ టీడీఆర్‌లు మంజూరు చేయడానికి అనుకూలంగా నివేదిక ఇచ్చిందనే విమర్శలున్నాయి. వాస్తవానికి దేవస్థానానికి భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తూ, ఆక్రమణదారులకు కూడా టీడీఆర్‌లు ఇస్తున్నామని నివేదికలో రాయాలి. అలా రాయకపోగా, రిజిస్టర్ గిఫ్ట్‌డీడ్ ద్వారా టీడీఆర్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, నోటరైజ్డ్ అఫిడవిట్ మీద టీడీఆర్‌లు ఇచ్చేయొచ్చని ఉచిత సలహా ఇచ్చారు.

**తాజా నివేదికల్లోనూ ఆ దస్త్రం లేదు..**

బీఆర్టీఎస్ విస్తరణలో ఇప్పటికే 210 టీడీఆర్ పత్రాలు ఇచ్చారు. అయితే పలు ఆరోపణల నేపథ్యంలో వాటిని వినియోగించకుండా హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆ టీడీఆర్‌ల వినియోగానికి అవకాశం కల్పించాలంటూ కొందరు పావులు కదిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దీనిపై తాజాగా నివేదిక కోరగా, జీవీఎంసీ అధికారులు ఆగమేఘాలపై జిల్లా కలెక్టర్‌కు దస్త్రం పంపారు. అందులోనూ దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమికి సంబంధించి దస్త్రం చూపకపోవడం గమనార్హం. పాత టీడీఆర్‌లు విడుదల చేయడంతోపాటు... కొత్తగా మరో 186 టీడీఆర్‌లు ఇవ్వాలంటూ కొందరు నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

# తాగినా.. తాకినా రోగాలే

నంద్యాల : ఉమ్మడి జిల్లా ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర, హంద్రీ, కృష్ణా, కుందూనదులు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. నీటిలో కోలిఫాం బ్యాక్టీరియా అసలు ఉండకూడదు. కర్నూలు మండలం పంచలింగాల, తాండ్రపా డు, మామిదాలపాడు, జొహరాపురం తదితర ప్రాంతాల్లో తుంగభద్ర నీటిలో ఈ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. కోలిఫా 50 సీఎఫ్‌యూ దాటితో కచ్చితంగా ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. డయేరియా తదితర వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నీళ్లతో నేరుగా స్నానం చేసినా చర్మవ్యాధుల బారినపడాల్సి ఉంటుంది.

**జలచరాల ఉక్కిరిబిక్కిరి**

జలచరాలు మనుగడ సాగించాలంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో) తగు మోతాదులో ఉండాలి. లీటరు నీటిలో కనీసం 4 మిల్లీగ్రాములు.. అంతకన్నా ఎక్కువ ఉండాలి. అంతకంటే తక్కువుంటే జలచరాల ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. కుందూనది పొడవునా డీవో తక్కువగా ఉంది. నంద్యాల పట్టణ శివార్లలోని ఉడుమాల్పురం నుంచి పాణ్యం మండలం తొగర్చేడు, మద్దూరు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, గోస్పాడు తదితర మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో నీటిలో ఆక్సిజన్



3.5 మిల్లీగ్రాముల వరకే ఉంటోందని పరీక్షల్లో వెల్లడైంది.

**నదుల్లోకి నేరుగా మురుగు**

తుంగభద్ర నదిపై 11 సీపీడబ్ల్యూ పథకాలు నడుస్తున్నాయి. 133 గ్రామాల పరిధిలోని సుమారు 3 లక్షల మందికి ఈ నీళ్లే ఆధారం. కర్నూలు నగరం నుంచి రోజూ విడుదలవుతున్న 60 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా నదిలో కలుస్తోంది. సాధారణంగా మురుగునీటిలో కోలిఫాం 100 మి.లీకు సగటున 600 సీఎఫ్‌యూ ఉండాలి. తుంగలో ఇది 1100- 1200 సీఎఫ్‌యూ దాటుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది.

నంద్యాల పురపాలక సంఘంలో రోజూ 30 ఎంఎల్‌డీ మురుగునీరు నేరుగా కుందూనదిలోకే వదలుతున్నారు. ఈ మురుగులో కోలిఫాం 1000 సీఎఫ్‌యూ వరకు ఉంది.

ఉమ్మడి జిల్లాలో 306 కి.మీలు ప్రవహించే కేసీ కాల్వ మురుగు కూపంగా మారింది. పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు వదులుతున్నారు. నంద్యాల పట్టణ శివార్లలోని విత్తన శుద్ధి కేంద్రాల వారు వ్యర్థ జలాలను కేసీలోకి కలుపుతున్నారు.

**టర్బిడిటీతో సమస్యలు** నీటిలో 1- 4 పాయింట్ల వరకు టర్బిడిటీ ఉండాలి. పరిమితి దాటితే మట్టితో సహా ఇతర కణాలు దెబ్బతింటాయి. పశ్చిమ ప్రాంతంలోని గోనెగండ్ల, మంత్రాలయం, కౌతాళం ప్రాంతాలతో పాటు తూర్పు ప్రాంతలోని ఆత్మకూరు, కొలిమిగుండ్ల మండలాల్లో అర్బిడిటీ అధికంగా ఉంది. ఈ నీటిని పంటలకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాంతాల్లో మొక్కలకు సరిగ్గా ఆక్సిజన్ అందడం లేదని గతంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# కుట్టు శిక్షణకు పూర్వ వైభవం వచ్చేనా?



రాయదుర్గం : రాయదుర్గం ప్రాంతంలో గార్మెంట్ పరిశ్రమను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేశారు. ఏడాదికే రూ.కోటి వ్యయంతో అధునాతన యంత్రాలు ఏర్పాటు చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ గ్రామీణ ప్రాంతాల మహిళలకు శిక్షణ ఇచ్చేవారు. వారికి భోజన వసతితోపాటు ఆటో ఛార్జీలు చెల్లించడంతో అప్పట్లో ఎక్కువ మంది గార్మెంట్ పని నేర్చుకున్నారు. శిక్షణ పొందిన మహిళలు ప్రస్తుతం పలు గార్మెంట్ దుకాణాల్లో పనులు చేస్తున్నారు. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రం మూతపడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఐదేళ్లలో కేవలం 30 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

**యంత్రాలకు తుప్పు** ఐదేళ్లపాటు ఈ కేంద్రాన్ని తెరవకపోవడంతో కుట్టు యంత్రాలు తుప్పు పట్టాయి. దుమ్ము ధూళితో ఇతర పరికరాలన్నీ పనికి రాకుండా పోయాయి. గత ఎన్నికలకు ముందు నెల రోజులు కేంద్రాన్ని తెరిచినప్పటికీ సత్ఫలితాలు ఇవ్వలేదు. ఒక బ్యాచ్‌కు చెందిన 30 మంది మహిళలు శిక్షణ పొందారు. వారికి కూడా పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వకపోవడంతో చాలా మంది మహిళలు నిరాశతో వెనుదిరిగారు. కేంద్రం మూత పడటంతో మున్సిపాలిటీలో పోగుపడిన చెత్తను ఇక్కడి ఆవరణలో పడేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని తెరిపించి, శిక్షణ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

సీఎఫ్‌సీ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల రాయదుర్గంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించాం. అనుమతులు రాగానే కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి స్థానిక మహిళలకు శిక్షణ ఇస్తాం. గోవిందప్ప, ఇన్‌ఛార్జి ఏసీ

# గడువు నిబంధన లేక.. వసూళ్లు ఆగక!




రాయదుర్గం : ఇంటి స్థలం, వ్యవసాయ భూమి, ఇల్లు, అపార్ట్‌మెంటు ఇలా ఏ స్థిరాస్తినైనా కొనుగోలు చేయాలంటే తొలుత ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), నకలు దస్తావేజులు అవసరం. వీటిని అంతర్జాలం ద్వారా కొంతరుసుం చెల్లిస్తే పొందవచ్చు. అధికారుల డిజిటల్ సంతకంతో కూడిన ఈసీలు, నకలు దస్తావేజులు పొందాలంటే కొంత ఎక్కువగా చెల్లించాలి. ప్రభుత్వ రుసుం చెల్లించినా కొన్ని కార్యాలయాల్లో అమ్యామ్యాలు సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక ఆస్తిపై ఎపుడెపుడు లావాదేవీలు జరిగాయో తెలుసుకోవడానికి ఈసీలు ఉపయోగపడుతాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుసుం చెల్లించినా ఇంకా జారీ కాని ఈసీల సంఖ్య 600లకు పైగా ఉంటుందని అధికారుల అంచనా. ఒక ఈసీకి (13 ఏళ్ల కాలానికి) రూ. 300, 13 ఏళ్లపైన రూ.600 (యూజర్ ఛార్జీలతో కలిపి) చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత నిర్దిష్ట గడువులోగా జారీ చేయాలన్న నిబంధన ఏదీ లేదు.ఈసీ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లితే ఎంతో కొంత ముట్టజెప్పనిదే జారీ చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలోని అధికశాతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే తంతు కొనసాగుతోంది. నకలు దస్తావేజులు అంతర్జాలం ద్వారా పొందితే రూ.450, అదే సబ్ రిజిస్ట్రార్ డిజిటల్ సంతకంతో కూడినవి కావాలంటే రూ.650 ప్రభుత్వ రుసుం చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత వెంటనే కావాలంటే ఆలస్యం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో అదనంగా రూ.100 నుంచి 500 వరకు ఇస్తేనే నకలు దస్తావేజులు జారీ చేస్తున్నారు. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రోజుకు 30 నుంచి 60 వరకు ఈసీలు, నకలు దస్తావేజులు జారీ అవుతుంటాయి. **రూ.1,200 చెల్లించా..** అనంతపురం గ్రామీణంలోని ఒక స్థలానికి మాన్యువల్ ఈసీ కోరా. నిబంధనల ప్రకారం రూ.600 తీసుకోవాలి. సిబ్బంది రూ.1200 తీసుకున్నారు. సగానికి పైగా డబ్బు తీసుకున్నా మాన్యువల్ ఈసీ ఇవ్వడానికి రెండు నెలల సమయం పట్టింది. ఈసీ ఇవ్వడానికి గడువు నిర్దేశించాలి. నారాయణపురం వాసి వసూళ్లు రుజువైతే కఠిన చర్యలు - విజయలక్ష్మి, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఈసీలు, నకలు దస్తావేజులకు సంబంధించి అధికంగా వసూలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలి.

# ఆమె ఆరోగ్యానికి భరోసా

ఉరవకొండ : గర్భిణుల్లో ప్రధానంగా కనిపించేది పౌష్టికాహార లోపం, రక్తహీనత. వాటి కారణంగా మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయి. ఇలాంటి మరణాలను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏఐ సాంకేతికతతో జననిమిత్ర యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా గర్భిణులు తాము భుజించే ఆహారంలో పౌష్టికత, రక్తం(హిమోగ్లోబిన్) ఎంత ఉందన్న వివరాలను వారే సులభంగా తెలుసుకోవచ్చు. అనంతపురం జిల్లా కూడేరు మండలంలో ప్రయోగాత్మకంగా యాప్‌ను అమలు చేస్తున్నారు. దీని వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రయోగాత్మకంగా కూడేరు మండలంలో అమలు**

జనని మిత్ర యాప్‌ను కూడేరు పీహెచ్‌సీ పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇక్కడ 280 మంది వరకు గర్భిణులు ఉన్నారు. వారిలో 20 మంది వరకు తీవ్ర, మరో 10 మంది వరకు మధ్యరకం రక్తహీనత కలిగి ఉన్నట్లు అంచనా. కూడేరుతోపాటు పామిడి పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనత కలిగిన గర్భిణులు అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముందుగా స్వస్తి సంస్థతో కలిపి కూడేరులో అమలు చేస్తున్నారు. క్రమంగా పామిడిలో అమలు చేసేలా జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని అధికారులు చర్యలు చేపట్టారు.

**వినియోగం ఇలా..**

సెల్‌ఫోన్‌లో గర్భిణీ ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరు ద్వారా గూగుల్‌లో జననిమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

గర్భిణీకి కేటాయించిన ఆర్‌సీహెచ్ ఐడీ ఆధారంగా ఆమె వ్యక్తిగత వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత నాలుగు అంశాలు ఓపెన్ అవుతాయి.

1. మై హెల్త్ వస్తుంది. అందులో గర్భిణీకి రక్తపోటు, మధుమేహం, ఇతర జబ్బులు ఉన్నాయా? అనే వివరాలు నమోదు చేయాలి. ఆతర్వాత రక్తహీనతను గుర్తించడానికి కింద కనురెప్ప, నాలుక, చేతి గోళ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. వెంటనే రక్తం(హిమోగ్లోబిన్) శాతం వివరాలు తెలుస్తాయి. అది సాధారణంగా ఉందా? మధ్యరకమా? రక్తహీనత తీవ్రంగా ఉందా? అనే వివరాలు వస్తాయి.
2. ఎలాంటి ఆహారం తీసుకోవాలనే వివరాలు చూసుకోవచ్చు.
3. ఆశ కార్యకర్త గర్భిణి ఇంటి సందర్శన వివరాలు నమోదు చేయాలి.
4. గర్భిణి తినే ఆహారం ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దాని ఆధారంగా ఆమె తినే భోజనంలో పౌష్టికత(క్యాలరీస్ రూపంలో) ఎంత ఉందో యాప్ తెలియజేస్తూ అది సరిపోతుందా? మరింత తీసుకోవాలా? అనేది సూచిస్తుంది.

ఆ తరువాత గర్భిణీకి ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే ఎస్‌వోఎస్‌ను టచ్ చేస్తే ఆశ, ఏఎన్ఎం, సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్‌కు సమాచారం వెళ్తుంది. వారు గర్భిణీ వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం

జనని మిత్ర యాప్‌పై స్వస్తి సంస్థ ప్రతినిధులతో కలిసి గర్భిణులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. యాప్‌ను వినియోగించుకునేలా చూస్తున్నాం. దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం. యాప్‌లో కొన్ని సాంకేతిక అంశాలను అధికారులు మెరుగు పరుస్తున్నారు.

# భక్తజన పరవశం.. శ్రీగిరి మార్గం

ఆత్మకూరు : ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నల్లమల చిరునామాగా నిలిచింది. శ్రీగిరికోన శివనామస్మరణతో మార్మోగుతోంది. శివరాత్రికి మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు నల్లమలలోని పలు ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇక్కడి విశేషాలను తెలుసుకొని ఆనందానుభూతిని పొందుతున్నారు. అరణ్యమార్గంలో 40 కి.మీ: శ్రీశైలానికి కాలిబాటన దర్శించుకోవాలనుకునే వారు తొలుత ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామం నుంచి అరణ్యమార్గంలో 40 కి.మీ.లు ప్రయాణించాలి. వెంకటాపురం నుంచి 6 కి.మీ.లు వెళ్తే గోసాయికట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. అక్కడ నుంచి నాగలూటి క్షేత్రానికి 9, దామర్లకుంటకు 8, పెచ్చెర్వుకు 2, మఠంబావికి 6, భీమునికొలనుకు 3, కైలాసద్వారానికి 2, అక్కడ నుంచి 4 కి.మీ.లు నడిస్తే శ్రీశైల మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు. ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి నడకబాటను ప్రారంభించాలి.బ్రిటిష్ కాలం నాటి గ్రామం పెచ్చెర్వు: దామర్లకుంట తర్వాత పెచ్చెర్వు గూడేన్ని సందర్శించొచ్చు. అప్పటి బ్రిటిష్ దొరలు సరకుల రవాణా కోసం ఈ గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఆసుపత్రి శిలాఫలకం, బ్రిటిష్ దొరల కార్యాలయాలు, శిథిల భవనాలు,



పురాతన బావిని చూడొచ్చు.

వీరభద్రుని తాపలు: పెచ్చెర్వు నుంచి కొంత దూరం వెళ్లగానే వీరభద్రుని తాపలు వస్తాయి. ఇక్కడ కొలువైన వీర భద్రుడిని పూజించి మెట్ల మార్గంలో నడిచి వెళ్తారు.

కోర్కెల కొండ: పెచ్చెర్వు నుంచి భీముని కొలనుకు వెళ్లే మార్గంలో మెట్లమార్గంలో కోర్కెల కొండ ఉంటుంది. సంతానం, సొంత ఇళ్లు కావాలనుకునేవారు ముడుపులు కడతారు.

మఠం బావి: బిటిష్‌ల కాలంలో బావిని కట్టించారు. ఈ దారిన వెళ్లే వారు ఈ బావి నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు.

గోసాయికట్ట ఆంజనేయ స్వామిగుడి: వెంకటాపురం తర్వాత గోసాయి కట్ట ఆంజనేయస్వామి గుడి వస్తుంది. శాలిబాయి అనే మహిళ ఆవులను ఇక్కడ మేపుతుండటం, అందరూ ఆమెను గోసాయమ్మగా పిలవడంతో ఈ ప్రాంతానికి గోసాయికట్టగా పేరొచ్చింది. అప్పట్లో రాజులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, భక్తులు గుడిని కట్టించడంతో అందరూ ఇక్కడ పూజలు చేస్తున్నారు.

నాగలూటి వీరభద్రాలయం: గోసాయి కట్ట తర్వాత నల్లమలలో శ్రీశైల ముఖద్వారంగా పేరుగాంచిన నాగలూటి వీరభద్రాలయాన్ని భక్తులు సందర్శిస్తారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా వెళ్లేలా చూడాలని ఇక్కడి వీరభద్రుడిని మొక్కుతారు. 15వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించారని కొందరు చెబుతుంటే...తాబేలు, పాము, బల్లి వంటి చిత్రాలను బట్టి చాళుక్య రాజులు ఆలయాన్ని నిర్మించారని ఇంకొందరు చెబుతున్నారు.

దామర్ల కుంట: వీరభద్రస్వామిని దర్శించుకున్నాక తర్వాత దామర్లకుంట వస్తుంది. అడవి జంతువులు సంచరించే ప్రాంతమిది. ఇక్కడ నీటి కుంట వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తుంది. సహజసిద్ధమైన ఉప్పు నీటి వనరులు ఇక్కడ ఉన్నాయి. జంతువుల ప్రశాంతతకు భంగం కలగకుండా పాదయాత్ర చేయాలి.


భీముని కొలను: పెచ్చెర్వు నుంచి పాదచారులు భీముని కొలను మీదుగా ప్రయాణించాలి. సముద్రమట్టానికి ఈ ప్రాంతం 585 మీటర్ల ఎత్తున ఉంటుంది. భీమునికొలను నుంచి 60 మెట్లు పైకెక్కితే కైలాసద్వారానికి చేరుకోవచ్చు.

కైలాస ద్వారం: కైలాస ద్వారంలో భక్తులు కైలాసవాసుడ్ని స్మరించుకుంటూ ముందుకు సాగి శ్రీశైల మల్లికార్జున, అమ్మవార్లను దర్శించుకుంటారు.

శిఖర దర్శనం: శిఖర క్షేత్రంలోని నందీశ్వరుని కొమ్ముల మధ్య నుంచి శ్రీశైలక్షేత్రం ప్రధాన గర్భాలయంలోని మల్లికార్జునుడ్ని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం.

# పేదోళ్లు ఎందరున్నారు

కర్నూలు : విద్యుత్తు సౌకర్యం లేని కుటుంబాలెన్ని ? కట్టెల పొయ్యిపైనే ఎంత మంది వంట చేసుకొంటున్నారు ? పక్కా గృహం లేనివారెందరు ? బ్యాంకు సేవలకు ఎంత మంది దూరంగా ఉన్నారు.. తదితర వివరాలు సచివాలయ సిబ్బంది సేకరించి యాప్‌లో పొందు పరుస్తున్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా కూటమి ప్రభుత్వం పీ4 సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఈ ప్రక్రియనే పీ4. పూర్తిగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు ఆర్థిక స్థితిమంతులు, ఎన్‌ఆర్‌ఐలు సాయం చేస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి క్లస్టర్‌లో సర్వే నిర్వహిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13,31,113 కుటుంబాలు



న్నాయి. 12,14,379 కుటుంబాలు రేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. అందులో దారిద్ర్యరేఖకు దిగువనున్న 80 శాతానికి పైగా కుటుంబాల (9,97,724) ఆర్థిక పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.

కర్నూలు జిల్లాలో 672 సచివాలయాల పరిధిలో 10,442 క్లస్టర్లు ఉండగా.. ఒక్కో క్లస్టర్‌కు 20 నుంచి 40 కుటుంబాలకు పైగా సర్వే పరిధిలోకి వస్తున్నాయి.

నంద్యాలలో 516 సచివాలయాల్లో 9,249 క్లస్టర్లుండగా.. ఒక్కో క్లస్టర్‌కు సుమారు 20-35 కుటుంబాల వరకు సర్వే పరిధిలోకి వస్తున్నాయి. ఒక్కో సచివాలయ ఉద్యోగి రెండు నుంచి మూడు క్లస్టర్ల పరిధిలోని కుటుంబాలను సర్వే చేస్తున్నారు.

# పప్పుల్లో... నాణ్యత లోపం

విశాఖపట్నం: సింహాచలం లడ్డూ ప్రసాదంలో వినియోగించే పప్పుల్లో కొంత నాణ్యత లోపమున్నట్లు ఆహార భద్రతాధికారుల పరీక్షల్లో ప్రాథమికంగా తేలింది. ఎక్కువ కాలం నిల్వ ఉంచిన వాటిని వినియోగించడం వల్ల ఆ తేడా కనిపించింది. దీనికి సంబంధించి సంయుక్త కలెక్టరు కోర్టులో కేసు నమోదుకు అధికారులు వివరాలు సమర్పించినట్లు తెలిసింది. తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉంది. తిరుమలలో లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబరు 21న విశాఖలోని సింహాచలం దేవాలయంలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆహార భద్రతాధికారులు తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరించారు. ఆ సమయంలో ప్రసాదాల తయారీకి వినియోగించే పలు నమూనాలు హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించారు.

**నెయ్యిలో కల్తీలేదట:** తనిఖీల సమయంలో సేకరించిన నెయ్యిలో ఎటువంటి కల్తీ లేదని తేలింది. ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలకు లోబడి, అసాధారణ స్థాయికి మించి కొవ్వు లేనట్లు అందులో గుర్తించినట్లు తెలిసింది. నమూనాలు



సేకరించిన సమయంలో సింహాచలం దేవస్థానంలోని సరకుల నిల్వ కేంద్రంలో 945 కేజీల నెయ్యి నిల్వల నుంచి కొన్ని నమూనాలు సేకరించారు. వాటిని మొదట హైదరాబాద్‌కు పంపగా అక్కడి నుంచి మళ్లీ మైసూరులోని ప్రయోగశాలకు పంపించారు.

**ధ్రువీకరణకు దరఖాస్తు:** భక్తులకు శుచి, నాణ్యతగా ఉండే ప్రసాదాలు అందించేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇచ్చే భోగ్ (బ్లిస్‌ఫుల్ హైజినిక్ ఆఫరింగ్ గాడ్)ధ్రువీకరణకు సింహాచలం దేవస్థానం ఇటీవల దరఖాస్తు చేసింది. ఈ నేపథ్యంలో వినియోగిస్తున్న ఆహార పదార్థాలు, ప్రసాదాలు తయారు చేసే ప్రదేశం వంటివి తనిఖీ బృందాలు పరిశీలించాయి. వాటిని తయారు చేసే సిబ్బందికి ఎంతవరకు అవగాహన ఉందో ఆరా తీశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు మేరకు ఆ ప్రమాణాలు పాటిస్తే ఆ ధ్రువీకరణ రానుంది.

**ప్రసాదాలు** రోజువారి విక్రయించే లడ్డూలు: 25,000 రోజూ అన్న ప్రసాదానికి వచ్చే భక్తులు: 3,000 వారాంతాల్లో: 5,000

**సింహాచలానికి వచ్చే భక్తులు ఇలా..** 20,000 రోజూ వచ్చేవారు, 60,000 వారాంతాల్లో, 1,00,000 ప్రత్యేక రోజుల్లో

## అయిదంతస్తులు.. తీరనున్న అవస్థలు..

విశాఖపట్నం: జిల్లా స్థాయిలో ఆర్థిక శాఖకు చెందిన నాలుగు కార్యాలయాల నిర్వహణ కోసం నిర్మించిన "డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ (డీఐఎఫ్‌సీ)" భవనాన్ని వినియోగంలోకి తీసుకురావ డంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నూతన భవనాన్ని వెంటనే ప్రారంభిస్తే.. రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు తొలగుతాయి.

ప్రస్తుతం కలెక్టరేట్ ఆవరణలోని శిథిలమైన భవనంలో జిల్లా ఖజానా శాఖ కార్యాలయం, జిల్లా నీటి పారుదల శాఖ కార్యాలయంలో పే అండ్ అకౌంట్స్ కార్యాలయం కొనసాగుతుండగా, ఏపీజీఎల్ఐ (ప్రభు త్వ బీమా సంస్థ), స్టేట్ ఆడిట్ కార్యాలయాలు భవనాల్లో ఉన్నాయి.

**పూర్తయిన పనులు..!**

కలెక్టరేట్ సమీప జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయం ఆవరణలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఆ భవనాన్ని కూల్చేసి, అక్కడే రూ.25.20 కోట్లతో అయిదు అంతస్తుల భవన నిర్మాణానికి 2019లో శ్రీకారం చుట్టారు. అయిదేళ్ల పాటు సాగిన నిర్మాణ పనులు ఆరేడు నెలల కిందటే పూర్తయ్యాయి. ఒక్కో అంతస్తు 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో సిద్ధం చేసినా, నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు.

**విద్యుత్తు కనెక్షన్ లేక..**

తొలుత ఈ భవనానికి ఎల్టీ విద్యుత్తు కనెక్షన్ తీసుకున్నారు. అయిదు అంతస్తుల భవనం కావడంతో ఎల్టీ కుదరదని, హెచ్‌టీ కనెక్షన్



తీసుకోవాలని విద్యుత్తు శాఖ షరతు విధించింది. ఆ మేరకు హెచ్‌టీ కనెక్షన్ తీసుకున్నప్పటికీ... ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.24 లక్షల్ని ఈపీడీసీఎల్‌కు చెల్లించాలి. ఆ నిధుల్లేక ట్రాన్స్‌ఫారం ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

**వైకాపా పాలనలో..**వైకాపా పాలనలో విశాఖకు రాజధాని తరలిస్తారని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ట్రెజరీ డైరెక్టర్, సీఎఫ్ఎంఎస్ (సమగ్ర ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్) కార్యాలయం కోసం ఈ భవనాన్ని వినియోగిం చాలని భావించారు. అప్పట్లో అయిదు అంతస్తుల్లో రెండు అంతస్తుల్ని సీఎఫ్ఎంఎస్‌కు కేటాయించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మొత్తం భవనాన్ని జిల్లా స్థాయిలో ప్రభుత్వ శాఖలకు చెందిన ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకే వినియోగించనున్నారు. అయితే భవనాన్ని నిర్మించిన గుత్తేదారుడికి ఇంకా రూ.3.50 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్టు సమాచారం. భవ నం ప్రారంభానికి ఉన్న అడ్డంకుల్ని తొలగించి, త్వరలోనే వినియోగం లోకి తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) అధికారులు తెలిపారు.

# ఇసుకాసురుల వేట



చిత్తూరు : పేదల కోసం ప్రభుత్వం చీమ దూరే సందు ఇస్తే.. దాన్ని ఇసుకాసురులు ఏనుగులు పట్టే దారిలా మార్చి రెచ్చిపోతున్నారు. స్థానికంగా నదుల్లో ఇసుక లభ్యత ఉన్నా జాతీయ హరిత ట్రైబ్యునల్ మార్గదర్శకాలు అనుసరించి యంత్రాలు వినియోగించడం లేదు. జిల్లాలో ఇసుక కొరత తలెత్తగా అన్నమయ్య జిల్లా నుంచి తెప్పిస్తోంది. స్థానికంగా ఇసుక ఉంటే ఇల్లు కట్టుకునే వారు పొక్లెయిన్లు వాడకుండా సమీప నదులు, వాగులు, వంకల నుంచి తెచ్చుకోవచ్చని స్పష్టం చేసింది. దీన్నే అదనుగా చేసుకొని అక్రమార్కులు ఎక్కడికక్కడ యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఇసుక తవ్వకాల విషయంలో ప్రభుత్వం పక్కాగా పర్యావరణ నిబంధనలు పాటిస్తుండగా అక్రమార్కులు మాత్రం తూట్లు పొడుస్తున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న రేణిగుంట, తిరుపతి గ్రామీణ మండలాల్లో ప్రధానంగా ఈ పరిస్థితి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు, రవాణాదారుల తాకిడితో స్వర్ణముఖి నదీ పరీవాహకం జాతరను తలపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

**ప్రభుత్వ ఆదేశాలిలా..**

కొంతకాలం కురిసిన వర్షాల కారణంగా స్వర్ణముఖి నదిలో ఇసుక మేటలు వేసింది. అవసరమున్న పేదలు, నిర్మాణదారులు ట్రాక్టర్లలో ఉచితంగా తెచ్చుకోవచ్చు. ఏదైనా ఇబ్బంది ఉంటే యజమానులకు రవాణా ఛార్జీలు చెల్లించి ఇంటి వద్దకే తోలించుకోవచ్చు. ముందుగా గ్రామ సచివాలయంలో అనుమతి పొందాలి. తవ్విన ఇసుకను స్థానికంగానే వినియోగించుకోవాలి. నిల్వ చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తే జరిమానా విధించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. నదీగర్భాన్ని ఛిద్రం చేయకూడదని స్పష్టం చేసింది.

**అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు**

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సాంకేతికతను విరివిగా వాడాలని సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో స్వర్ణముఖి నది వద్ద అక్కడక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాకపోతే అవి అలంకారప్రాయంగా మారాయి. ఇవి పనిచేస్తున్నాయా? లేదా? అని గనుల శాఖ అధికారులు దృష్టి పెట్టలేదు. దీంతో రవాణాదారులు మరింత రెచ్చిపోతున్నారు.

**నదిలో రోడ్డేసి.. ప్రవాహం మళ్లించి..**

రేణిగుంట మండలం తండ్లం, కొత్రమంగళం, తిరుపతి గ్రామీణ మండలం పాడిపేటలో ఇందుకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అక్రమార్కులు తవ్వకాలు చేస్తున్నారు. ఏకంగా స్వర్ణముఖి నదిలోకి రోడ్డేసి.. ప్రవాహాన్ని మధ్యలో మళ్లిస్తున్నారు. ఇటువంటి ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాల్సిన గనుల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

**రోజూ 300- 400 ట్రాక్టర్లలో..**

తండ్లం, కొత్రమంగళం, పాడిపేటలో గంటకు 30- 40 ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజూ కనీసం 300- 400 వాహనాల ఇసుకను కొల్లగొడుతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2,500- రూ.3వేలు వసూలు చేస్తున్నారు. రమారమి రోజూ రూ.8 లక్షలు- రూ.12 లక్షల వరకు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోంది. నది పక్కనే ఉన్న చెట్ల వేర్లు బయటకు కనిపిస్తున్నాయంటేనే నిబంధనలు ఎలా అమలవుతున్నాయో ఇట్టే అర్థమవుతోంది.

**అరుణానది అరణ్యఘోష**

అరుణానది నదీ పరీవాహక ప్రాంతాలైన నారాయణవనం, అరణ్యం కండ్రిగ, సుబ్బానాయుడు కండ్రిగ, చిత్తూరు కండ్రిగ, పాలమంగలం, తిరువట్యం, తుంబూరు, సముదాయం ప్రాంతాల్లో జేసీబీలతో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. నిల్వచేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్రమార్కులు ఇష్టారాజ్య తవ్వకాలతో నదీ పరివాహక ప్రాంతంలో బావులు, బోర్లల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సాగునీటికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల రైతులు వాహనాలు వెళ్లకుండా నది చుట్టూ కందకాలు (గోతులు) తవ్వారు. శ్మశానాలను వదలడం లేదు. ఇసుక అక్రమరవాణా నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ జయరాములు తెలిపారు.

# వైకాపా పాపం.. ప్రజాధనం దుర్వినియోగం



వి.కోట : అప్పటి తెదేపా హయాంలో ప్రారంభమైన పలు పనులను వైకాపా అధికారంలోకొచ్చాక గాలికొదిలేయడంతో రూ.కోట్లలో ప్రజాధనం దుర్వినియోగమైంది. ఐదేళ్లుగా వాటి పునఃప్రారంభం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

**శీతలగిడ్డంగి.. పిల్లర్లకే**

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచడానికి అప్పటి తెదేపా ప్రభుత్వం వి.కోటలో శీతలగిడ్డంగి మంజూరు చేసింది. స్థానిక గెస్తింపల్లె వద్ద రూ.2కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించింది. నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయికి వచ్చేలోపు ప్రభుత్వం మారింది. అనంతరం వైకాపా ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో ఎక్కడి పనులక్కడే ఆగిపోయాయి.

**మినీస్టేడియం.. అధ్వానం**

గత తెదేపా ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ఇండోర్ మినీస్టేడియం పనులు చేపట్టింది. వైకాపా పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం ఆగిపోయి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో అధ్వానంగా తయారైంది. రూ.లక్షల ప్రజాధనం నిరుపయోగమైంది.

**అంబేడ్కర్ భవనం.. నిధుల్లేక**

మండల పరిధిలో దళితుల అభ్యున్నతికి, సమావేశాలకు అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.1.10 కోట్ల వ్యయంతో అంబేడ్కర్ భవనం పనులు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించింది. కానీ వైకాపా నిధులు కేటాయించలేదు. దీంతో పనులు పిల్లర్ల దశలో ఆగిపోయాయి.

**ఇంకెన్నో..**స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.80లక్షల వ్యయంతో బీసీ భవనం పనులు పూర్తై గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయక ప్రారంభానికి నోచుకోలేదు. డిగ్రీ కళాశాల, మైనార్టీబాలికల ప్రభుత్వ జూనియర్ వసతి కళాశాల, షాదిమహల్ ఇతర నిర్మాణాలనూ వైకాపా గాలికొదిలేసింది.

# హడ్కోపైనే టిడ్కో ఆశలు



శ్రీకాళహస్తి : హడ్కో రుణం సమకూరితే కూటమి ప్రభుత్వం నిర్దేశించినట్లు నాలుగైదు నెలల్లోనే టిడ్కో ఇళ్లు సొంతమవుతాయని లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. టిడ్కో గృహ సముదాయాల్లో అంతర్గత అభివృద్ధికి రూ.4400 కోట్లు హడ్కో రుణం మంజూరు చేసేందుకు ఆమోదం తెలియజేసినట్లు ఇటీవల పురపాలక శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పురపాలికలకు ఆశించిన మేర నిధులు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

**వైకాపా తీరుతో భారీ నష్టం**

వైకాపా అధికారంలోకి వచ్చే సమయానికి జిల్లాలోని ఐదు పురపాలికల పరిధిలో 12,442 గృహాలు పూర్తయ్యాయి. నాలుగేళ్ల పాటు వీటి అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గృహాల రూపురేఖలు మారి అసాంఘిక కార్యకలాపాలకు నెలవయ్యాయి. సరైన భద్రత లేకపోవడంతో ఇళ్లకు అమర్చిన ద్వారబంధాలు, కిటికీలు, తలుపులు, ఇతరత్రా గృహోపకరణాలు చోరీకి గురయ్యాయి. నిరుపయోగంగా మారిన వీటిని బాగు చేసి అందుబాటులోకి తేవడంపై వైకాపా ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. దీనికి తోడు ఆ పార్టీ రంగులు వేయడంతో దాదాపు రూ.24 కోట్లు అదనపు భారం పడింది.

**ప్రణాళికలు సిద్ధం**

టిడ్కో గృహ సముదాయాల్లో అంతర్గతంగా చేపట్టాల్సిన అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పుర అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధానంగా విద్యుదీకరణ, అంతర్గత రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీటి వసతి తదితరాలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. నిర్మాణం పూర్తయిన భవనాల్లో గదులకు గత ప్రభుత్వ హయాంలో చోరీకి గురైన తలుపులు, ద్వారబంధాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. హడ్కో రుణం అందుబాటులోకి వస్తే ఈ పనులన్నీ పూర్తిచేసి నాలుగైదు నెలల్లో గృహప్రవేశాలకు వీలుగా అందుబాటులోకి తెచ్చేందుకు చూస్తున్నారు.

# సివిల్ దందాలు.. బుకీలతో సంబంధాలు..!

విశాఖపట్నం: ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ గంగరాజుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాతో సంబంధాలు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయి. విచారణలో అవన్నీ వాస్తవమని తెలియడంలో అతన్ని సీపీ సస్పెండ్ చేశారు. ఇటీవల నగరంలో శ్వాస విశ్లేషణ (డ్రంక్ అండ్ డ్రైవ్)లో పరీక్షల్లో పలువురు వాహనచోదకులు చిక్కారు. వారిలో కొందరిని పోలీసులు వదిలేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరు ఎస్.ఐ.లు, ఒక కానిస్టేబుల్‌ను సీపీ సస్పెండ్ చేశారు. అవినీతికి పాల్పడుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిపై నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చర్యలు తీసుకుంటున్నా చాలా మందిలో మార్పు రావడం లేదు. ప్రధానంగా పోలీసు స్టేషన్ వ్యవహారాలను పర్యవేక్షించే పలువురు సిబ్బంది చేతివాటంపై ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు అవినీతికి పాల్పడితే తన సెల్‌ఫోన్ నెంబరు 79950 95799కు ఫోన్ చేయాలని బాధ్యతలు స్వీకరించిన రోజే సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులు వచ్చినా, ఆధారాలు చూపించినా, సామాజిక మాధ్యమాల్లో అక్రమాలు



బహిర్గతమైనా స్పందించి చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఆయన దృష్టికి రానివి చాలా ఉంటున్నాయి.

ఒకేసారి 30 మందికి స్థాన చలనం: సీపీ నిత్యం ఏదో ఒక స్టేషన్‌ను తనిఖీ చేస్తున్నారు. నేర రికార్డులను పరిశీలిస్తున్నారు. సిబ్బంది సివిల్ కేసుల్లో తలదూర్చవద్దని ఆదేశాలు జారీ చేస్తున్నారు. పలువురు సీపీ ఆదేశాలను తోసిరాజని వ్యవహరిస్తున్నారు. కొందరు రౌడీషీటర్ల అసాంఘిక కార్యకలాపాలకు తెర వెనుక సహకరిస్తున్నారు. అందిన కాడికి దండుకుంటున్నారు. ఇటీవల విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలపై ఎస్‌బీ(స్పెషల్ బ్రాంచ్)లో ఒకేసారి 30 మందికి స్థానచలనం కల్పించారు.

**ఇవిగో కొన్ని ఉదాహరణలు..**

స్టేషన్ వ్యవహారాలు చూసే పలువురు సిబ్బంది సివిల్ దందాలు చేస్తున్నారని ఇటీవల సీపీకి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. నివేదిక వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. హార్బర్ పరిధిలో పలువురు మహిళలు ముఠాగా ఏర్పడి సరకులు, బొగ్గు అక్రమ రవాణా చేస్తున్నారు. స్థానికంగా ఉన్న కొందరు పోలీసులు వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. కంచరపాలేనికి చెందిన ఓ రౌడీషీటర్ నగర శివారులో జూద శిబిరాలు నడుపుతున్నాడు. అతనిపై ఈగ కూడా వాలడం లేదు. ఆయా స్టేషన్ల పోలీసులకు నెలవారీ మామూళ్లు ఇస్తుండడంతో వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదని చెబుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ రౌడీషీటర్ అన్ని స్టేషన్ల పరిధిలో దందాలు నిర్వహించాడు. ఇప్పుడూ అతని హవా సాగుతుండడం గమనార్హం. పీడీఎస్ బియ్యం యథేచ్ఛగా అక్రమ రవాణా అవుతోంది. అక్రమ రవాణాదారులు కొందరు పోలీసులను ప్రసన్నం చేసుకుంటున్నారు.

## ఆలోచించండి.. అదరగొట్టండి!

నర్సీపట్నం : వైజ్ఞానిక శాస్త్రంలో ప్రయోగాలు సమాజానికి ఎప్పుడు స్ఫూర్తిగా నిలుస్తుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతాయి. అందుకనే ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఈ దిశగా ప్రోత్సహించి భావి శాస్త్రవేత్తలు తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా వీటిపై పోటీలకు సన్నాహాలు చేస్తోంది. పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యేలా విస్తృత ప్రచారం చేపడుతోంది. తమ ప్రయోగాన్ని కేవలం వీడియో తీసి పంపితే బహుమతి పొందేలా వీటిని చేపట్టడం విశేషం. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఈ ఏడాది ఫిబ్రవరి నెల 28 తేదీన సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని 'యురేకా సైన్స్ ఎక్స్‌పో 2025' పేరిట ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ప్రయోగాలను వీడియో తీసి ఆన్‌లైన్లో పంపాలి. 'సైన్స్ అండ్ టెక్నాలజీ', 'పర్యావరణం- సుస్థిర అభివృద్ధి', 'మూఢ నమ్మకాలు- శాస్త్రీయ దృక్పథం' అంశాలపై చేపట్టే ప్రయోగాలను వివరిస్తూ అయిదు నిముషాలకు మించకుండా వీడియోలను తీయాల్సి ఉంది. ఫిబ్రవరి నెల 15వ తేదీ తుది గడువు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు అందజేయనున్నారు.

**జనవిజ్ఞాన వేదిక...** మూడేళ్లుగా విద్యార్థులకు వైజ్ఞానిక శాస్త్రంలో నూతన ఆవిష్కరణలపై పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ఈ పోటీలు లక్ష్యం. ఏటా చెకుముకి పోటీలకు తోడు సైన్స్ ప్రయోగాలను ప్రోత్సహిస్తోంది. వీటి ద్వారా వైజ్ఞానిక సిద్ధాంతాలను



బాగా ఆకళింపు చేసుకుంటారని భావిస్తోంది. సృజనాత్మ కత, నైపుణ్యం అభివృద్ధికి సైతం దోహదపడే వీటిలో పాల్గొనేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతి విద్యార్థులంతా వీటికి అర్హులు. స్కూళ్లలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు దీనిపై అవగాహన కార్యక్రమాలకు తోడు ప్రచార కరపత్రాలు విడుదల చేస్తున్నారు. విధి విధానాలను వీడియోల ద్వారా ఉపాధ్యాయులకు వివరిస్తున్నారు. **వెయ్యి మంది వరకు అంచనా..** సైన్స్ ప్రయోగాల పోటీలకు స్పందన బాగుంది. జిల్లా నుంచి వెయ్యి మంది వరకు పాల్గొంటారని అంచనా వేస్తున్నాం. గత ఏడాది 300 మంది వరకు పాల్గొన్నారు. చాలా బడుల్లో ప్రయోగశాలలకు తగిన సదుపాయాలు లేక విద్యార్థులు వీటికి దూరమవుతున్నారు. పోటీలతో వీరిలో అవగాహన పెంపొందించాలని జనవిజ్ఞాన వేదిక తలపెట్టింది. విజేతల వివరాలను ఫిబ్రవరి 28న, ప్రకటించనున్నాం. మరిన్ని వివరాల కోసం 93985 24988 ఫోను నంబరు ద్వారా సంప్రదించొచ్చు..కె.త్రిమూర్తులరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చురకలు

బుధవారం 26 ఫిబ్రవరి 2025

# ఎత్తిపోతలు.. ఎదురుచూపులు

కుప్పం : కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 42 కిలోమీటర్ల పరిధి ప్రవహిస్తున్న పాలారు నదీ జలాలను స్థానిక అవసరాలకు వినియోగించుకోవాలన్న ఆశయంతో తెదేపా ప్రభుత్వం స్థాపించిన ఎత్తిపోతల పథకాలు వైకాపా సర్కారు నీరుగార్చింది. కుప్పంపై ఐదేళ్ల కక్ష సాధింపులో భాగంగా.. పాలారు ఎత్తిపోతలనూ జగన్ సర్కారు నిర్లక్ష్యం చేసింది.

తెదేపా హయాంలో సమృద్ధిగా ఏటా వర్షాకాలంలో పొంగి ప్రవహించే పాలారు జలాలు చెరువులకు మళ్లించే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. రెండున్నర దశాబ్దాల కిందట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి హయాంలో ఏపీఎస్ఐడీసీ ద్వారా రూ.కోటి వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. వి.కోట మండలంలోని చింతల ఎల్లాగరం,



రామకుప్పం మండలంలో కొళ్లపల్లె, శాంతిపురం మండలంలో మఠం, శివరామపురం వద్ద పంప్‌హౌస్‌లను నిర్మించి.. చెరువులకు పైపులైన్లను ఏర్పాటు చేశారు. కొన్నేళ్లపాటు పాలారు వృథా జలాలు చెరువులకు చేరడంతో ఆయకట్టు భూములకు సాగునీటి వసతి సాకారమైంది.

**జగన్ జమానాలో హడావుడి చేసినా..**

2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన వెంటనే పాలారు ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తామని నాయకులు హడావుడి చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి పథకాల నిర్వహణకు నిధులు కోరుతూ అధికారుల ద్వారా ప్రతిపాదనలు అందినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం సాగునీటి వినియోగదారుల సంఘాలనూ పునరుద్ధరించలేదు.

**దుస్థితికి చేరువలో పంప్‌హౌస్‌లు**

మూడు మండలాల్లోని నీటి పథకాల పంప్‌హౌస్‌లు దుస్థితికి చేరాయి. కొన్ని చోట్ల విద్యుత్తు సామగ్రితోపాటు మోటార్లు, స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. మఠం, శివరామపురం వద్ద మోటార్లు, పంపులు, పైపులు తుప్పుపడుతున్నాయి. పలు చోట్ల విద్యుత్తు నియంత్రికలను తీసుకెళ్లిపోయారు. ఎత్తిపోతలు నిరుపయోగంతో చెరువులు బోసిపోయాయి. ఆయకట్టు బీడు వారింది.

**అన్నదాతల ఆశలు**

కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడం.. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నందున పాలారు ఎత్తిపోతలకు పూర్వవైభవం వస్తుందని అన్నదాతలు ఆశిస్తున్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరణకు కృషి చేస్తామని స్థానిక సాగునీటి సంఘం అధ్యక్షుడు కేజీ ఆనందనాయుడు తెలిపారు.

# మత్స్యశాఖకు సారథులేరీ..?

చిత్తూరు : తీవ్ర దుర్భరంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు జిల్లాలో చేయూత కరవైంది.. వారికి ప్రోత్సాహకాలు అందజేసి జీవనోపాధి మెరుగుపరిచేందుకు సారథులే లేరు.. ప్రస్తుతం జిల్లాలో మత్స్యశాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది.. ఇక్కడి అధికారి రాష్ట్ర కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు.. తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.. సదరు అధికారి లేకపోవడంతో పాలనా వ్యవహారాలు స్తంభించి రాయితీ పథకాలు కదలడం లేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

మత్స్యకారుల ప్రోత్సాహక రాయితీ పథకాలు అమలు అటకెక్కింది.



చేప పిల్లల పెంపకం, మత్స్యకారులకు రాయితీపై చేప పిల్లలు, బోట్లు, వలలు, మూడు చక్రాల బండ్ల పంపిణీ ఊసే లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు నిలిచిపోయింది. ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న తిరుపతి జిల్లా అధికారి పనిఒత్తిడి కారణంగా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.

**కదలని రాయితీ నిధులు..**

మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచి యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో కేంద్రం అమలు చేసిన ప్రధానమంత్రి మత్స్య యోజన జిల్లాలో అటకెక్కింది. వైకాపా హయాంలో ఈ పథకం అక్రమార్కులకు నిలయంగా మారింది. ఫిష్ ఆంధ్ర పేరుతో యూనిట్లు ఏర్పాటు చేయకుండానే రాయితీ నిధులు స్వాహా చేశారని ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ యూనిట్ల అక్రమాలపై దృష్టిసారించి అక్రమార్కుల భరతం పట్టింది. అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం వర్తింపజేసేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో అధికారి లేకపోవడంతో ప్రధానమంత్రి మత్స్య యోజన ఆగిపోయి రాయితీ నిధులు రూ.2 కోట్లు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి.

జిల్లాలో మత్స్య సహకార సంఘాలు: 31
సంఘాల సభ్యులు: 510
చెరువులు: 235
జలాశయం: ఒకటి
చేప పిల్లల పెంపక కేంద్రాలు: రెండు

**జిల్లా అధికారిని నియమించాలి..**

మత్స్య శాఖకు తక్షణమే జిల్లా అధికారిని నియమించాలి. అధికారి లేనందున మత్స్యకారులకు పథకాలు అందడం లేదు. రాయితీపై చేప పిల్లలు, వలలు, బోట్లు అందజేయాలి. రత్నం, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, మత్స్యకారుల సహకార సంఘం

# ఏటీఎం సాగుతో ఏడాదంతా సిరులే..



మడకశిర : కూలీలకు ఏ రోజు కూలి డబ్బులు ఆ రోజు అందుతుంటాయి. ఉద్యోగులకు నెలకోసారి జీతం వస్తుంది. కానీ రైతులు మాత్రం ఏడాదిలో ఒకట్రెండుసార్లు పంటను అమ్ముకున్నప్పుడే డబ్బులు కళ్లజూస్తారు. అయితే శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో కొంతమంది అన్నదాతలు ఎనీ టైమ్ మనీ(ఏటీఎమ్) పొందేలా కొత్త రకం వ్యవసాయానికి శ్రీకారం చుట్టి ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు. తక్కువ విస్తీర్ణంలోనూ మిశ్రమ పంటలు సాగు చేసి మంచి ఆదాయం ఆర్జించవచ్చని నిరూపిస్తున్నారు.

**34 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం**

మడకశిర నియోజకవర్గంలో 24,500 మంది రైతులు 34వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. ఇందులో 450మంది రైతులు 80ఎకరాల్లో ఏటీఎం పద్ధతిలో ఒక్కో రైతు 20 సెంట్లలో దాదాపు 20 రకాల పంటలు సాగు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. దీంతో పాటు 365 రోజులు ఆదాయం వచ్చే కంది, అలసంద, అనుమ, సజ్జ, ఆముదం, వంగ, టమోటా, మిరప, ఆకుకూరలు, బెండ, గోరుచిక్కుడు, బీర, కాకర, సొర, ముల్లంగి, క్యారెట్, బీట్రూట్ లాంటి పంటలను ఏ గ్రేడ్ పద్ధతిలో సాగు చేసి మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

**తక్కువ నీళ్లు చాలు..**తక్కువ విస్తీర్ణం, తక్కువ నీటితో దాదాపు 10 రకాల పంటలు మిశ్రమం గా సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు మడకిర నియోజకవర్గ అన్నదాతలు. ఇందులో ప్రధానంగా మహిళా రైతులు సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలు సాగు చేస్తుండటంతో వీరు పండించే కూరగాయలు, ఆకుకూరలకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉండటమే కాకుండా పొలాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత రైతులు ఏటీఎం పద్ధతిలో పంటలు సాగు చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. **50 సెంట్లలో రూ.1.51 లక్షల ఆదాయం**నాకున్న 50 సెంట్లలో ఏటీఎం పద్ధతిలో టమాటా, బెండ, గోరుచిక్కుడు, ఆకుకూరలు, వివిధ రకాల పూలు, ముల్లంగి, క్యారెట్ తదితర 20 రకాల పంటలు వేశా. పెట్టుబడి సాగు కోసం రూ.15వేలు ఖర్చు చేశాను. మొక్కలు నాటినప్పటి నుంచి ఘన, ద్రవ జీవామృతం ఎరువులుగా వాడుతున్నాం. పురుగులు ఆశిస్తే వేపాకు, గంజి, పేడ నీటిలో కలిపి మొక్కలకు పిచికారి చేశాం. ప్రస్తుతం టమోటా రెండు నెలలకే 8 క్వింటాళ్లు, బెండ 6 క్వింటాళ్లు, గొరు చిక్కుడు ఒక క్వింటా, వీటితో పాటు ముల్లంగి, క్యారెట్, కనకాంబరం, మల్లెపూలు పండించి విక్రయించగా రూ.1.66లక్షలు ఆదాయం వచ్చింది. ఇందులో రూ.15వేలు ఖర్చులు పోగా రూ.1.51 లక్షలు నికర ఆదాయం వచ్చింది. పుష్ప, మహిళా రైతు, మధూడి, అగలి మండలం

# యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం




ధర్మవరం : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరంలో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. పర్యవరణానికి విఘాతం కలిగించే పాలిథిన్ కవర్ల వినియోగంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వాటి నిషేధాజ్ఞలు అమల్లో పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రకటనలకే పరిమితమయ్యారు. వారు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఇబ్బడిముబ్బడిగా పాలిథిన్ కవర్ల వినియోగం జరుగుతోంది. జరిమానాలు విధించకపోవడంతో దుకాణాల్లో బహిరంగంగానే వాటి విక్రయం సాగుతోంది. వీధి వ్యాపారులు మొదలు కిరాణా దుకాణదారులు, హోటళ్లు, కూరగాయల, బేకరీల నిర్వాహకులు చికెన్, మటన్ కేంద్రాలు, పానీపూరి దుకాణదారులు వినియోగదారులకు పాలిథిన్ కవర్లలోనే పెట్టి తినుబండారాలు, సరకులు విక్రయిస్తున్నారు. కేఫ్‌లలో కవర్లలోనే కాఫీ, టీ పార్శిల్ ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు, నిపుణులు హెచ్చరికలు చేస్తున్నా చెవికెక్కడం లేదు.

120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న కవర్లపై నిషేధం ఉన్నా పురపాలక అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణాల్లో వాటి విక్రయం యథేచ్ఛగా సాగుతోంది. వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు చెత్త కుప్పల్లో, కాలువల్లో పేరుకుపోతున్నాయి. అవి అడ్డుపడి మురుగు కదలకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టణంలో రోజూ 73 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పన్నమవుతుండగా అందులో 5 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉన్నట్లు మున్సిపల్ అధికారుల అంచనా. ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన సదస్సులు, కార్యక్రమాలు గతంలో వ్యాపారులతో నిర్వహించి పురపాలక అధికారులు మిన్నకుండిపోయారు. వాటిని విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహించకపోవడంతో పట్టణంలో రోజూ రూ.50వేలకు పైగా పాలిథిన్ కవర్ల వ్యాపారం జరుగుతోంది. కట్టడి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో పర్యవరణానికి నష్టం చేకూరుతోంతనా పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాం**

ప్లాస్టిక్ నిషేధంపై దశల వారీగా చర్యలు చేపట్టాం. మొదట దుకాణదారులకు అవగాహన కల్పించి వాటిని విక్రయించకుండా హెచ్చరికలు జారీ చేశాం. పాలిథిన్ కవర్లు విక్రయించే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకుని జరిమానాలు విధిస్తున్నాం. క్షేత్రస్థాయి లో సిబ్బంది పర్యటించి ప్లాస్టిక్ నిషేధం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.- ప్రమోద్‌కుమార్, పురపాలక కమిషనర్, ధర్మవరం

# ప్రగతి పేరుతో బిల్లుల మాయాజాలం



గుత్తి : గుత్తి పురపాలికలో రాష్ట్రాభివృద్ధి పథకం కింద చేపట్టిన పనుల్లో అక్రమాలు పాగా వేశాయి. కొన్ని కాలనీల్లో తూతూమంత్రంగా పనులు చేయగా మరికొన్ని చోట్ల చేయకుండానే బిల్లులు దండుకునేందుకు యత్నిస్తున్నారు. రూ.3 కోట్ల విలువ గల పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయి. గుంతకల్లులో 2018-19లో ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం నిధులు ఇవ్వగా వాటితో అప్పటి అధికారులు సిమెంట్ రోడ్లు, డబ్ల్యూబీఎం రోడ్లు, తాగునీటి పైపులైన్ విస్తరణ పనులు మంజూరు చేశారు. మొత్తం 50 పనులకు టెండర్లు నిర్వహించారు. అప్పట్లో గుత్తేదారులు చేసిన పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయి. నాసిరకంగా పనులు చేసి ఓ నాయకుడు, గుత్తేదారులు రూ.కోట్లు బిల్లులు పొందారు. తాజాగా ఐదు పనులకు సాధారణ నిధుల కింద రూ.24 లక్షల వరకు బిల్లులు పొందేందుకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. అక్కడక్కడ పనులకు పైపైపూతలతో ఇప్పటికే బిల్లులు తీసుకున్న గుత్తేదారులు మిగిలిన పనులకూ బిల్లులు చేయించుకునేందుకు కసరత్తు ప్రారంభించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


గుత్తిఆర్.ఎస్.లోని రెహనా పాఠశాల వద్ద రోడ్డు వేసినట్లు బిల్లు తీసుకున్నారు. ఇలా 25 వార్డుల్లో రూ.3 కోట్లతో పనులు జరిగినట్లు ఇంజినీర్లు కొలతల నమోదు పుస్తకంలో నమోదు చేశారు. నిర్ణీత సమయంలో పనులు చేయకుంటే నిధులు వెనక్కు వెళ్తాయోమోనని అధికారులు గుత్తేదారులతో పనులు హడావుడిగా చేయించారన్న ఆరోపణలున్నాయి. ఆయా పనులన్నీ నాసిరకం ఉన్నాయి. పైపైపూతలు వేసి బిల్లులు స్వాహా చేశారు.

**పరిశీలించి చర్యలు -జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

ఎస్‌డీఎస్ కింద చేసినట్లుగా చూపుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. పనులుంటేనే బిల్లులు గుత్తేదారులకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం. పనులు క్షేత్రస్థాయిలో లేకుంటే బిల్లు ఇచ్చేదిలేదు. కచ్చితంగా పనులను చూసే బిల్లులు చెల్లిస్తాం. ప్రస్తుతం ఎలాంటి నిధులు లేవు.

# అక్రమాల నిర్ధారణ

చిత్తూరు : వైకాపా హయాంలో చిత్తూరు కమిషనర్‌గా అరుణ పనిచేసిన కాలంలో చోటుచేసుకున్న అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఆమెపై వచ్చిన అభియోగాలపై విచారణ చేసిన బృందం 2022 నుంచి 2024 మధ్య అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు నిర్ధారించింది. దొంగ బిల్లులు, ఇతర మార్గాల ద్వారా నగరపాలక సంస్థ నగదును కొందరు సిబ్బంది సహకారంతో స్వాహా చేసినట్లు గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఆమెతోపాటు సంబంధిత అధికారులపై చర్యలకు ఉపక్రమించనున్నారు. చిత్తూరు పూర్వ కమిషనర్ అరుణ భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తడంతో పురపాలక శాఖ అనంతపురం ప్రాంతీయ సంచాలకులు(ఆర్డీ) విశ్వనాథ్ ఆధ్వర్యంలోని ఎనిమిది మంది సభ్యుల విచారణ బృందం ఈ నెల ఎనిమిదో తేదీన విచారణ ప్రారంభించింది.



**అభియోగాలపై వివరాల సేకరణ**

పారిశుద్ధ్య పనులకు అవసరమైన బ్లీచింగ్, చెత్త బుట్టలు, గ్లౌజులు, ఫాగింగ్ యంత్రాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందగా విచారణ బృందం పలు దస్త్రాలు పరిశీలించి సమచారాన్ని సేకరించింది. 35 వాహనాలకు పెట్రోలు, డీజిల్ వినియోగించినట్లు రూ.62 లక్షల వరకు దొంగ బిల్లులు సృష్టించినట్లు ఆరోపణలు రాగా.. వాటి చెల్లింపు, వాహనాలు ఎన్ని కిలోమీటర్లు తిరిగాయనే వివరాలు నమోదు చేసుకున్నారు. వాహనాల మరమ్మతుకు రూ.లక్షలు వ్యయం చేయగా ఆ బిల్లులతో పాటు వాహనాల కండిషన్ పరిశీలించారు. వైకాపా హయాంలో నిర్వహించిన జగనన్న వైద్యశిబిరాలకు రూ.లక్షల్లో పెట్టిన బిల్లుల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. భవన నిర్మాణాలకు పట్టణ ప్రణాళిక విభాగం ఇచ్చిన అనుమతి, నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రెవెన్యూ విభాగం ద్వారా భవనాలకు ఆస్తిపన్ను నిర్ధారణ, యాజమాన్య హక్కు బదిలీ తదితర సేవలు.. ఇంజినీరింగ్ విభాగం చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు తనిఖీ చేశారు. అకౌంట్స్ విభాగంలో కీలక దస్త్రాలు పరిశీలించారు.

# పోషణ వాటిక.. ఆరోగ్యానికి బాసట

చౌడేపల్లె : సమగ్రశిశు అభివృద్ధి సేవల్లో భాగంగా పోషణ వాటిక పేరుతో ప్రభుత్వం బడితోటల పెంపకం చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లోనే ఆకుకూరలు, కూరగాయల సాగుకు వెసులుబాటు కల్పించింది. వర్షపునీటి వినియోగం, మౌలిక వసతుల అభివృద్ధి పేరిట ఎంపిక చేసిన ఒక్కో కేంద్రానికి రూ.40,800లు మంజూరు చేసింది. ఇందులో పోషణవాటిక నిర్వహణకు రూ.10వేలు కేటాయించారు. నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పుంగనూరు పట్టణ అంగన్‌వాడీ కేంద్రాలకు పుంగనూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాలకు పులిచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 380 అంగన్‌వాడీ కేంద్రాలు, 7,901మంది విద్యార్థులు, 192 పోషణవాటికలు ఉన్నాయి.

**ఖాళీస్థలాలున్న కేంద్రాలు ఎంపిక**

మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఖాళీస్థలాలున్న వాటికి ప్రాధాన్యమివ్వడంతో పోషణవాటిక తోటలు వృద్ధి చెందుతున్నాయి. సేంద్రియ పద్ధతుల్లో తోటకూర, పాలకూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు, వంకాయ, మిరప, టమాటా, బీర, బెండ, బీన్స్ వంటి కూరగాయలు పెంచుతున్నారు. మొక్కలకు రక్షణగా చుట్టూ ఫెన్సింగ్



అమర్చారు. రోజూ చిన్నారులకు మెనూ ప్రకారం ఆకుకూరలతో తయారు చేసిన ఆహారాన్ని వడ్డిస్తున్నారు. మొదట్లో ఆకుకూరల పెంపకం చేపట్టిన కేంద్రాల నుంచి బాలింతలు, గర్భిణులకు అందించినట్లు పుంగనూరు సీడీపీవో రాజేశ్వరి తెలిపారు.

చౌడేపల్లె-2 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త, సహాయకురాలు ఇద్దరూ కూరగాయల తోటలో మొక్కలకు నీరందిస్తున్నారు. ఈ కేంద్రంలో 25మంది విద్యార్థులు, ఐదుగురేసి గర్భిణులు, బాలింతలున్నారు. పచ్చని తోటను చూసిన స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చౌడేపల్లెలోని పెద్దయల్లకుంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూరలు మొదటి కోత పూర్తవడంతో ఎరువులు వేసి రెండో పంటల అంతర్‌పనులు సాగుతున్నాయి. ఈ తోటకు కంచెలో వేసిన గుమ్మడి చెట్ల కాయలను వినియోగించుకుంటున్నారు.

పుంగనూరులోని మాగాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో ఆకుకూరల పెంపకం చేపట్టారు.

**ఎంపికైన ప్రతి కేంద్రంలోనూ**

పోషణ వాటిక కింద ఎంపికైన ప్రతి కేంద్రంలో ఆకుకూరలు, కూరగాయల తోటలు సేంద్రియ ఎరువుతోనే వృద్ధి చెందుతున్నాయి. ఆయా గ్రామాల్లో గల మహిళలు వాటిని చూసి వారి ఇళ్ల వద్ద సొంతం గా పెరటి తోటల పెంపకం చేపట్టారు. ఈ పోషణవాటికలను మరింత విస్తరింపచేయడానికి చర్యలు తీసుకుంటాం. రాజేశ్వరి, సీడీపీవో, పుంగనూరు




## రకుల్ ప్రీత్ సింగ్.. మోడ్రన్ లుక్‌లో అదిరిపోయే స్టైల్!

రకుల్ ప్రీత్ సింగ్.. ఎప్పుడూ కూడా తన గ్లామర్ స్టైల్‌తో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసే హీరోయిన్. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోషూట్ ఇమేజస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. తెల్లటి కార్సెట్ టాప్, బ్లాక్ కార్గో ప్యాంట్ ధరించి, స్టైలిష్ పోజులతో రకుల్ ఆకట్టుకుంటోంది. ఆమె తన ఫేవరేట్ అవుట్‌ఫిట్ అంటూ ఈ ఫోటోలను షేర్ చేయడం, నెటిజన్లను మరింత ఆకర్షిస్తోంది. ఫొటోల్లో రకుల్ ప్రీత్ సింగ్ తన లుక్‌కి మోడ్రన్ టచ్ ఇస్తూ సింపుల్ యట్ క్లాసీ స్టైల్‌లో కనిపించింది. ఆమె ధరించిన వైట్ కార్సెట్ టాప్ ఆమె ఫిట్‌నెస్‌ను హైలైట్ చేస్తోంది. ముఖ్యంగా నడుము వయ్యారాలు మరింత హైలెట్ అవుతున్నాయి. బ్లాక్ ప్యాంట్‌తో కలిపిన ఈ అవుట్‌ఫిట్ ఆమె లుక్‌కి మరింత బూస్ట్ ఇచ్చింది. మెటాలిక్ హాండ్ జ్యూవెల్రీ, హూప్ ఇయర్రింగ్స్, స్టైలిష్ షూస్ తో ఆమె లుక్ మెరిసిపోతోంది.



ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫోటోలను పంచుకుంటూ, ఇలా ఉండే అవుట్ ఫిట్స్ నా ఫేవరేట్ అనే క్యాప్షన్ ఇచ్చింది రకుల్. ఈ లుక్‌లో ఆమె తన సొగసుతో మాత్రమే కాకుండా, తన కాన్ఫిడెన్స్ తో కూడా మెరిసిపోతుంది. ఆమె చూపులు, ఎక్స్‌ప్రెషన్స్ ఈ ఫోటోలకు మరింత లైఫ్ ఇస్తున్నాయి. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో బిజీగా ఉంది. బాలీవుడ్‌లో కొన్ని ప్రాజెక్ట్స్ చేస్తూనే, సౌత్ చిత్ర పరిశ్రమలో కూడా తన గుర్తింపు కాపాడుకుంటోంది. ఈ ఫొటోషూట్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించాయి. ఇక చివరగా తెలుగులో అమ్మడు 2021లో కొండపొలం అనే సినిమాలో కనిపించింది. ఆ తరువాత బాలీవుడ్ లో అలాగే తమిళంలో బిజీగా కనిపించింది. ముఖ్యంగా ఆమె ఆశలు పెట్టుకున్న కొన్ని సినిమాలు సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. ఇండియన్ 2 బిగ్గెస్ట్ డిజాస్టర్ గా నిలివడం కూడా ఆమె కెరీర్ పై ప్రభావం చూపింది. మరి రాబోయే ఇండియన్ 3తో అయినా అమ్మడు ఫామ్ లోకి వస్తుందో లేదో చూడాలి.

## అలాంటి సీన్స్ కు కూడా రెడీ అంటున్న రీతూ వర్మ

కెరీర్ స్టార్టింగ్ నుంచి క్లీన్ ఇమేజ్ తో ముందుకు కొనసాగుతుంది తెలుగమ్మాయి రీతూ వర్మ. ఇప్పటివరకు తాను ఎలాంటి అసభ్యకర సీన్స్ లోనూ నటించింది లేదు. గ్లామర్ షో కూడా పెద్దగా చేయలేదు. కానీ అన్ని సందర్భాల్లో అలాంటి ఇమేజ్ పనికి రాదని రీతూకి అర్థమైంది. రీతూ ఇప్పటివరకు గ్లామర్ పాత్రలు చేయకపోవడంతో ఆమెకు పెద్ద ఛాన్సులు రావడం లేదు. రీతూకి వరుస ఆఫర్లు వస్తున్నప్పటికీ ఆమె క్లీన్ ఇమేజ్ ఉన్న పాత్రలే చేస్తూ వస్తుంది. ప్రస్తుతం రీతూ నటించిన మజాకా సినిమా ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో సందీప్ కిషన్ రీతూ వర్మకు ముద్దులు పెట్టాడు. దీంతో ఆ వీడియో ఒక్కసారిగా వైరలైపోయింది. ప్రమోషన్స్ లో భాగంగా రీతూ ఆ వీడియోపై రెస్పాండ్ అయింది. సందీప్ తనకు ముద్దులు పెట్టిన వీడియో సినిమా ప్రమోషన్స్ లో భాగమని, అయినా అలాంటి సన్నివేశాలు చేయడానికి తానేమీ వ్యతిరేకం కాదని, కథ డిమాండ్ చేస్తే హగ్, కిస్ సీన్స్ కూడా చేస్తానని చెప్తోంది రీతూ. రీతూ చేసిన



ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో పాటూ గతేడాది తన నుంచి వచ్చిన స్వాగ్ సినిమా గురించి రీతూ మాట్లాడింది. స్వాగ్ సినిమా చేస్తున్నప్పుడే అది అందరికీ నచ్చే జానర్ కాదని, అందరినీ మెప్పించలేదని అనుకున్నామని, ఆ సినిమాలోని డెప్త్ చాలా మంది అర్థం చేసుకోలేరని అప్పుడే తాను అనుకున్నట్టు చెప్పిన రీతూ, సినిమా రిజల్ట్ విషయంలో తనకేం బాధగా అనిపించలేదని, తన వరకు మాత్రం నటిగా ఆ సినిమా మంచి సంతృప్తినిచ్చినట్టు తెలిపింది. పెళ్లి చూపులు సినిమా తనకెంతో స్పెషల్ అని, ఫ్రెండ్స్ అంతా కలిసి చిన్న బడ్జెట్ లో చేసిన సినిమా అని, దాని రిజల్ట్ ఎలా ఉంటుందనేది ముందు అసలు ఊహించలేదని, మంచి సినిమా చేస్తున్నామనే ఆలోచనతో చేసిన సినిమా పెళ్లి చూపులు అని, కానీ రిలీజ్ తర్వాత ఆ సినిమా తమ జీవితాలను మార్చేసిందని రీతూ తెలిపింది. విజయ్ దేవరకొండ ఏదొక రోజు సక్సెస్ అవుతాడనుకున్నా కానీ ఇంత పెద్ద స్టార్ అవుతాడని ఊహించలేదని చెప్తున్న రీతూ వర్మ, పెళ్లి చూపులు2 ను కూడా తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహిస్తేనే బావుంటుందని అభిప్రాయపడింది. అన్నీ కుదిరి ఛాన్స్ వస్తే విజయ్, తాను కలిసి పెళ్లి చూపులు2 చేస్తామని రీతూ తెలిపింది.


## ఛావా బాక్సాఫీస్.. మొదటి రోజు కంటే 10వ రోజు ఎక్కువ!



2025లో హిందీ సినీ ప్రపంచంలో మరో సెన్సేషన్‌గా నిలుస్తున్న చిత్రం చావా. మరాఠా సామ్రాజ్యంలో రెండో రాజు అయిన శంబాజి జీవితకథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం, లక్ష్మణ్ ఉతేకర్ దర్శకత్వంలో తెరకెక్కింది. మాడాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దినేష్ విజన్ నిర్మించిన ఈ సినిమాలో విక్కీ కౌశల్, రష్మిక మందన్నా, అక్షయ్ ఖన్నా ముఖ్యపాత్రలు పోషించారు. శివాజీ సావంత్ రాసిన చావా అనే మారాఠీ నవల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలకు ముందే మంచి హైప్ సొంతం చేసుకుంది. సినిమా విడుదలైన తర్వాత ఆ హైప్ కాస్త బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టిస్తోంది. ఈ సినిమా మహారాష్ట్రలో మాత్రమే కాదు, ఉత్తరభారతదేశంలోనూ భారీ రెస్పాన్స్‌ని రాబట్టింది. ముఖ్యంగా ముంబై, పుణె ప్రాంతాల్లో ప్రతి షో హౌస్‌ఫుల్ బోర్డులతో నడుస్తోంది. ఈ కథలోని మరాఠా శంబాజి త్యాగం, పోరాటం ప్రేక్షకులను ఆవేశపరుస్తున్నాయి. కలెక్షన్ల పరంగా కూడా చావా అసలు సత్తా చూపుతోంది. విడుదలైన మొదటి రోజే 33.10 కోట్లు రాబట్టిన ఈ సినిమా, రెండో రోజు 39.30 కోట్లు, మూడో రోజు 49.03 కోట్లు వసూలు చేసింది. వీకెండ్ ముగిసే సమయానికి ఈ సినిమా దాదాపు 121.43 కోట్లు వసూలు చేయడం విశేషం. వీకెండ్ తర్వాత కూడా సినిమా వేగం తగ్గలేదు.సినిమా విజయంలో ప్రధాన కారణం విక్కీ కౌశల్ నటన. శంబాజిగా విక్కీ ప్రదర్శించిన నటన ప్రతి ప్రేక్షకుడిని కదిలించింది. ముఖ్యంగా ఆయన ఎమోషనల్ సీన్స్, యుద్ధ సన్నివేశాల్లో చూపించిన ఆవేశం, తండ్రి శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలనే తపనను పర్ఫెక్ట్‌గా ప్రదర్శించాడు. రష్మిక మందన్నా కూడా తన పాత్రలో అద్భుతంగా నటించింది. చావా జీవితంలో ఆమె పాత్ర ఎంత కీలకమో, అదే రీతిలో ఈ సినిమాలోనూ ఆమె ప్రదర్శన ఆకట్టుకుంది. కలెక్షన్ల పరంగా చూస్తే మొదటి రోజు 33.10 కోట్లు ఉన్న వసూలు, మూడో రోజు 49.03 కోట్లకు పెరగడం, ఆ తర్వాత కూడా నాలుగో, ఐదో రోజుల తర్వాత కూడా స్థిరంగా 25-32 కోట్ల మధ్య సాగుతుండటం విశేషం. నిజానికి ఒక హిస్టారికల్ మూవీకి ఇంత స్థిరమైన కలెక్షన్లు రావడం సాధారణం కాదు. కానీ శంబాజిగా జీవితకథలోని ఎమోషన్, మరాఠా గర్వం, కుటుంబ అనుబంధం ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూనే ఉంది. సినిమా బడ్జెట్ 130 కోట్లు. కానీ 10 రోజులకే ఈ సినిమా 334.51 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించడంతో నిర్మాతలకు భారీ లాభాలను తెచ్చింది. బిజినెస్ పరంగా చూస్తే, ఈ సినిమా సేఫ్ జోన్లోకి వెళ్లడమే కాదు, ఈ వారంలోనే లాభాల బాటలోకి చేరుతోంది. ఈ వసూళ్లతో విక్కీ కౌశల్ కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్గా నిలుస్తుందని ట్రేడ్ అనలిస్టులు చెబుతున్నారు.

**టాప్ 10 రోజుల కలెక్షన్లు (నెట్):** మొదటి రోజు: ?33.10 కోట్లు, రెండవ రోజు: ?39.30 కోట్లు,, మూడవ రోజు: ?49.03 కోట్లు, నాలుగవ రోజు: ?24.10 కోట్లు, ఐదవ రోజు: ?25.75 కోట్లు, ఆరవ రోజు: ?32.40 కోట్లు, ఏడవ రోజు: ?21.60 కోట్లు, ఎనిమిదవ రోజు: ?24.03 కోట్లు, తొమ్మిదవ రోజు: ?44.10 కోట్లు, పదవ రోజు: ?41.10 కోట్లు, మొత్తం కలెక్షన్ (10 రోజులు): ?334.51 కోట్లు నెట్.

## సల్మాన్ సికందర్.. ఇదేం ట్విస్ట్ సామీ..!



సౌత్ డైరెక్టర్ ఏ.ఆర్ మురుగదాస్ డైరెక్షన్ లో బాలీవుడ్ యాక్షన్ హీరో సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా సికందర్. నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా మీద సల్మాన్ ఖాన్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు. కొన్నాళ్లుగా సరైన ఫాం లో లేని బాద్షా షారుఖ్ కూడా వరుస హిట్లు కొట్టి ట్రాక్ ఎక్కేశాడు. ఇక ఇప్పుడు సల్మాన్ వంతు వచ్చింది. సల్మాన్ ఖాన్ ఒకప్పటి సక్సెస్ మేనియా కోసం ఫ్యాన్స్ అంతా ఎదురుచూస్తున్నారు. అందుకే బాలీవుడ్ డైరెక్టర్స్ తో కాకుండా ఈసారి సౌత్ దర్శకుడి మీద నమ్మకం పెట్టుకున్నాడు. మురుగదాస్ టేకింగ్, డైరెక్షన్ అంతా నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది.

ఐతే దురదృష్టవశాత్తు డైరెక్టర్ గా ఆయన కూడా ఏమాత్రం ఫాం లో లేరు. అందుకే సల్మాన్, మురుగదాస్ సినిమాపై ఎలాంటి బజ్ లేదు. ఈ సినిమాకు ఒకే ఒక్క మ్యాజిక్ ఉంది అంటే అది రష్మిక మందన్న నటించడమే. బాలీవుడ్ లో రష్మిక హవా గురించి ఎంత చెప్పినా తక్కువే. అమ్మడు అక్కడ వరుస హిట్లతో దూసుకెళ్తుంది. రణ్ బీర్ కపూర్ తో యానిమల్, విక్కీ కౌశల్ తో చావా సినిమా చేసి సూపర్ హిట్ అందుకున్న రష్మిక సల్మాన్ ఖాన్ కి లక్ తెస్తుందా లేదా అన్నది చూడాలి. ఐతే ఈ సినిమాను మార్చి 30న రిలీజ్ లాక్ చేస్తున్నట్టు తెలుస్తుంది. మార్చి 30 అంటే ఆదివారం.. ఆరోజు ఎందుకంటే 31న పండగ ఉంది. సో రంజాన్ ఫెస్టివల్ కలిసి వస్తుందని అలా ప్లాన్ చేశారు. ఐతే అసలైతే ఫ్రైడే రిలీజ్ చేస్తే నాలుగు రోజులు వీకెండ్ కలిసి వచ్చేలా ఉంటుంది. కానీ సినిమా హిట్ టాక్ తెస్తే బెటరే కానీ నిరాశపరిస్తే కనీసం ఫెస్టివల్ టైం లో వచ్చే వసూళ్లు కూడా ఉండవని భావిస్తున్నారు. అందుకే సల్మాన్ సికందర్ సినిమాను మార్చి 30న రిలీజ్ అనుకుంటున్నారు.

ఐతే ప్రస్తుతం ఒక సినిమా తీయడం కన్నా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడమే ఎక్కువ ఇంపార్టెంట్ అనిపిస్తుంది. మార్చి 30 రిలీజ్ అంటే నెల రోజులు మాత్రమే ఉంది ఈలోగా సినిమా మీద ఆడియన్స్ లో ఒక ఇంపాక్ట్ కలిగేలా చేయాలి. సల్మాన్, రష్మిక మొదటిసారి జత కడుతున్న సికందర్ సినిమాలో ఈ జోడీ అలరిస్తుందని అంటున్నారు. సల్మాన్ ఫ్యాన్స్ మాత్రం ఈ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్నారు. మరి సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకుంటుందా లేదా అన్నది చూడాలి.

## చీరలో అనసూయ మాయ.. వావ్ అనాల్సిందే..

సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అనసూయ భరద్వాజ్ కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని చెప్పవచ్చు. రెగ్యులర్ ఆమె గ్లామరస్ ఫొటో షూట్స్ తో తన క్రేజ్ ను పెంచుకుంటోంది. రీసెంట్ గా అనసూయ భరద్వాజ మరోసారి తన అందం, స్టైల్ తో అభిమానులను ఆకట్టుకుంటోంది. తెలుపు రంగు చీరలో డిజైనర్ డ్రెస్ తో ఆమె ఇచ్చిన హావభావాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సింపుల్ లుక్ లో కూడా ఈ స్థాయిలో అందంగా కనిపించడమే అనసూయ స్పెషాలిటీ అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోషూట్ లో అనసూయ తళుక్కున మెరిసిపోతూ కనిపిస్తోంది. తెల్ల చీరపై ఆరంజ్ బోర్డర్ తో సాంప్రదాయ హంగులను కలిపిన ఆవుట్ ఫిట్ ఆమె అందాన్ని మరింత



హైలైట్ చేస్తోంది. నవ్వుతూ ఇచ్చిన పొజ్ లో అనసూయ గ్రేస్ ఫుల్ గా కనిపిస్తోంది. ఇయరింగ్ లు, వాచ్ తో తన స్టైల్ కు మరింత అందం చేర్చుకుంది. అనసూయ ఈ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగానే లైక్ ల వర్షం కురుస్తోంది. "మీ స్పీడ్ కంటే మీ డైరెక్షన్ చాలా ముఖ్యం" అంటూ ఇచ్చిన క్యాప్షన్ మరింత ఆకర్షణగా నిలిచింది. ఆమె చిరునవ్వు, కళ్లలోని తీయదనం ఫోటోలకు కొత్త హావను తెచ్చింది. ఈ మధ్య అనసూయ ఫ్యాషన్, ఫోటోషూట్ లతో నెట్టింట హాట్ టాపిక్ గా మారుతోంది. ఆమె పోస్ట్ చేసే ప్రతి లుక్ ట్రెండింగ్ అవుతూనే ఉంది. సినిమా ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నా, అనసూయ తన స్టైలిష్ లుక్స్ తో అభిమానులను ఎప్పటికప్పుడు కనువిందు చేస్తోంది. ప్రస్తుతం అనసూయ పలు సినిమాలు, వెబ్ సిరీస్ లతో బిజీగా ఉంది. అయితే, ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసే స్టన్నింగ్ ఫోటోలు మాత్రం ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంటాయి. ఈ లేటెస్ట్ చీర లుక్ తో అనసూయ మరోసారి ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## స్వీటీ అనుష్క స్టన్నింగ్ మేకోవర్

స్వీటీ శెట్టి అలియాస్ అనుష్క శెట్టి పరిచయం అవసరం లేదు. అరుంధతి, భాగమతి, బాహుబలి 1, 2 చిత్రాల్లో అద్భుత నటనతో ఆకట్టుకున్న అనుష్కకు బాషతో సంబంధం లేకుండా అన్నిచోట్లా అభిమానులు ఉన్నారు. ఈ బ్యూటీ చివరిగా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి అనే చిత్రంలో నటించింది. ఆ తర్వాత ఘాటి అనే థ్రిల్లర్ చిత్రంలోను నటిస్తూ బిజీగా ఉంది. ఇటీవలే విడుదలైన ఘాటి గ్లింప్స్ ఆకట్టుకుంది. ఇందులో ఊచ కోత కోసే అందమైన పల్లెటూరి అమ్మాయిగా అనుష్క నటిస్తోంది. అనుష్క గిరిజన యువతిగా నటించింది. శత్రువుల పీకలు కోసేంత ధైర్యవంతురాలైన యువతిగా



అనుష్క నటిస్తోందని పోస్టర్లు టీజర్ వెల్లడించాయి. ఘాటి చిత్రంలో మునుపటిలా స్మార్ట్ లుక్ తో కనిపిస్తోంది. అదే రూపంతో ఇప్పుడు అనుష్క ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. తాజాగా అనుష్క సరికొత్త మేకోవర్ కి సంబంధించిన ఫోటోలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో స్వీటీ శెట్టి ఎంతో సింపుల్ గా కనిపిస్తున్నా యూత్ హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది.

జేజమ్మ ఎంతో ముచ్చటగా కనిపిస్తోంది. సింపుల్ పంజాబీ దుస్తుల్లో అందమైన ఎక్స్ ప్రెషన్స్, స్మైలీ లుక్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా స్వీటీ ఫేస్ లో నవ్వు, ఆ నుదిటిన తిలకం బొట్టుతో ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ కొత్త లుక్ యూత్ సామాజిక మాధ్యమాల్లోకి దూసుకెళుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536